

ఈనాడు



కరీంనగర్ 1-3-2018 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 200

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

జయేంద్ర సరస్వతి అస్తమయం



- గుండెపోటుతో మరణించిన కంచి పీఠాధిపతి
- రాష్ట్రపతి, ప్రధాని, ఉప రాష్ట్రపతి సంతాపం 14లో





తరలిపోయిన వసంత కోకిల

- అధికార లాంఛనాలతో శ్రీదేవి అంత్యక్రియలు పూర్తి 11లో



కల్తీ సమర్పయామి!

పూజ సామగ్రినీ వదలని కేటుగాళ్లు.. నకిలీ పదార్థాలతో ద్రవ్యాల తయారీ

దీపారాధన నూనెలు, అగరబత్తీలు, గంధం, కుంకుమ.. అన్నింట్లోనూ కల్తీనే

ఆ ధూపం పీల్చడమే పాపం.. రోగాలు ఖాయం

ఈనాడు – హైదరాబాద్

పూజాసామగ్రి తయారీలో అక్రమార్కులు అందిన కాడికి దోచుకుంటున్నారు. దీపారాధన నూనెలు, అగర్‌బత్తులు, హారతి కర్పూరం, ఒత్తులు, గంధం, పసుపు, కుంకుమ తదితర సామగ్రి తయారీ వెనుక పెద్దఎత్తున దందా సాగుతోంది. కొందరు వ్యాపారులు తెరవెనుక నాణ్యతలేని పదార్థాలు, రసాయనాలతో పూజా సామగ్రి తయారుచేయిస్తూ భక్తుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. తక్కువ వ్యయంతో రూపొందించి భారీ లాభాలకు విక్రయిస్తున్నారు. తయారీ నుంచి మార్కెటింగ్, విక్రయాల వరకు ఒక గొలుసులా సాగుతున్న దోపిడీ తీరుపై 'ఈనాడు' ప్రత్యేక కథనమిది..

పూజా సామగ్రి మార్కెట్‌ను లెక్కకడితే కళ్లు తిరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా క్రయవిక్రయాలు రూ.కోట్లలో సాగుతున్నాయి. దీంతో నాణ్యతలేని సామగ్రి మార్కెట్‌ను ముంచెత్తుతోంది. తెలియక భక్తులు వీటినే కొనుగోలు



చేస్తున్నారు. ఈ సామగ్రి తయారీ అంతా చాలావరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కుటీరపరిశ్రమలా సాగుతోంది. వివిధ నూనెల తయారీ పరిశ్రమల నుంచి ముడిసరకును కొనుగోలుచేసి దానిలో పరిమళాలు, ఇతర నూనెలను కలిపి దీపారాధన నూనెలు తయారు చేస్తున్నారు. అగరబత్తీల తయారీ కూడా ఇలాగే సాగుతోందని విక్రయదారులు చెబుతున్నారు.

- కుంకుమ పెట్టుకుంటే శుభం సంగతి దేముడెరుగు.. చాలామందికి ముఖంపై చర్మ సంబంధమైన సమస్యలు ఎదురవుతున్నాయి.
- గంధం పేరుతో చిన్నచిన్న డబ్బాల్లోనూ నాణ్యతలేని (మిగతా 2లో)

అనిశాలో పురుషోత్తమ్‌రెడ్డి ప్రకంపనలు

- దర్యాప్తు నుంచి డీఎస్పీ అశోక్‌కుమార్‌ను తప్పించిన ఉన్నతాధికారులు
- గతంలో మరో ముగ్గురిపైనా బదిలీ వేటు
- అనూహ్య పరిణామాలపై సర్వత్రా చర్చ

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పూర్వ సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డి అక్రమాస్తుల కేసు అవినీతి నిరోధక శాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు దిగువ స్థాయి సిబ్బంది బదిలీ కాగా.. తాజాగా దర్యాప్తులో కీలక భూమిక పోషిస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్‌ను దర్యాప్తు నుంచి తప్పిస్తూ ఉన్నతాధికారులు బుధవారం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో వరంగల్ రేంజ్‌కు చెందిన బి.వి.సత్య నారాయణను నియమించారు. ఈ అనూహ్య పరిణామం ఇప్పుడు అవినీతి నిరోధక శాఖ (అనిశా)తోపాటు.. అన్ని వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ పూర్వ సంచాలకుడు పురుషోత్తమ్‌రెడ్డిపై గత కొన్ని (మిగతా 2లో)

పొత్తు తప్పదు

- విలీనం ప్రసక్తే లేదు
- భాజపా మనతో పొత్తు వద్దంటోంది
- తెలంగాణ నేతలు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు
- రాష్ట్ర నాయకత్వంపై నమ్మకం లేదు
- జూనియర్ ఎన్టీఆర్ లేదా బ్రహ్మణికి బాధ్యతలివ్వండి
- తెరాసలో విలీనం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాం
- అధినేత ఎదుట కార్యకర్తల ఆవేదన



తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేకు తినిపిస్తున్న తెతెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ. చిత్రంలో తెదేపా సీనియర్ నేత పెద్దిరెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: 'ఎన్నికల సమయంలో అందరం కూర్చుని చర్చించిన తరువాతే ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనేది నిర్ణయిస్తాం. తెలంగాణలో రాజకీయ అవసరాల దృష్ట్యా ఏదో ఒక పార్టీతో పొత్తు ఉంటుంది. ఇక్కడ తెదేపా బలం పుంజుకుంటే అందరూ మనవైపే వస్తారు. తెదేపాను ఏ పార్టీలోనూ విలీనం చేసే ప్రసక్తే లేదు. అలా చెప్పే హక్కు ఎవరికీ లేదు' అని చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. మా కుటుంబం నుంచి ఇక్కడి రాజకీయాల్లోకి ఎవరూ రారు. ఇక్కడి నేతలే రాష్ట్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలి అని ఆయన సూచించారు. రాష్ట్ర (మిగతా 2లో)



బుధవారం దిల్లీలో పాటియాలా హౌస్ కోర్టు వద్ద కార్తి చిదంబరం

కార్తి చిదంబరం అరెస్టు

- చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని దిల్లీకి తరలించిన సీబీఐ
- రాజకీయ కక్షసాధింపేనని కాంగ్రెస్ ఆరోపణ
- చట్టం తన పని చేస్తోందన్న భాజపా 2లో

వేగవంతమైన వృద్ధి మనదే



ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో దేశ వృద్ధిరేటు 7.2 శాతంగా నమోదైంది. గత అయిదు త్రైమాసికాల్లో ఇదే అధికం. తయారీ, వ్యవసాయం, నిర్మాణ రంగాలకు తోడు సేవల రంగాల్లో అధిక వృద్ధే ఇందుకు కారణమైంది. ఇదే త్రైమాసికంలో చైనా వృద్ధిరేటు 6.8 శాతమే కావడం గమనార్హం. వేగంగా వృద్ధి చెందుతున్న అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మళ్లీ సత్తా చాటిందని ఆర్థిక శాఖ పేర్కొంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.6 శాతం కావచ్చని కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా వేస్తోంది.

ఎస్‌బీఐ డిపాజిట్ రేట్లు పెరిగాయ్

డిపాజిట్ రేట్లను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పెంచింది. రూ.కోటి వరకు చేసే డిపాజిట్లపై 0.15-0.50 శాతం వరకు; రూ.కోటికి మించిన మొత్తాలపై రూ.0.50-0.75 శాతం వరకు పెంచారు. ఇందువల్ల రుణరేట్లు కూడా త్వరలో పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

–వివరాలు బిజినెస్ పేజీలో

సేద్యానికి 24 గంటల కరెంటు భేష్

- పీఎఫ్‌సీ ఛైర్మన్ రాజీవ్‌శర్మ కితాబు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో గరిష్ఠ విద్యుత్ డిమాండు బుధవారం ఉదయం 10,100 మెగావాట్లకు చేరిందని, అయినా సేద్యానికి 24 గంటలూ నిరంతర సరఫరా చేయడం అసాధారణం అని 'విద్యుత్ ఆర్థిక సంస్థ' (పీఎఫ్‌సీ) ఛైర్మన్ రాజీవ్‌శర్మ పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషితో, అనంతరం ట్రాన్స్‌కో ప్రధాన కార్యాలయంలో విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమై (మిగతా 2లో)

ఇదీ సంగతి!



నిజానికి మన పార్టీలన్నీ 15 ఏళ్లు దాటిన పాతవాహనాలే!

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- దళిత, గిరిజనులను కంటికి రెప్పలా చూస్తున్న ప్రభుత్వం
- కొత్త కమిషన్ సమర్థంగా పనిచేయాలి
- తెలంగాణ ఎస్సీ,ఎస్టీ కమిషన్ బాధ్యతల స్వీకారోత్సవంలో ఉపముఖ్యమంత్రి,మంత్రులు
- కేసీఆర్ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తాం: కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

ఈనాడు, హైదరాబాద్ : దళిత, గిరిజనులను తెలంగాణ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటోందని, వారికి



మంత్రి హరీశ్‌రావును ఆలింగనం చేసుకుంటున్న ఎస్సీఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో నాయిని నర్సింహారెడ్డి, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి తదితరులు

అండగా నిలుస్తోందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. ఎస్సీ,ఎస్టీల కోసం చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. కొత్త కమిషన్ సమర్థంగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ ఎస్సీ,ఎస్టీ నూతన కమిషన్ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర సభ్యులు బుధవారం రవీంద్రభారతిలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో (మిగతా 2లో)

అనిశాలో పురుషోత్తమ్‌రెడ్డి ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

రోజులుగా అనిశా దర్యాప్తు జరుగుతున్న సంగతి తెలిసిందే. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ బినామీల చిట్టా బయటపడుతోంది. నిజానికి 2009లో ఒకసారి అనిశాకు పట్టుబడిన పురుషోత్తంరెడ్డి..తన పలుకుబడితో 2012లో ఈ కేసును ఎత్తివేయించుకోగలిగాడు. మళ్లీ హెచ్ఎండీఏలో కీలక బాధ్యతలు చేపట్టాడు. ఇటీవల అనిశాకు రెండోసారి పట్టుబడ్డాడు.

దాడులను ముందే ఎలా ఊహించాడు?

ఇదిలా ఉండగా.. రెండోసారి తనపై దాడులు జరిగే అవకాశం ఉన్నట్టు పురుషోత్తమ్ రెడ్డి ముందే ఊహించాడు. దాడుల నుంచి బయటపడేందుకు రాజకీయ నాయకుల ద్వారా ప్రయత్నాలు కూడా చేశాడు. అవి విఫలం కావడంతో తన బినామీగా ఉన్న బావమరిదితో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ వ్యూహాలన్నింటినీ తోసిరాజని అనిశా అధికారులు రెండోసారి మరింత పకడ్బందీగా దాడులు చేశారు. ఆయన అవినీతి, అక్రమాస్తుల గుట్టు రట్టు చేశారు. బినామీల బంధాన్ని తెంచేశారు. పురుషోత్తంరెడ్డి తన అక్రమార్జనను ఎలా దారి మళ్లించాడో కూడా ఛేదించారు. రోజుకొకటి చొప్పున బినామీ ఆస్తులు బయటపెడుతూ వస్తున్నారు. దర్యాప్తు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో.. అకస్మాత్తుగా డీఎస్పీ స్థాయి అధికారిని బాధ్యతల నుంచి తప్పించడం ప్రస్తుతం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

కారణాలపై ఊహాగానాలెన్నో?

సాధారణంగా దాడులు చేసే విషయాన్ని అనిశా చాలా రహస్యంగా ఉంచుతుంది. పకడ్బందీ రెక్కీ తర్వాత దాడులు చేస్తుంది. అలాంటిది పురుషోత్తమ్‌రెడ్డికి దాడుల విషయం ముందే ఎలా తెలిసింది? అన్నదానిపై ఆ శాఖ ఉన్నతాధికారులు అంతర్గతంగా విచారణ సాగించారు. తమ శాఖలో ఎవరో ఈ విషయమై అతనికి ఉప్పందించారన్న అంచనాకు వచ్చారు. మరింత లోతుగా విచారిస్తూ..కారకులను గుర్తిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే ముగ్గురు దిగువ స్థాయి సిబ్బందిపై బదిలీ వేటు వేశారు. తాజాగా డీఎస్పీ అశోక్‌కుమార్‌నూ ఈ కేసు దర్యాప్తు నుంచి తప్పించారు.



ఎన్టీఆర్ ట్రస్టుభవన్ ప్రాంగణంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

పొత్తు తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వం చురుగ్గా లేదని, వారిపై తమకు నమ్మకం లేదని, జూనియర్ ఎన్టీఆర్ లేదా బ్రహ్మణి, బాలకృష్ణలకు తెలంగాణ నాయకత్వ బాధ్యతలివ్వాలని కార్యకర్తలు ఆవేశంతో మాట్లాడుతూ కోరగా చంద్రబాబు నవ్వుతూ కార్యకర్తల్లో ఆవేదన, ఆవేశం ఉన్నప్పుడు ఇలా అడగటం సహజమన్నారు. బుధవారం ఎన్టీఆర్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. సుదీర్ఘకాలం తర్వాత పార్టీ అధినేత రావడంతో నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఎన్టీఆర్ భవన్‌కు వచ్చిన ఆయన తొలుత పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలను నేతలు ఆయనకు వివరించారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని నాయకులకన్నా కార్యకర్తలే చాలా హుషారుగా ఉన్నారని చంద్రబాబు అన్నారు. ఏ పార్టీతో పొత్తు ఉంటుందనే అంశంపై ఒక స్పష్టత ఇవ్వాలని నేతలు ఆయనకు విన్నవించారు. తొలుత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ప్రజల్లో బలం పెంచుకుంటే ఇతర పార్టీలు తెదేపా వైపు చూస్తాయని ఆయన వివరించారు. తెదేపా పొత్తు ఉండదని భాజపా నేతలే వ్యాఖ్యానిస్తున్నారని, వారు మిత్రధర్మం పాటించడం లేదన్నారు. రాష్ట్ర విభజన ఇష్టానుసారం చేసి కాంగ్రెస్ అన్యాయం చేసిందన్నారు. తెలంగాణలో రైతుకు ప్రమాద బీమా కింద రూ.5 లక్షల పథకాన్ని తెస్తున్నట్లు తెరాస చేసిన ప్రకటనను నేతలు ప్రస్తావించగా ఏపీలో ఎప్పటి నుంచో చంద్రన్న బీమాను అమలుచేస్తున్నామని వివరించారు. రైతు సమన్వయ సమితిల పేరుతో తమ కార్యకర్తలను నియమించి వారినే వచ్చే ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లుగా వాడుకోవాలని తెరాస చూస్తోందని నేతలు చెప్పారు. తెరాసలో తెదేపాను విలీనం చేయాలని చెప్పిన మోత్కుపల్లిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కొందరు కార్యకర్తలు కోరారు. తెరాసలో విలీనం చేస్తే తొలుత ఆత్మహత్య చేసుకునేది తానేనని సుధాకర్ అనే కార్యకర్త ఆవేశంగా అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ పార్టీని విలీనం చేస్తానని చెప్పే హక్కు ఎవరికీ లేదన్నారు. పార్టీ కోసం పోరాడేవారికి అండగా ఉంటానని, తెరాస ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా భయపడవద్దన్నారు. ఇటీవల తెలుగు రైతు అధ్యక్షుడు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టగా వాటికి వ్యతిరేకంగా పోరాడిన తీరును నేతలు ఆయనకు వివరించారు.

జిల్లాల్లో పర్యటించాలని వినతి: 'పల్లెపల్లెకు తెదేపా' వంటి కార్యక్రమాలతో ప్రజలకు చేరవయ్యామని, కానీ తెలంగాణలో పార్టీ పటిష్ఠానికి నెలలో ఒకరోజు కేటాయించి కార్యకర్తలతో సమావేశం కావాలని ఓ కార్యకర్త చంద్రబాబుకు విన్నవించారు. గతంలో పాత మూడు జిల్లాల్లో పర్యటించారని, మిగిలిన ఏడు పాత జిల్లాల్లో పర్యటిస్తే పార్టీకి ఊపు వస్తుందని చంద్రబాబును రాష్ట్ర నేతలు సైతం కోరారు. రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు పూర్తయినందుకు ఆయనను రాష్ట్ర నేతలు ఘనంగా సన్మానించారు. నేతలు, కార్యకర్తలతో మాట్లాడటం వల్ల పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీల్లోని తెలంగాణ నేతలతో సమావేశం పూర్తికాలేదని, గురువారం ఉదయం తిరిగి తన నివాసంలో సమావేశమవుతానని చంద్రబాబు చెప్పారు.

కార్తి చిదంబరం అరెస్టు

- ఒక్కరోజు రిమాండ్‌కు అనుమతించిన న్యాయస్థానం
- మళ్లీ గురువారం నిందితుడిని ప్రవేశపెట్టాలని ఆదేశం

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తి చిదంబరంను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేసింది. టెలివిజన్ సంస్థ ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మండలి (ఎఫ్ఐపీబీ) నుంచి నిధుల అనుమతులు ఇప్పించేందుకు కార్తి అవినీతికి పాల్పడ్డారనేది ప్రధాన ఆరోపణ. బుధవారం లండన్ నుంచి తిరిగివస్తున్న కార్తిని చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని అటు నుంచి అటే దిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి సీబీఐ బృందం తీసుకెళ్లింది. ఆ తర్వాత సాయంత్రం సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచింది. నిందితుడిని 15 రోజులపాటు తమ రిమాండ్‌కు అప్పగించాలని కోరగా ఒక్క రోజు రిమాండ్‌కు మాత్రమే జడ్జి సుమీత్ ఆనంద్ అనుమతించారు. కార్తిని మళ్లీ గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక కోర్టు జడ్జి ముందు హాజరుపర్చాలని స్పష్టం చేశారు.

2007లో పి.చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఐఎన్ఎక్స్ మీడియాకు రూ.305 కోట్ల మేర విదేశీ నిధుల అనుమతిని ఎఫ్ఐపీబీ నుంచి లభించేలా చేసేందుకు కార్తి అక్రమాలకు పాల్పడ్డారని గత ఏడాది మే 15వ తేదీన సీబీఐ కేసు నమోదు చేసింది.

చిదంబరం 10లక్షల డాలర్లు డిమాండ్ చేశారు!

కార్తి తక్షణ అరెస్టుకు ఐఎన్ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్ ఇంద్రాణిముఖర్జియా, ఆమె భర్త పీటర్ ఇటీవల ఇచ్చిన వాంగ్మూలమే కారణమని తెలుస్తోంది. ఈ వాంగ్మూలాన్ని ఫిబ్రవరి 17న మేజిస్ట్రేట్ ముందు నమోదు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. "ఐఎన్ఎక్స్ మీడియాకు విదేశీ నిధులు లభించేలా ఎఫ్ఐపీబీ అనుమతులివ్వాలంటే అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం తన కుమారుడి వ్యాపారానికి సాయం చేయాలని కోరారు. 10లక్షల డాలర్లు (సుమారు రూ.6.5కోట్లు) విదేశీ కరెన్సీలో చెల్లించాలన్నారు. ఎఫ్ఐపీబీ అనుమతుల కోసం తాము దిల్లీలోని నార్త్‌బ్లాక్‌కు వెళ్లినప్పుడు చిదంబరం ఈ డిమాండ్ చేశారు. ఆ తర్వాత కార్తిని దిల్లీలోని ఓ అయిదు నక్షత్రాల హోటల్‌లో కలుసుకున్నాం. కార్తికి సంబంధం ఉన్న సంస్థల విదేశీ బ్యాంకు ఖాతాల్లో ఏడు లక్షల డాలర్ల చెల్లింపులు జరిగాయి" అని ఇంద్రాణి దంపతులు ఆ వాంగ్మూలంలో అంగీకరించారని సీబీఐ అధికారులు వెల్లడించారు.

అరెస్టుపై కాంగ్రెస్ ఆగ్రహం

కార్తి చిదంబరంను సీబీఐ అరెస్టు చేయటాన్ని రాజకీయప్రేరేపిత చర్యగా కాంగ్రెస్ అభివర్ణించింది. కుంభకోణాలు, పాలనావైఫల్యాలపై వస్తున్న విమర్శలను పక్కదారి పట్టించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతోందని ఆ పార్టీ సమాచార విభాగ ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా వ్యాఖ్యానించారు. కార్తి అరెస్టులో ప్రభుత్వ జోక్యం ఏ మాత్రం లేదని కేంద్ర న్యాయ శాఖమంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు.

అరెస్టు ఊహించిందే: సుబ్రహ్మణ్యస్వామి

చెన్నై, న్యూస్‌టుడే: కార్తి చిదంబరం అరెస్టు ముందుగా ఊహించిందేనని భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ సీబీఐ, ఈడీ దర్యాప్తు సమయంలో కార్తి అసత్యాలు చెప్పారని ఆరోపించారు. వాస్తవానికి ఈ కేసులో ముందుగా కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరాన్ని అరెస్టు చేసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హోదాలో అప్పట్లో ఆయన సంతకం పెట్టడం వల్లే ఈ అవినీతి జరిగిందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రి మాట్లాడారు.'దళిత, గిరిజనులంటే సీఎం కేసీఆర్‌కు ప్రేమ. వారి కోసం ఆయన అనేక సంక్షేమ పథకాలు చేపట్టారు. ప్రత్యేక చట్టం తెచ్చారు. ఎర్రోళ్లకు అతి చిన్న వయస్సులో కమిషన్ ఛైర్మన్‌గా అవకాశం రావడం అదృష్టం. దీనికి సద్వినియోగం చేసుకోవాలి'అన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ 'తెలంగాణ ఉద్యమంలో ధైర్యంగా పోరాడి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు. కమిషన్‌కు బృహత్తర బాధ్యతలున్నాయి. వాటిని చక్కగా నిర్వర్తించాలి' అని సూచించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దళిత, గిరిజనులు సంపూర్ణంగా అభివృద్ధి చెందినప్పుడే పాలనకు సార్థకత చేకూరుతుందన్నారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎర్రోళ్ల శ్రీనివాస్ కమిషన్ ఛైర్మన్‌గా అవకాశాన్ని ఉపయోగించుకొని ముందుకు సాగాలన్నారు.

దళిత, గిరిజనుల సంపూర్ణాభివృద్ధే లక్ష్యం: దళిత, గిరిజనుల సంపూర్ణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ నూతన ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఎవరైనా కష్టాల్లో, సమస్యల్లో ఉన్నా తమ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, ఫోన్ చేసినా, సంక్షిప్త సందేశం పంపినా స్పందిస్తానన్నారు. 'నన్ను ఇంతవాడిని చేసి దళిత, గిరిజన జాతికి సేవలందించే అవకాశం కల్పించిన ఉద్యమనేత, తెలంగాణ జాతిపిత సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు ఎంత అన్యాయం జరిగిందో దళిత, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు అంత ద్రోహం జరిగింది. తెలంగాణ ఆవిర్భవించిన వెంటనే సీఎం కేసీఆర్ దళిత, గిరిజనుల అభివృద్ధిపై దృష్టి సారించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా వారు మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తాను' అని అన్నారు. ఈ సమావేశంలో ఉపసభాపతి పద్మాదేవేందర్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జోగురామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

5 నుంచి సీబీఎస్‌ఈ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మాధ్యమిక విద్యామండలి(సీబీఎస్‌ఈ) పదో తరగతి పరీక్షలు దేశవ్యాప్తంగా మార్చి 5 నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా 16,38,428 మంది హాజరు కానున్నారు. వారిలో బాలురు 9,67,325 మంది, బాలికలు 6,71,103 మంది ఉన్నారు. 12వ తరగతి పరీక్షలు మార్చి 5 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనుండగా దేశవ్యాప్తంగా 11,86,306మంది రాయనున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ న్యాయశాఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర పరిధిలోని ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణకు 'సెషన్స్' జడ్జీ స్థాయి 'ప్రత్యేక కోర్టు'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తూ తెలంగాణ సర్కారు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు 2017 డిసెంబర్ 14న ఆదేశాలు జారీ చేసింది. ఆ తీర్పును పరిగణనలోకి తీసుకున్న కేంద్ర న్యాయశాఖ అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారు హైకోర్టును సంప్రదించి.. హైదరాబాద్‌లో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

సేద్యానికి 24 గంటల కరెంటు భేష్

(మొదటిపేజీ తరువాయి)

చర్చించారు. తెలంగాణ ఏర్పడిన తరవాత అత్యంత ఎక్కువ విద్యుత్ కొరత ఎదుర్కొనే రాష్ట్రంగా ఉంటుందని తాము తొలుత వేసిన అంచనాలను తలకిందులు చేస్తూ ఎంతో ప్రగతి సాధించిందన్నారు. రాష్ట్రంలో కొత్త విద్యుత్కేంద్రాల నిర్మాణం శరవేగంగా చేపట్టడం దేశానికే ఆదర్శమన్నారు. విద్యుత్కేంద్రాలతో పాటు ఇతర ప్రాజెక్టులకూ ఆర్థిక సాయం అందించేందుకు తమ సంస్థ సిద్ధమని తెలిపారు. కొత్తగూడెంలో 800 మెగావాట్ల కొత్త కేంద్రం నిర్మాణం పూర్తయిందని, వచ్చే నెల చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జెన్‌కో సీఎండీ ప్రభాకరరావు తెలిపారు. భద్రాద్రి విద్యుత్కేంద్రంలో రెండు ప్లాంట్లు వచ్చే డిసెంబరు నాటికి, మిగతా రెండు 2019 జూన్ నాటికి ప్రారంభిస్తామని ఆయన వివరించారు. యాదాద్రి ప్లాంటు నిర్మాణం వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. వచ్చే జులై నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే మరో 4 వేల మెగావాట్ల విద్యుత్ అవసరమని, దానిని కూడా సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకు మోసాలకు కళ్లెంపై నేడు కేబినెట్ చర్చ

దిల్లీ: భారీ బ్యాంకు కుంభకోణాల నేపథ్యంలో అలాంటి ఘటనలు ముున్ముందు జరక్కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్రం సంకల్పించింది. ఆడిటర్లకు నియంత్రణల వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర కేబినెట్ గురువారం చర్చించే అవకాశం ఉంది. గురువారం సమావేశమౌతున్న కేంద్రకేబినెట్ ఎజెండాలో కేవలం ఈ ఒక్క అంశం మాత్రమే ఉన్నట్లు అభిజ్ఞవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలోనే "నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ'(నాఫ్రా)ను ఏర్పాటు చేసే అంశాన్ని కేబినెట్ సమావేశం పరిశీలించవచ్చు. అకౌంట్స్, ఆడిటింగ్ ప్రమాణాలు తదితర అంశాలను 'నాఫ్రా' పరిశీలిస్తుంది.

మేఘాలయాలో పోలింగ్ 84.86%

షిల్లాంగ్: మేఘాలయా శాసనసభ ఎన్నికల్లో 84.86% పోలింగ్ జరిగినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎఫ్.ఆర్. ఖర్కోంగర్ బుధవారం తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో 93% వరకు పోలింగ్ జరిగిందనిచెప్పారు. అభ్యర్థిమరణంతో వాయిదాపడిన విలియంనగర్ స్థానానికి ఎన్నికలు జరిగాక మొత్తంమీద పోలింగ్‌శాతం మరికొంత పెరుగుతుందని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

1–3–2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం; **చతుర్దశి:** ఉ. 8-26 తదుపరి పూర్ణిమ; మఖ నక్షత్రం: రా. 12-01 తదుపరి పుబ్బ; **అమృత ఘడియలు:** రా. 9-43 నుంచి 11-15 వరకు; **వర్జ్యం:** రా. 12-37 నుంచి 2-08 వరకు; **దుర్ముహూర్తం:** ఉ. 10-15 నుంచి 11-01 వరకు; తిరిగి మ. 2-55 నుంచి 3-42 వరకు; **రాహుకాలం:** మ. 1-30 నుంచి 3-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6-23; **సూర్యాస్తమయం:** సా.6-02; **హోలీ పూర్ణిమ**

FORM IV
(See rule 8)

1. Place of Publication	:	Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Tirupati, Anantapur, Rajahmundry, Suryapet, Guntur, Nellore, Kurnool, Srikakulam, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahabubnagar, Chennai, Bangalore, Mumbai, Delhi.
2. Periodicity of its Publication	:	Daily
3. Printer's Name	:	RAMOJI RAO
Whether Citizen of India (If foreigner, state the country of origin)	:	Yes
Address	:	Ramoji Film City, Ranga Reddy District - 501 512
4. Publisher's Name	:	RAMOJI RAO
Whether Citizen of India	:	Yes
5. Editor's Name	:	RAMOJI RAO
Whether Citizen of India (If foreigner, state the country of origin)	:	Yes
Address	:	Ramoji Film City, Ranga Reddy District-501 512
6. Name and addresses of individuals who own the Newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	:	Ushodaya Publications (A Division of Ushodaya Enterprises Private Ltd.) Regd. Office: 6-3-569/3, Somajiguda, Hyderabad-500 082.
		RAMOJI RAO, Ramoji Film City Ranga Reddy District-501 512.
		M/s MARGADARSI CHIT FUND PVT. LTD., 5-10-195, Fateh Maidan Road, Saifabad, Hyderabad-500 004.
		M/s USHAKIRON MOVIES PVT. LTD., Ramoji Film City, Ranga Reddy District - 501 512
		M/s COLORAMA PRINTERS PVT. LTD., Plot No. 15/A/1, Sri Venkateswara Co-Operative Industrial Estate, Jeedimetla, Hyderabad - 500 055.
		M/s. EQUATOR TRADING ENTERPRISES PVT. LTD. 157, Maker Chamber III, Nariman Point, Mumbai - 400 021.
		M/s TEESTA RETAIL PVT. LTD. 4th Floor Court House, Lokmanya Tilak Marg, Dhobitalao, Mumbai - 400 002

I, Ramoji Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

March 1st 2018

Sd/-
RAMOJI RAO
Publisher

కల్తీ సమర్పయామి!

(మొదటి పేజీ తరువాయి)

సరకు విక్రయిస్తున్నారు.

- దూపదీపాలతో చేసే క్రతువులు, యజ్ఞయాగాదులు, హోమాల్లో అధికంగా పాల్గొనే వారికి శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్లు పుణేలోని రెస్పిరేటరీ రీసెర్చ్ సొసైటీ తేల్చింది. ఇంటిలో వెలువడుతున్న (ఇండోర్ పొల్యూషన్) కాలుష్యంతోనూ మహిళల్లో శ్వాస సంబంధిత వ్యాధులు అధికంగా వస్తున్నట్లు తేలింది. ఎక్కువకాలం పొగబారిన పడినవారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు కూడా ఉన్నట్లు ఈ పరిశోధన పేర్కొంది.
- దీపారాధన నూనెలు, అగర్‌వత్తుల తయారీ, విక్రయాల్లో రెట్టింపు వస్తోంది. దుకాణదారులు, తయారీదారులు భారీగా దండుకుంటున్నారు.

తనిఖీలు లేనేలేవు

పూజాసామగ్రి విక్రయాల్లో సాగుతున్న అక్రమాలను ప్రభుత్వ శాఖలు పెద్దగా పట్టించుకోవడం లేదు. తయారీలో నాణ్యత లేకపోవడం, ధరలు ఇష్టారీతిన అచ్చువేసి విక్రయించడం లాంటి చట్ట ఉల్లంఘటనలు చోటుచేసుకుంటున్నా ఎవరూ దృష్టిసారించడం లేదని పేర్కొంటున్నారు. తయారీ కేంద్రాలు, దుకాణాలపైనా నియంత్రణలేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.


ఆరోగ్య సమస్యలెన్నో..

- కల్తీ నూనెలు, కాలిన వాసన ఊరిపితిత్తులను దెబ్బ తీస్తున్నాయి.
- పలు సందర్భాల్లో శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్‌లకు దారితీస్తున్నాయి.
- కళ్లపైనా ప్రభావం ఉంటోంది.
- రసాయనాలతో తయారైన కుంకుమ, పసుపు, గంధం లాంటి వాటితో చర్మసంబంధమైన వ్యాధులు వస్తాయి.

ఏ పొగైనా ఆరోగ్యానికి హానికరమే

సాంబ్రాణి, అగర్‌బత్తులు, దీపాల నుంచి వచ్చే పొగను ఎక్కువ కాలం పీల్చుకోవడంతో ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుంది. ఏ రకమైన పొగైనా ఆరోగ్యానికి నష్టమే. కల్తీ పదార్థాలనుంచి వచ్చేది మరింత హాని చేస్తుంది. ధూమపానం చేసే మగవారిలో కన్నా ఇలాంటి పొగలు పీల్చే ఆడవాళ్లలోనే ఎక్కువ శ్వాస సంబంధమైన (సీఓపీడీ) సమస్యలు కనిపిస్తున్నాయి.

– డాక్టర్ శుభాకర్,
శ్వాసకోశ వ్యాధుల నివారణ నిపుణుడు



ఇవి ఓ సంస్థ పేరుతో తయారుచేసిన దీపారాధన నూనె సీసాలు. ధర రూ.20 నుంచి రూ.60 వరకు ముద్రించారు. వీటిలో ఆర్‌బీ రిఫైండ్ నూనె ఉన్నట్లు రాశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే తయారుచేస్తున్నట్లు చిన్నచిన్న అక్షరాలతో పేర్కొన్నారు. సీసాపై అంటించిన లేబుల్‌పై ఐఎస్ఐ ముద్ర లేదు. బార్‌కోడ్ లేదు. అయినప్పటికీ ఇలాంటి ఎన్నో బ్రాండ్ల పూజాద్రవ్యాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

ఖైరతాబాద్‌లో విక్రయదారుడితో 'ఈనాడు' సంభాషించగా లోపాలు, ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది...

ఈనాడు: ఈ నూనెను అమ్మడం ద్వారా మీకు ఎంత లాభం వస్తుంది.

దుకాణ యజమాని: ఒకేసారి పెద్దఎత్తున కొనుగోలు చేస్తాం. ముద్రించిన ధరలో సగానికన్నా తక్కువకే మాకు తయారీదారులు ఇస్తారు.

ఈ: ఈ (లేబుల్‌పై రాసిన పేరు) కంపెనీ నూనెనే ఎక్కువగా ఎందుకు విక్రయిస్తున్నారు. ఇతర సంస్థలవి విక్రయించవచ్చుగా?

దు.య.: ఏ సీసాలోని నూనైనా ఒక్కటే. కాలానుగుణంగా లేబుల్ మార్చి మాకు సరఫరా చేస్తుంటారు.

ఈ: అగర్‌బత్తులు కూడా అనేక బ్రాండ్లు ఉన్నాయి కదా. ఐఎస్ఐ ముద్ర లేనివాటిని విక్రయించొద్దని తెలియదా?

దు.యు.: ఇవి కూడా నూనెల తీరులోనే తయారు చేస్తున్నారు. ఒకేచోట అనేక బ్రాండ్ల డబ్బాల్లో తయారుచేసి మాకు సరఫరా చేస్తున్నారు.

ఈ.: గుర్తింపులేని సంస్థల ఉత్పత్తులు విక్రయిస్తే అధికారులు మీపై చర్యలు తీసుకోరా?

దు.య: దీపారాధన నూనెలు, పూజాసామగ్రి విషయంలో పెద్దగా తనిఖీలు లేవు.

ఈ నాలుగేళ్లు.. నేనేం చేశానంటే?

- తెరాస ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి స్వీయ నివేదికలు
- పార్టీ అధిష్ఠానం వినూత్న నిర్ణయం
- టికెట్ల కేటాయింపునకు ఇదో ప్రాతిపదిక
- తాజా ప్రజాప్రతినిధులైనా ఆచితూచి ఎంపిక

ఈనాడు - హైదరాబాద్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం తెరాస ఈసారి కొత్త పంథాను అనుసరించనుంది. ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలకు మరోసారి అవకాశం ఇచ్చేందుకు వీలుగా వారి పనితీరును ప్రాతిపదికగా తీసుకోనుంది. గత ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు నాలుగేళ్లలో వారు చేపట్టిన అభివృద్ధి పనులు, కార్యక్రమాలు, హామీల అమలు తదితర అంశాలపై స్వీయ నివేదికలు తీసుకోనుంది. ఒక రాజకీయ పార్టీ తమ ప్రజాప్రతినిధుల ప్రగతి నివేదికలను కోరడం ఇదే తొలిసారవుతుంది. రాష్ట్రంలో తెరాసకు ప్రస్తుతం 91 మంది శాసనసభ్యులు, 14 మంది లోక్‌సభ సభ్యులున్నారు. దాదాపు వీరంతా మళ్లీ టికెట్‌ను ఆశిస్తున్నారు. అయితే, వారికి నేరుగా టికెట్లు ఇవ్వకుండా ఆచి తూచి వ్యవహరించాలని అధిష్ఠానం భావిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో వారికున్న పేరు ప్రతిష్ఠల్ని తెలుసుకోవాలని నిర్ణయించింది. అధిష్ఠానం వద్ద వివిధ సర్వే ఫలితాలు, పార్టీ నివేదికలున్నా.. వీటితోపాటు అభ్యర్థుల స్వీయనివేదికలను తీసుకోవాలనే భావనకు వచ్చింది. త్వరలోనే దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులకు సమాచారం పంపనుంది. నివేదిక తయారీ, సమర్పణ కోసం రెండు నుంచి మూడు నెలల గడువును నిర్దేశించనున్నట్లు తెలిసింది.

నివేదికల్లో ఏం ఉంటుంది...

నివేదికలకు సంబంధించిన నమూనాను తెరాస అధిష్ఠానం ముందుగా పార్టీ ప్రజాప్రతినిధులకు పంపుతుంది. అందులో ప్రజాప్రతినిధుల పూర్తి వివరాలు, గత ఎన్నికల్లో మెజారిటీ, చేసిన పనుల్ని వివరించాలి. తమ హయాంలో నియోజకవర్గంలో ఎన్ని అభివృద్ధి పనులు జరిగాయి. వాటి విలువ, ఎంత మందికి ప్రయోజనం కలిగిందనే వివరాలు ఇవ్వాలి. జిల్లాకు, రాష్ట్రానికి చేసిన సేవలు, ప్రయోజనకరమైన పనుల గురించి సమాచారం ఇవ్వాలి. దిల్లీ స్థాయిలో ఏమైనా కృషి చేస్తే తెలపాలి. నియోజకవర్గంలో వివిధ పథకాల కింద లబ్ధిదారుల సమాచారం ఇవ్వాలి. అపరిష్కృతంగా ఉన్న పనులు, చేపట్టని కారణం తదితర సమాచారం కూడా వెల్లడించాలి. నియోజకవర్గ అభివృద్ధిపై సదరు నేతకున్న దార్శనికత, భవిష్యత్ కార్యక్రమాల సమాచారం సైతం పొందుపరచాలి. వివాదాలు, కేసులుంటే వాటినీ వెల్లడించాలి.

పెద్ద పనే!

నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలకు సమాచారం ఉంది. పూర్తిస్థాయి నివేదికల తయారీకి వారు సూక్ష్మస్థాయికి వెళ్లాలి. గ్రామం నుంచి నియోజకవర్గం స్థాయి వరకు ఎలాంటి పనులు, కార్యక్రమాలను చేపట్టారనేది పొందుపరచడం పెద్దపనే కానుంది. దీనికోసం అధికారులతో పాటు పార్టీ వర్గాల నుంచి సమాచారం తీసుకోవాల్సి ఉంది.

అతి కీలకం..

స్వీయనివేదికలను పార్టీ అధిష్ఠానం అతికీలకంగా భావించనుంది. పార్టీటికెట్ల కోసమే కాకుండా వారికి నియోజకవర్గాలపై ఏ మేరకు అవగాహన ఉంది, జరిగిన పనుల వెనక వారి కృషి, నియోజకవర్గ సమస్యలు, పరిష్కారాలపై దృక్పథాన్ని తెలుసుకునే వీలుంటుంది. ప్రధాన సమస్యలేమైనా ఉంటే పార్టీ ఎన్నికల ప్రణాళిక తయారీలోనూ చేర్చే వీలుంది. ఎన్నికలకు మరో ఏడాది గడువు ఉన్నందున అపరిష్కృత సమస్యలు కీలకమైనవైతే యుద్ధ ప్రాతిపదికన చేపట్టే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు.

కేసీఆర్ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు

- నాడు ప్రధానిని పొగిడి నేడు విమర్శలా?
- క్షమాపణలు చెప్పేవరకు వదలం: లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: "కేసీఆర్ తాటాకు చప్పుళ్లకు బెదిరేందుకు మాది కాంగ్రెస్‌పార్టీ కాదు.. తెలంగాణలో నాలుగువేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఆ కుటుంబాల్ని ఆదుకున్నారా? కొద్ది రోజులక్రితం వరకు ప్రధాని మోదీని ఇంద్రుడు, చంద్రుడని పొగిడారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని రాజకీయ లబ్ధికోసం ఇప్పుడు విమర్శిస్తే నమ్మడానికి రైతులు అమాయకులు కారు" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. కేంద్రం నుంచి సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద తెలంగాణకు రూ.1.50 లక్షల కోట్ల నిధులొచ్చాయని, 70 ఏళ్ల చరిత్రలో గతంలో ఏ కేంద్రం నుంచీ ఇన్ని నిధులు రాలేదని.. అసెంబ్లీలో చర్చకు ప్రభుత్వం ముందుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారమిక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానిపై చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకునే వరకు ఎక్కడకు వెళ్లినా కేసీఆర్‌కు భాజపా నుంచి నిరసనలు తప్పవన్నారు. రైతు వ్యతిరేక విధానాల్ని అవలంబించింది గతంలో యూపీఏ సర్కారేనని.. . భాగస్వామిగా ఉన్న తెరాసకూ ఆ పాపాల్లో పాత్ర ఉందని ఆరోపించారు. వంద రోజుల్లో నిజాం షుగర్స్‌ను తెరిపిస్తానన్న సీఎం ఆ కంపెనీని నిండా ముంచారన్నారు. మద్దతు ధర అడిగిన రైతులకు ఖమ్మంలో బేడీలు వేయించారంటూ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని క్షేత్రస్థాయిలో భాజపా ఎండగడుతుంటే సహించలేక కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

పౌరసరఫరాల శాఖలో విప్లవాత్మకమైన మార్పులు: హరీశ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో కమిషనర్ సీవీ ఆనంద్

ఈనాడు డిజిటల్, సిద్దిపేట: గత ప్రభుత్వాల హయాంలో అవినీతికి కేంద్ర బిందువుగా నిలిచిన పౌరసరఫరాలశాఖ.. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వంలో మాత్రం పారదర్శకంగా పని చేస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి హరీశ్‌రావు కితాబునిచ్చారు. ఈ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్న తీరు ఆదర్శమన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో హైదరాబాద్ తరువాత సిద్దిపేటలోనే ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీఆనంద్‌తోకలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలకు చెందిన బియ్యం వారికి సక్రమంగా అందించడంలో పారదర్శకతకు నిలువుటద్దంగా నిలిచేలా ఈ శాఖను మంత్రి ఈటలతోపాటు కమిషనర్ సీవీ ఆనంద్ తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఈ విధానాలను ఇతర రాష్ట్రాల వారు పరిశీలిస్తున్నారని చెప్పారు.సీవీ ఆనంద్ మాట్లాడుతూ 171 మండలస్థాయి సరకుల నిల్వ కేంద్రాల్లో 17 వేలకుపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తూ నిఘాను పెంచుతున్నామని చెప్పారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఛైర్‌పర్సన్ రాజమణి పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై అవగాహన లేకుంటే ఎలా?: ప్రొటోకాల్ విషయంలో తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దని మంత్రి హరీశ్‌రావు పాస్‌పోర్టు ప్రాంతీయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించిన తరువాత సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. అధికారి వైఖరిని తప్పుబట్టారు. 'కార్యాలయం ప్రారంభానికి మంత్రి రాకున్నా ఫరవాలేదు. మీరు వస్తే చాలుఅని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో ఎందుకు అన్నార'ని వేదికపై ఉన్న అధికారిని ప్రశ్నించారు. నేను మంత్రినైనా.. ఇక్కడి శాసనసభ్యుడిని అనే విషయం మీకు తెలియదా.? మీరు ఉన్నతాధికారి.. ఉజ్వల భవిష్యత్తు ఉన్న మీరు ఇలా ప్రొటోకాల్ విషయంలో అవగాహన లేకుండా ఎలా వ్యవహరిస్తారు.. తెలియకుంటే నేర్చుకోవాలి'. అని సున్నితంగా హెచ్చరించారు.

ఎక్కడి నుంచైనా రేషన్

- నేటి నుంచి అన్ని జిల్లాల్లో అమలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో రేషన్ కార్డుల పోర్టబిలిటీ విధానాన్ని గురువారం నుంచి అన్ని జిల్లాల్లో అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌లో రెండు నెలల కిందట ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించారు. సుమారు 40 శాతం మంది ఈ విధానం ద్వారా నిత్యావసర వస్తువులను ఇతర ప్రాంతాల్లో తీసుకున్నట్లు తేలింది. ప్రస్తుతమున్న విధానం ప్రకారం కేటాయించిన పరిధిలోని చౌక ధరల దుకాణంలోనే కార్డుదారులు నిత్యావసరాలను తీసుకోవాలి. ఈ-పాస్ విధానం అమలుతో వేలి ముద్రలు సరిపోలితేనే సరుకులను అందిస్తున్నారు. అయితే కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రయోగాత్మకంగా పోర్టబిలిటీ విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ అమలు చేయాలని తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. ఈ విధానంతో మారుమూల ప్రాంతాల కార్డుదారులు ఏదైన పనిపై పట్టణాలకు, సమీప ప్రాంతాలకు వెళ్లిన సందర్భంలో అక్కడి నుంచే సరుకులు తీసుకునేందుకు అవకాశముంటుంది.

మే నుంచి రాష్ట్రంలో..: జిల్లాల్లో అమలు విధానాన్ని అధ్యయనం చేసిన మీదట దీన్ని రాష్ట్రమంతటా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి మాట్లాడరేం?

కాంగ్రెస్ నేతలను ప్రశ్నించిన తెరాస ఎంపీ జితేందర్‌రెడ్డి

వీరన్నపేట(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి ఎందుకు మాట్లాడటం లేదని తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా, కేంద్ర సంస్థలు, నిధులు ఇవ్వాలని మాట్లాడుతున్న ఏఐసీసీ నేత జైరాం రమేష్ విభజన చట్టంలో తెలంగాణకు రావాల్సిన అంశాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో భాజపా ప్రభుత్వం కలుపుతుంటే ఆరోజు కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్‌లో నోరు మెదపలేదని చెప్పారు. రాష్ట్రంలో బస్సు యాత్ర చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ పార్టీ జాతీయ నేతలను ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. తాము కేంద్రంతో స్నేహపూర్వకంగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాటం చేస్తున్నామని జితేందర్‌రెడ్డి తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లోని పేట్లబురుజు మైదానంలో జరిగిన పాసింగ్‌అవుట్ పరేడ్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది. చిత్రంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు

ప్రజాసేవకు పోలీస్‌శాఖ అత్యుత్తమ మార్గం

- రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్‌త్రివేది

జహనుమా, న్యూస్‌టుడే: ప్రజల మధ్య ఉంటూ సేవలందించేందుకు పోలీస్‌శాఖ అత్యుత్తమమైన మార్గమని తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్‌త్రివేది పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ పెట్లబుర్జు ప్రాంతంలోని సిటీ ఆర్మ్‌డ్ ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో నిర్వహించిన 2017 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరుతున్న కానిస్టేబుళ్లకు ఆయన దిశానిర్దేశం చేస్తూ.. పోలీస్‌శాఖకు మరింత మంచి పేరు సాధించేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణలో పలు అంశాల్లో ప్రతిభ చాటిన అభ్యర్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ (క్రైం) స్వాతి లక్రా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రాజీవ్‌త్రివేది తన నివాసం నుంచి కుమారుడితో కలిసి 19 కిలోమీటర్ల దూరం పరుగుతో పరేడ్ మైదానానికి చేరుకోవడం విశేషం.

మహిళా దినోత్సవ ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాల కేంద్రాల్లో ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహించేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలను సాయంత్రం 5 నుంచి 8 గంటల్లోగా ముగించాలని, సదస్సులకు హాజరయ్యే మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బుధవారమిక్కడ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, కమిటీ సభ్యులు రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, తెలుగు వర్సిటీ ఆచార్యులు సువర్చల, సురభివాణి, రేవతి, అఖిలేశ్వరి, సూర్య ధనంజయతోపాటు ఉన్నతాధికారులతో కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గతేడాది లలిత కళాతోరణంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందున ఈ ఏడాదీ అక్కడే నిర్వహించేందుకు పరిశీలించాలని సూచించారు. వివిధ రంగాల్లో కృషిచేసిన మహిళలను ఎంపిక చేసే బాధ్యతను రమణాచారి, రసమయి బాలకిషన్‌కు మంత్రి అప్పగించారు.

ఎల్ఆర్ఎస్ పరిష్కార గడువు పెంపు

ఈ నెల 31లోగా పరిష్కరించాలని సూచన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలికలు, పురపాలికలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార గడువును ఈ నెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఫిబ్రవరి 28లోగా పరిష్కరించాలని గతంలో ప్రభుత్వం గడువు విధించింది. ఈ మేరకు కార్యాచరణ కూడా ప్రకటించింది. సాంకేతిక కారణాలతో నిర్దేశిత లక్ష్యం నెరవేరలేదు. దరఖాస్తుల పరిశీలన, అదనపు పత్రాలకు సంబంధించి నోటీసుల జారీకి మరింత సమయం కావాలంటూ ప్రభుత్వానికి మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ, పట్టణాభివృద్ధి సంస్థల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిని పరిశీలించిన ప్రభుత్వం గడువును పొడిగిస్తూ ఆలోగా అపరిష్కృత దరఖాస్తులన్నింటిని పరిష్కరించాలని ఆదేశించింది.



శంకుస్థాపనలో ఉద్రిక్తత

- తోపులాటలో ధ్వంసమైన శిలాఫలకం
- ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఎమ్మెల్యే.. ఆయనపై కేసు నమోదు

మద్దూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలంలో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శిలాఫలకం ధ్వంసం చేశారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌ని గ్రామస్థులు అడ్డుకొని దాడి చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన తన వాహనాన్ని వదిలి ద్విచక్రవాహనంపై వెళ్లిపోయారు. రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌తోపాటు 70 మందికిపైగా కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమాలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ బండారు భాస్కర్ హాజరుకావాల్సి ఉంది. మన్నపూర్‌లో బీటీ రోడ్డు శంకుస్థాపన తర్వాత నందిగామలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు బయలుదేరారు. మంత్రులు అదే గ్రామంలో తెరాస జెండా ఆవిష్కరణకు వెళ్లారు. ఈ లోగా రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు నందిగామకు చేరుకొని ఆలస్యం ఏంటని అసహనం వ్యక్తం చేస్తూ శిలాఫలకం దగ్గర ఎమ్మెల్యే టెంకాయ కొట్టే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో శిలాఫలకం ధ్వంసమైంది. తెరాస కార్యకర్త రామకృష్ణకు గాయాలవడంతో గ్రామస్థులు, తెరాస నాయకులు ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకొని దాడికి ప్రయత్నం చేయగా.. ఆయన ద్విచక్రవాహనంపై కొడంగల్ చేరుకున్నారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి, 10 మంది కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. మరో 39 మంది కాంగ్రెస్ కార్యకర్తలను బైండోవర్ చేసినట్లు చెప్పారు.



నందిగామలో ధ్వంసమైన శిలాఫలకం

ప్రశాంతంగా టీఆర్‌టీ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామకాల కోసం బుధవారం నిర్వహించిన టీఆర్‌టీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పీఈటీ పరీక్షకు 14,151 మంది, మధ్యాహ్నం జరిగిన స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఉర్దూ, తమిళం, కన్నడ సబ్జెక్టులకు 3741 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

రేపు జరిగే పరీక్షలు...: టీఆర్‌టీలో భాగంగా శుక్రవారం(ఈ నెల 2న) ఉదయం ఎస్జీటీ బెంగాలీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళ మీడియం పోస్టులకు, మధ్యాహ్నం స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం పోస్టులకు కంప్యూటర్ ఆధారిత రాతపరీక్షలు జరుగుతాయి. ఈ పోస్టులకు హెచ్ఎండీఏ పరిధిలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్షలకు 2335 మంది, మధ్యాహ్నం జరిగే పరీక్షలకు 2177 మంది హాజరుకానున్నారు.

ఉద్యోగం రాదేమోనని యువతి ఆత్మహత్య



సుప్రజ (పాత చిత్రం)

రామారెడ్డి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో భాగంగా నిర్వహించిన ఎస్జీటీలో తక్కువ మార్కులు వచ్చి ఉద్యోగం రాదేమోనని బెంగతో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కామారెడ్డి జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామారెడ్డి మండలం అన్నారంగ్రామానికి చెందిన జాప సుప్రజ(24) ఆదివారం ఎస్జీటీ పరీక్ష రాశారు. ఆ పరీక్షను బాగా రాయకపోవడంతో తక్కువ మార్కులు వస్తాయనే బెంగ పట్టుకుంది. ఈ క్రమంలోనే తండ్రికి లేఖ రాసి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి లింగారెడ్డి కుటుంబ పోషణ కోసం దుబాయిలో ఉంటున్నారు.

సినీతారల చిత్రాలను అశ్లీలంగా మారుస్తున్న నిందితుని అరెస్టు



ఈనాడు, హైదరాబాద్: సినీతారల చిత్రాలను అశ్లీలంగా మార్చి వెబ్‌సైట్లో పెడుతున్న యువకుడ్ని సీఐడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐడీ అదనపు డీజీ గోవింద్ సింగ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సినీతారలను అశ్లీలంగా చిత్రీకరించి వెబ్‌సైట్లో పెట్టి సొమ్ము చేసుకుంటున్నాని, వీరిపై చర్యలు తీసుకోవాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) గతంలో సీఐడీకి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన అధికారులు ఇప్పటివరకూ ఐదుగుర్ని అరెస్టు చేశారు. తాజాగా హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన రఘువరుణ్‌ను అరెస్టు చేశారు. ఇంజినీరింగ్ పూర్తిచేసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న రఘు ఒక బ్లాగ్ తెరిచి, సినీతారల అశ్లీల చిత్రాలను అందులో పోస్ట్ చేస్తున్నాడు. మా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన సీఐడీ అధికారులు అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



ఈనాడు

తుక్కు విధానం

దేశంలో ఇంతలంతలవుతున్న వాయుకాలుష్య తీవ్రతను కట్టడి చేసేందుకంటూ వివాదాస్పద విధానానికి కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. అందులో భాగంగా, పదిహేనేళ్లకు పైబడిన వాహనాల రిజిస్ట్రేషన్ రద్దుచేయాలన్న చిరకాల ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తాజాగా ఆమోదముద్ర వేసింది. ఆ మేరకు, ఆయువు తీరిన ఐదుకోట్ల ఎనభైలక్షల వాహనాలను తుక్కుగా పరిగణించడం ద్వారా ఏకకాలంలో- వాయుకాలుష్య నియంత్రణ, ఆటోమొబైల్ పరిశ్రమకు నవోత్తేజం, కోశాగారానికి రూ.10 వేలకోట్ల దాకా రాబడి సాకారమవుతాయని కేంద్ర రవాణాశాఖామాత్యులు నితిన్ గడ్కరీ గట్టిగా చెబుతున్నారు. దేశంలో ప్రస్తుతం తుక్కుగా విక్రయించేవాటిపై 18శాతం, నూతన వాహనాలపై 28శాతం వంతున వస్తుసేవల పన్ను (జీఎస్టీ) విధిస్తున్నారు. వాటి తగ్గింపుకు జీఎస్టీ మండలి సమ్మతించడం తరువాయి, పాత వాహనాలకు శీఘ్రమే చెల్లుచీటీ రాయాలని కేంద్రం సంకల్పిస్తోంది! కాలుష్యభూతం ఏడాది కాలంలో విశ్వవ్యాప్తంగా బలిగొన్న ప్రాణాల సంఖ్య 90 లక్షలుగా నిర్ధారించిన లాన్సెట్ నివేదిక- ఒక్క వాయుకాలుష్యమే అత్యధికంగా ఇండియాలో 18.1 లక్షల మందిని కబళించినట్లు వెల్లడించింది. భారత్‌లో నమోదైన 22 కోట్ల మోటారు వాహనాల వల్ల రోజూ 630 టన్నుల బొగ్గుపులుసు వాయువు, 270 టన్నుల నైట్రోజన్ ఆక్సైడ్, రెండువేల టన్నులకుపైగా కర్బన ఉద్గారాలు విడుదలై పీల్చేగాలిని విషపూరితం చేస్తున్నాయి. భీతావహ పర్యవసానాలకు కారణభూతమైన వాయుకాలుష్యాన్ని నియంత్రించాల్సిందేనన్నదాంట్లో మరోమాట లేదు. నిర్ణీత కాలావధి ముగియగానే వాహనాలపై వేటు వేయడం మొక్కుబడి అందుకు ఏకైక పరిష్కార మార్గమా? భారీ సంఖ్యలో ట్యాక్సీలు, వ్యాన్లు, ఆటోలు, లారీలు మూలనపడితే- అసంఖ్యాక కుటుంబాల బతుకుతెరువు మాటేమిటి? వ్యక్తిగత వాహనాల్ని బలవంతాన వదులుకోవాల్సి రావడం పట్ల మధ్యతరగతి పౌరుల్లోనూ వ్యతిరేకత తప్పదంటున్న గతానుభవాల దృష్ట్యా, ఇతరత్రా ప్రత్యామ్నాయాల్నీ ప్రభుత్వం క్షుణ్నంగా పరిశీలించి ఉండాల్సింది!

కాలంచెల్లిన పద్దుకింద వాహనాల నిషేధాన్ని గతంలో దిల్లీ, ముంబయి, కోల్‌కతా తదితర నగరాల్లో పాలన యంత్రాంగాలు ప్రతిపాదించినప్పుడు పెద్దయెత్తున ప్రజాగ్రహం వ్యక్తమైంది. నాటి చేదు అనుభవాలు, అందుకు మూలకారణాలను నిశితంగా అధ్యయనం చేయకుండానే ఇప్పుడు జాతీయ స్థాయిలో పాత వాహనాల్ని తుక్కుగా మార్చే కార్యాచరణను పట్టాలకు ఎక్కించదలచడం విస్మయపరుస్తోంది. కొన్ని విదేశాల్లో మోడల్ పాతబడిందనిపిస్తే చాలు, ఆ వాహనాన్ని షెడ్డుకు తరలించి కొత్తది కొనుగోలు చేయడం పరిపాటి. అది పాశ్చాత్య దేశాలు, సంపన్న రాజ్యాల్లో చెల్లుబాటయ్యే వినిమయ సంస్కృతి. భారత్ కన్నా అమెరికా తలసరి స్థూల దేశీయోత్పత్తి 32 రెట్లు అధికం. సగటు భారతీయుడితో పోలిస్తే సాధారణ బ్రిటిష్ పౌరుడి ఆర్జన 20 రెట్లుగా లెక్క తేలుతుంది. అవేకాదు- యూఏఈ లాంటివీ ఉన్నతాదాయ దేశాల జాబితాలో వెలుగొందుతూ విపరీత కొనుగోళ్ల సంస్కృతికి నెలవవుతున్నాయి. ప్రధాన దేశాలన్నింటా తక్కువ ఖర్చుతో జీవించగలిగేదిగా నిగ్గుతేలిన ఇండియాలో అత్యధికులకు ద్విచక్రవాహనం ఏదైనా రెండు మూడు తరాల పెట్టుబడి. ఈ మౌలికాంశాన్ని పూర్తిగా విస్మరించి పాత వాహనాన్ని తుక్కుగా మార్చి కొత్తది కొనదలచిన వారికి యూకే, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా ప్రభృత దేశాల ఒరవడిలో ఇక్కడా రాయితీలు, ప్రోత్సాహకాలు ముట్టజెబుతామనడం అసంబద్ధం. క్షేత్రస్థాయి స్థితిగతులు, వివిధ వర్గాల జీవన స్థాయీప్రమాణాలు, ఆదాయ వ్యయ పరిమితుల్ని ఏమాత్రం పట్టించుకోని ప్రస్తుత దృష్టి విధాన నిర్ణయమిది. పదిహేనేళ్ల ఆయుర్దాయం తీరిన వాహనాలు దిల్లీ రోడ్లపై తిరుగాడే వీల్లేదంటూ గతంలో సర్వోన్నత న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలు పెను రవాణా సంక్షోభం సృష్టించనున్న యథార్థం- ఏ ప్రభుత్వమూ విస్మరించరానిది.

వాహన సంఖ్య ఏటా 22 శాతం చొప్పున విస్తరించడంవల్ల దేశంలో వాయుకాలుష్యం పెచ్చరిల్లుతోందంటున్న రవాణా మంత్రి గడ్కరీ- వాడుక నుంచి తొలగించిన వాహనాల విడిభాగాలను నూతన ఉత్పత్తుల్లో వినియోగించగల వీలుందంటున్నారు. భారీ శకటాలతో పోటీపడుతూ ప్రైవేటు వాహనాల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుండటానికి మూల కారణమేమిటి? ప్రజారవాణా సేవల పటిష్ఠీకరణలో మందభాగ్యమే దేశీయంగా ప్రైవేటు వాహనాల, అద్దె కార్ల, ఆటోల ఉద్ధృతికి పుణ్యం కట్టుకుంటోందన్నది యథార్థం. పదిహేనేళ్ల క్రితమే 150 కోట్ల డాలర్ల వ్యయంతో ప్రజారవాణా వ్యవస్థను తీర్చిదిద్దే ప్రత్యేక కార్యాచరణను సింగపూర్ చేపట్టింది. వాహనాల సంఖ్య పెరిగినా వాయు కాలుష్యాన్ని 90 శాతం మేర నియంత్రించడం ద్వారా క్యాలిఫోర్నియా అబ్బురపరుస్తోంది. రవాణా సేవల వ్యయాన్ని కనిష్ఠస్థాయికి తగ్గించేలా విద్యుత్ వాహనాల ఆవిష్కరణ కృషిలో నాలుగు పదులకు పైగా ప్రపంచవ్యాప్త దిగ్గజ సంస్థలు తలమునకలై ఉన్నాయి. విద్యుత్ శకటాలు రోడ్డెక్కితే చమురు వాహనాలకు సహజ మరణం తథ్యమన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఆలోగా వాయుకాలుష్యం రెచ్చిపోకుండా కాచుకునేందుకు నిబద్ధత చాటుతూ ఆరోగ్యకర వాహన సంస్కృతి పెంపొందించడంలో ఐస్‌లాండ్, కెనడా, ఫిన్లాండ్, ఎస్తోనియా వంటివి పోటీపడుతున్నాయి. పకడ్బందీ ప్రజారవాణా వ్యవస్థను ఆవిర్భవింపజేసి, పౌరుల్లో పర్యావరణ పరిరక్షణ స్పృహ అంకురించేలా జాగ్రత్తలు తీసుకుంటున్న ఎన్నో దేశాలు- వాయు నాణ్యతలో మిన్న అనిపించుకుంటున్నాయి. ప్రణాళికాబద్ధంగా ప్రజారోగ్యాన్ని తెరిపిన పడేసేందుకు, అదీ రాజమార్గం. అందుకు భిన్నంగా కోట్లాది ప్రజల జీవికకు సవాళ్లు ఎదురయ్యే విధానాల అమలుకు సిద్ధపడటం, కోరి కొరివితో తల గోక్కోవడమే అవుతుంది. పౌరసమాజ స్వచ్ఛంద భాగస్వామ్యానికి ఊపిరులూదే కార్యాచరణతోనే, కాలుష్య ధూమాన్ని నియంత్రించగలిగేది!

చైనా రుణ తంత్ర పాచికలు



డాక్టర్ పరిటాల పురుషోత్తం

ఇటీవల హిందూ మహాసముద్రంలో పెరిగిన చైనా నౌకల సంచారం ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలకు భంగకరంగా తయారైంది. 19, 20వ శతాబ్దాల్లో ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాలతో పాశ్చాత్య వలసవాద రాజ్యాలు ఏ విధంగా ప్రవర్తించేవో, నేడు అనేక వర్ధమాన దేశాలతో చైనా అలానే వ్యవహరిస్తోంది. రెండున్నర శతాబ్దాల క్రితం భారత్ పట్ల ఈస్టిండియా కంపెనీ అనుసరించిన వ్యూహాలు, విధానాలను అది తలపిస్తోంది. వలసవాద యుగంలో మాదిరిగా పలు ఆఫ్రికా, ఆసియా దేశాలు నేడు చైనాకు వ్యవసాయ, పాడి ఉత్పత్తులను, కలప, ఖనిజాలు, చమురు వంటి ముడిసరకులను ఎగుమతి చేస్తూ అక్కడి నుంచి పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొంటున్నాయి. చైనా ఏ దేశంలో అడుగుపెడితే ఆ దేశ ఆర్థిక వ్యవస్థను శాసించడం పరిపాటైంది. బీజింగ్‌తో వ్యాపారం చేసే ప్రతి దేశమూ రుణఊబిలో కూరుకుపోతోంది. దాన్ని అలుసుగా తీసుకొని చైనా సదరు దేశ రాజకీయ వ్యవస్థపై పెత్తనం చలాయిస్తోంది. దీనికి తాజా దృష్టాంతం మాల్దీవుల్లో సంభవిస్తున్న సంక్షోభమే. చైనా పెట్టుబడులు, ప్రాబల్యం విస్తరించిన ప్రతి దేశంలో చైనీయుల హడావుడి ఎక్కువ అవుతోంది. చైనా నుంచి పెట్టుబడులతోపాటు కార్మికులు, నిపుణులు వచ్చి ఆయా దేశాల్లో ప్రత్యేక వాడలు ఏర్పరుచుకొంటున్నారు. శ్రీలంక, పాకిస్థాన్, సూడాన్‌తోపాటు అనేక ఇతర ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఇవి కనిపిస్తాయి. పాకిస్థాన్‌లోని గ్వాదర్ రేవును చైనా సైనిక, నౌకా స్థావరంగా ఉపయోగించుకోనుంది. పాక్, మాల్దీవుల్లో చైనా సైనిక నిపుణుల సందడి ఎక్కువైంది.

ఆర్థిక దిగ్బంధం

దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ దీవుల నిర్మాణాన్ని పూర్తిచేసి పరిసర దేశాలను, అంతర్జాతీయ సమాజాన్ని బీజింగ్ నిర్ఘాంతపరచింది. చిరకాలంగా వివాదగ్రస్తమైన ప్రాంతాల్లో ఈ దీవులను నిర్మించడం వియత్నాం, మలేసియా, ఫిలిప్పీన్స్, ఇండొనేసియా, థాయ్‌లాండ్, బ్రూనై దేశాలకు కలవరం కలిగించాయి. చైనా దురాక్రమణ అజెండాను అడ్డుకోవడానికి అమెరికా, జపాన్ వంటి దేశాలు తక్షణమే జోక్యం చేసుకోవాలని అవి ఆశిస్తున్నాయి. కానీ, అమెరికా పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా చైనా దూకుడుపై కఠిన పంథా అనుసరించలేదు. దక్షిణ చైనా సముద్రంలోని దీవులు, దిబ్బలు అంతర్జాతీయ జలాల్లో ఉన్నాయి కాబట్టి అవి ఏ ఒక్క దేశం సొత్తు కావని అమెరికా ఉద్ఘాటించింది. చైనా ఇక్కడ ఇష్టారాజ్యంగా ప్రవర్తించకూడదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో అన్ని దేశాల నౌకలు స్వేచ్ఛగా సంచరించవచ్చని, దీనికి చైనా అనుమతి తీసుకోనవసరం లేదని పేర్కొంటూ ఒక అమెరికన్ యుద్ధ నౌకను అత్యంత వివాదగ్రస్త పారిసెల్ దీవుల సమీపంలోకి పంపారు. దక్షిణ చైనా సముద్రం అంతర్జాతీయ పరిధిలో ఉందంటూ ఐక్యరాజ్య సమితి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును ఉల్లంఘించి చైనా కృత్రిమ దీవుల నిర్మాణాన్ని పూర్తి చేసింది.

వర్ధమాన దేశాలను గుప్పిట్లో పెట్టుకోవడానికి చైనా వినూత్న వ్యూహం అనుసరిస్తోంది. మొదట ఆ దేశాల్లో మౌలిక వసతుల నిర్మాణానికి చాలా తక్కువ వడ్డీకి రుణాలిస్తుంది. క్రమంగా స్థానిక ఆర్థిక వ్యవస్థలో కొన్ని రంగాలను తన గుప్పిట్లోకి తీసుకుంటుంది. సంబంధిత దేశం తీసుకున్న రుణాలను తిరిగి తీర్చలేకపోతే, ఆయా రంగాలకు తానిచ్చిన రుణాలను ఈక్విటీ వాటాలుగా మార్చాలని పట్టుబడుతుంది. ఈక్విటీ వాటా చైనా చేతికి వెళ్లగానే సంబంధిత మౌలిక వసతుల ప్రాజెక్టుకు తానే సొంతదారుగా మారుతుంది. ఉదాహరణకు ఏదైనా దేశంలోని రేవులో ఈక్విటీ పొందితే, ఇక అక్కడికి చైనా నౌకలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించవచ్చు. పాకిస్థాన్, మాల్దీవులు, కాంబోడియా, శ్రీలంకల్లో చైనా అనుసరించిన వ్యూహమిదే. ఇటీవల సంక్షుభిత గ్రీస్ దేశంలో పైరేయస్ రేవును 42 కోట్ల డాలర్లకు చైనా కొనుగోలు చేయడం ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరచింది. సెషెల్స్, జిబూటీ, గ్వాదర్ రేవుల్లో వ్యాపార కారణాలపై పెట్టుబడి పెట్టానన్న చైనా, క్రమంగా ఆ రేవులను సైనిక ప్రయోజనాలకు మలచుకొంటోంది.

శ్రీలంకలోనే హంబాన్‌తోట రేవు, మట్టల విమానాశ్రయాలను తన అదుపులోకి తీసుకోవడం ద్వారా చైనా హిందూ మహాసముద్రంలో సైనికపరమైన



డ్రాగన్ సామ్రాజ్యవాద స్వప్నాలు

ఆధిక్యం చలాయించగలుగుతుంది. చైనా నిర్మిస్తున్న ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ (ఒబోర్) లేదా సముద్ర సిల్క్ మార్గం ప్రాజెక్టుకు ఈ రేవు, విమానాశ్రయం ఇరుసులుగా ఉపకరిస్తాయి. ఈ విధంగా చైనా గుప్పిట్లో ఇరుక్కున్న శ్రీలంక రేవు దక్షిణ చైనా సముద్రంలో చైనా ఆగడాలను, తైవాన్‌ను కలుపుకోవాలనే దుష్ట పన్నాగాన్నీ సమర్థించాల్సి రావచ్చు. మరోవైపు చైనా తన పెట్టుబడుల వల్ల శ్రీలంక వంటి భాగస్వామ్య దేశాలకు ఎనలేని మేలు జరిగిందని వాదిస్తోంది. వాస్తవమేమంటే చైనాకు సహజ వనరులను తరలించుకుపోవడానికి మాత్రమే ఈ పెట్టుబడులు, పైపులైన్లు, రేవులు ఉపయోగపడుతున్నాయి. ఇతర దేశాల్లో చైనా చేపట్టిన ప్రాజెక్టుల్లో ఆయా దేశాల పాత్ర నామమాత్రమే. ఈ ప్రాజెక్టుల్లో ఎక్కువగా చైనా కార్మికులు, నిపుణులను నియమిస్తున్నందువల్ల స్థానికులకు లభిస్తున్న ఉద్యోగాలు అంతంతమాత్రమే. ఒబోర్ కింద చేపట్టిన పనుల్లో 89 శాతం కాంట్రాక్టులు చైనా కంపెనీలకే దత్తమయ్యాయని అమెరికా అంచనా. మరోవైపు భాగస్వామ్య దేశాలను చైనా చౌక ఉత్పత్తులు ముంచెత్తడంతో ఆ దేశాల్లో పారిశ్రామికీకరణ ఏ మాత్రం ఊపందుకోవడం లేదు. తమ నిధులు ఉభయులకూ విజయం చేకూరుస్తున్నాయని చైనా చెప్పుకొంటున్నా వాస్తవంలో చైనాకే జంట విజయాలు సిద్ధిస్తున్నాయి. భాగస్వామ్య దేశాలతో ఏర్పడే వాణిజ్యపరమైన వివాదాలను పరిష్కరించుకోవడానికి బీజింగ్, తదితర చైనా నగరాల్లో ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పరచడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అంటే భాగస్వాముల జుట్టంతా చైనా చేతిలో ఉంటుందన్నమాట.

శ్రీలంకపై పట్టు



శ్రీలంకకు 1971-2012 మధ్యకాలంలో చైనా మొత్తం 500 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం అందించింది. ఈ నిధుల్లో అధిక భాగం మౌలిక వసతుల సృష్టికి వెచ్చించారు. ఉదాహరణకు హంబాన్‌తోట రేవు అభివృద్ధికి 100 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. మిగతా మొత్తాన్ని మట్టల విమానాశ్రయం, ఒక కొత్త రైల్వే మార్గం, కొలంబో రేవు నగర ప్రాజెక్టుల నిర్మాణంపై వ్యయీకరించారు. శ్రీలంక మొత్తం జాతీయ రుణభారం 6,490 కోట్ల డాలర్లు. అందులో 800 కోట్ల డాలర్లు ఒక్క చైనాకే బాకీ పడింది. చైనా రుణాలపై అధిక వడ్డీ వసూలు చేయడం శ్రీలంకకు పెను భారమవుతోంది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)లు 0.25 నుంచి మూడు శాతం వడ్డీకి రుణాలిస్తుంటే, చైనా 6.3 శాతంపై శ్రీలంకకు 30.1 కోట్ల డాలర్ల అప్పు ఇచ్చింది. శ్రీలంక అభివృద్ధి రేటు ఈమధ్య మందగించడంతో చైనాకు సక్రమంగా బాకీలు చెల్లించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. దాంట్లో నుంచి బయటపడటానికి మౌలిక వసతుల ప్రాజెక్టులకు చైనా ఇచ్చిన రుణాలను అదే ప్రాజెక్టుల్లో ఈక్విటీ వాటాలుగా మారుస్తానని కొలంబో ప్రతిపాదించింది. ఆ ప్రకారమే హంబాన్‌తోట రేవులో చైనా సంస్థలకు 80 శాతం వాటాలిచ్చి, 99 ఏళ్లకు లీజు ఇచ్చింది. దీనిపై శ్రీలంకలో ఉవ్వెత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. అలాగే మట్టల విమానాశ్రయ నిర్మాణానికి చైనా 30-40 కోట్ల డాలర్ల రుణమిచ్చి ఉండటంతో, ఇప్పుడు దాన్ని చైనా సంస్థలే నిర్వహిస్తున్నాయి. విమానాశ్రయ నిర్వహణకు ఏటా 10-20 కోట్ల డాలర్లు వెచ్చించే స్తోమత శ్రీలంకకు లేకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడింది.

అగ్రదేశ హోదా కోసం...

ప్రపంచ నాయకపాత్ర నుంచి అమెరికా, బ్రిటన్‌లు తమంతటతాము వైదొలగుతున్నందువల్ల ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి చైనా ఉవ్విళ్లూరుతోంది. ఒబోర్ ప్రాజెక్టు చైనా ప్రపంచాధిపత్య కలను నెరవేర్చే సాధనమవుతుందని అనుమానాలున్నాయి. ఏదిఏమైనా ఒబోర్ వల్ల చైనాకు లాభాలున్నట్లే నష్టభయాలూ ఉన్నాయి. ఇప్పటికే ఈ బృహత్తర ప్రాజెక్టులో లక్ష కోట్ల డాలర్ల పెట్టుబడి పెట్టిన చైనా, రాగల పదేళ్లలో మరెన్నో వేలకోట్ల డాలర్లు ధారపోయనుంది. చైనా నిధులు అందుకున్న మధ్యాసియా, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాలు తరచూ ఆర్థిక, రాజకీయ అస్థిరతకు లోనవుతూ ఉంటాయి. చైనా పెట్టుబడి పెట్టిన ప్రాజెక్టు ఏదైనా విఫలమైతే పరిస్థితి ఏమిటి? వెనెజులా, శ్రీలంక, మియన్మార్ దేశాల్లో చైనా ప్రాజెక్టులేవీ స్థానిక అభివృద్ధికి దోహదం చేయలేదు. మొత్తంమీద ఒబోర్ కేవలం వాణిజ్య ప్రాజెక్టు కాదని, అది ఒక రాజకీయ ప్రాజెక్టు అనీ భాష్యం వినవస్తోంది. రెండో ప్రపంచయుద్ధంలో నాశనమైన పశ్చిమ ఐరోపా దేశాల పునరుద్ధరణకు అమెరికా మార్షల్ ప్రణాళిక కింద నిధులిచ్చి, క్రమంగా ప్రపంచాధిపత్యం సాధించినట్లే, చైనా కూడా ఒబోర్ ద్వారా అదేపని చేద్దామనుకొంటోంది. ఆఫ్రికాలో భారీ ప్రాజెక్టులను నిర్మిస్తున్న చైనా ప్రభుత్వం స్థానికులకు బదులు చైనా నుంచి కార్మికులను తెచ్చి నియోగిస్తోంది. ఆఫ్రికాలో తయారైన ఉత్పత్తులను నేరుగా తమ దేశానికి తరలిస్తోంది. అలనాడు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ భారత్‌ను ఎలా దోచుకుందో చైనా సైతం ఆఫ్రికాలో అలానే దోపిడి చేస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల చైనాను సందర్శించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మేక్రాన్ ప్రాచీన సిల్క్‌రోడ్ కేవలం చైనా సృష్టి కాదని, చైనా-ఐరోపాల ఉమ్మడి సృష్టి అని గుర్తుచేశారు. నవీన సిల్క్ రూట్ (ఒబోర్) పూర్తిగా చైనా ప్రాజెక్టు కారాదని హితవు చెప్పారు. బ్రిటన్ ప్రధాని థెరిసా మే సైతం అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఒబోర్ దేశాలను అప్పుల ఊబిలోకి నెట్టకూడదని, పర్యావరణానికి హాని కలిగించకూడదని ఇతర దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగించకూడదని భారత్ మొదటి నుంచీ సూచిస్తోంది. గత ఏడాది మే నెలలో బీజింగ్‌లో చైనా జరిపిన ఒబోర్ ప్రారంభోత్సవానికి భారత్ దూరంగా ఉంది. ఒబోర్‌కు ప్రత్యామ్నాయ ప్రాజెక్టును చేపడదామని అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు భారత్‌ను ఆహ్వానిస్తున్నాయి. దీనికి దిల్లీ సమ్మతించడంతో ఈ నాలుగు దేశాల మధ్య ప్రాథమిక చర్చలు మొదలయ్యాయి. చైనా సవాళ్ల నుంచి అమెరికా తన అగ్రస్థానాన్ని కాపాడుకోవాలనుకొంటున్న దృష్ట్యా ఈ చర్చలకు విశేష ప్రాధాన్యమేర్పడింది!

(రచయిత- 'సెస్'లో ఆచార్యులు)

తప్పుడు చరిత్ర మనకొద్దు!



ఎ.సూర్యప్రకాశ్

చరిత్ర అనేక పాఠాలు నేర్పుతుంది. నియంతలు, ప్రజా పీడకులకు చరిత్ర పుటల్లో చోటుండవచ్చు. కానీ, వారికి జనహృదయాల్లో మాత్రం స్థానం దక్కదు. తమను మించినవారు లేరని విర్రవీగే పాలకులు మొట్టమొదట ఒంటపట్టించుకోవాల్సిన పాఠమిది! ఔరంగజేబు, దారా షికోవ్‌లు ఇద్దరూ అన్నదమ్ములు. వారు షాజహాన్ కుమారులు. పరాయి మతం పొడగిట్టనివాడిగా, భిన్న సంస్కృతులను అణు మాత్రం కూడా సహించలేని నియంతగా ఔరంగజేబు అందరికీ తెలుసు. కానీ, ఆయన తమ్ముడు దారా షికోవ్ మాత్రం అందుకు పూర్తి భిన్నం. భారతీయ బహుళత్వ సంస్కృతిని సంపూర్ణంగా అర్థం చేసుకున్న ఆయన- ఇస్లాం, హిందూ మతాల మధ్య సఖ్యత సాధించేందుకు శ్రమించారు. కానీ, కుహనా లౌకికవాదాన్ని పట్టుకువేలాడిన పాలకులు మాత్రం ఔరంగజేబు వంటివారికే పెద్దపీట వేశారు. నియంతల చరిత్రనే ప్రచారంలో పెట్టారు. పాఠ్యపుస్తకాల్లోనూ అలాంటి చరిత్రలనే దట్టించారు. ఫలితంగా జీవితాంతం బహుళత్వ విలువల విస్తరణకు కృషి చేసిన దారా షికోవ్ వంటివారు మరుగున పడిపోయారు! ఈ అన్యాయాలను సరిదిద్దాల్సిన బాధ్యత, ఈ తప్పులను మార్చాల్సిన కర్తవ్యం హేతుబద్ధంగా ఆలోచించే ప్రతి ఒక్కరిమీదా ఉంది.

మధ్యయుగానికి సంబంధించిన ఈ చారిత్రక పాత్రలపట్ల వ్యాప్తిలో ఉన్న అభిప్రాయాలను మార్చాల్సి ఉంది. ఇస్లాం, హిందూయిజాలపట్ల ఈ అన్నదమ్ముల దృక్పథాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. హిందువుల దేవాలయాలను, పాఠశాలలను కూల్చివేయాలని 1669 ఏప్రిల్ 9న ఔరంగజేబు తన గవర్నర్లకు ఆదేశాలు జారీచేశారు. ఆ క్రమంలోనే బెనారస్‌లోని కాశీ విశ్వనాథుని దేవాలయం, మధురలోని కృష్ణుని ఆలయంతోపాటు సోమ్‌నాథ్ దేవాలయంపైనా దాడులు జరిగాయి. ఆ తరవాత పదేళ్లకు అంటే 1679, ఏప్రిల్ 2న హిందూ మతస్థులపై అత్యంత అన్యాయమైన జిజియా పన్ను విధించారు. హిందూమతంనుంచి ఇస్లామ్‌లోకి మారినవారికి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, జైలు శిక్షలనుంచి మినహాయింపులు ఇచ్చేవారు. 1665లో హిందూ, ముస్లిములకు దిగుమతులపై వేర్వేరు కస్టమ్స్ సుంకాలు నిర్ణయించారు. హిందూ వ్యాపారులు అయిదుశాతం, ముస్లిములు 2.5శాతం సుంకం చెల్లించాలని నిర్దేశించారు. 1668లో హిందువుల పండగలన్నింటినీ ఔరంగజేబు నిషేధించారు. 1671లో హిందూ ముఖ్య గుమస్తాలందరినీ తొలగించి, వారి స్థానే ముస్లిం ఉద్యోగులను నియమించారు. ఔరంగజేబు సిక్కులపట్ల మరీ కక్ష కట్టినట్లుగా వ్యవహరించారు. సిక్కు ప్రార్థనాలయాలను కూల్చివేయాలని ఆదేశించారు. గురు తేజ్ బహదూర్ సింగ్‌ను బంధించి మత మార్పిడికోసం బలవంతం చేశారు. తీవ్ర హింసలపాలు చేశారు. అందుకు ఆయన సమ్మతించకపోవడంతో పాశవికంగా తల నరికివేశారు. ఆ తరవాత గురు గోవింద్ సింగ్ నలుగురు కుమారులను చంపించారు. జాదునాథ్ సర్కార్ అనే చరిత్రకారుడు ఔరంగజేబు వెలువరించిన నిర్ణయాలను, ఆయన జమానాలో చోటుచేసుకున్న ఘటనలను క్రమపద్ధతిలో అక్షరబద్ధం చేశారు.



పాఠాల్లో ఔరంగజేబు గురించి అవాస్తవాలు

వివిధ మతాల సారాన్ని తెలుసుకోవడంకోసం తపించిన జిజ్ఞాసువుగా దారా షికోవ్ జీవించారు. క్రైస్తవ మతగ్రంథాలతోపాటు హిందూ వేదాంతాన్నీ ఆయన ఔపోసన పట్టారు. సూఫీ తాత్వికుల రచనలను చదివారు. హిందూ పండితుల సహకారంతో ఉపనిషత్తులను ఆయన పర్షియన్ భాషలోకి అనువదించారు. మతాల్లోని సార్వత్రిక సత్యాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించిన దారా షికోవ్- హిందూ ముస్లిం మతాల మధ్య సారూప్యతలు ఆవిష్కరించేందుకు కృషి చేశారు. లాల్ దాస్ అనే హిందూ యోగి, ఫకీర్ సర్మద్ అనే ముస్లిం పండితుల వద్ద ఆయన తాత్విక శాస్త్రాన్ని అభ్యసించారు. అయితే షికోవ్ పొడగిట్టని ఔరంగజేబు- ఆయనపై మతద్రోహి అన్న ముద్ర వేసి వెలివేశారు. మరణశిక్ష విధించక తప్పదని నాటి మతాధికారులతో తీర్మానింపజేశారు. చివరికి ఔరంగజేబు అమానుషం బారినపడి దారా షికోవ్ ప్రాణాలు కోల్పోయారు. మధ్యయుగాలకు చెందిన ఈ నాయకులు పరస్పర విరుద్ధ భావజాలానికి ప్రాతినిధ్యం వహించారు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం భారత రాజ్యాంగంలో నిర్దేశించుకున్న సూత్రాల ప్రాతిపదికన చూస్తే ఔరంగజేబుది పూర్తి విరుద్ధ వ్యక్తిత్వం. రాజ్యాంగంలో రాసుకున్న భిన్నత్వంలో ఏకత్వం, సమానతా సూత్రావళికి దారా షికోవ్ నిఖార్సయిన ప్రతినిధిగా కనిపిస్తారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉంటే- స్వాతంత్ర్యానంతర భారతదేశంలో పాలకులు ఔరంగజేబును ఎందుకు అంతగా నెత్తికెత్తుకున్నారో, ఆయనను ఓ గొప్ప నాయకుడిగా చిత్రీకరిస్తూ పనిగట్టుకుని ఎందుకు ప్రచారం నిర్వహించారో అర్థం కాదు!

నెహ్రూ జమానాలో దిల్లీలోని ఓ ప్రధాన రహదారికి 'ఔరంగజేబ్ మార్గ్'గా నామకరణం చేశారు. జీవితాంతం పరమత ద్వేషిగా, నియంతగా బతికిన ఓ వ్యక్తిని అంతగా నెత్తికెత్తుకున్నారంటే ఏమిటి అర్థం? ఆయన విధానాలు ఆదర్శప్రాయమైనవని వారు చెప్పదలచుకున్నారా? మోదీ సర్కారు ఆగమనం తరవాత ఆ తప్పును సరిదిద్దారు. ఔరంగజేబు పేరిట ఉన్న ఆ రహదారిని 2015లో 'అబ్దుల్ కలాం మార్గ్'గా మార్చేశారు. మహోన్నత వ్యక్తిత్వానికి, భారతీయ బహుళత్వ విలువలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచిన కలాం పేరును ఆ మార్గానికి ప్రతిపాదించడాన్ని ఎంతోమంది హృదయపూర్వకంగా స్వాగతించారు. మధ్యయుగ నియంతృత్వంనుంచి అబ్దుల్ కలాం నమ్మిన మానవీయ విలువల దిశగా దేశాన్ని నడిపించేందుకు ఆ పేరు మార్పు ఓ స్వాగత సూచికగా ఉపయోగపడుతుంది. వలసవాద ప్రతీకలైన కొందరు బ్రిటిషర్ల పేరిట ఏర్పాటైన చిహ్నాల పేర్లను పదుల సంఖ్యలో ఇప్పటికే మార్పు చేసుకున్నాం. కాబట్టి చారిత్రక తప్పిదాలను దిద్దుకోవడం విపరీత చర్యగా ఎవరైనా అభివర్ణిస్తే అది పొరపాటే. దేశానికి ఇప్పుడు కావలసింది అబ్దుల్ కలాం విశ్వసించిన విలువలు, సిద్ధాంతాలే!

(రచయిత- ప్రసారభారతి ఛైర్మన్)

ఈనాడు లేఖలు

ఔషధ సంస్థల మాయాజాలం

ఔషధాల ధరల నియంత్రణ- మాటలకే పరిమితమవుతోంది. రోగికి, మందుల విక్రేతకు అర్థం కాని రీతిలో కొందరు వైద్యులు చీటీలు రాస్తున్నారు. మందుల్ని తయారుచేసే సంస్థల్లో కొన్ని, వాటిపై వివరాల ముద్రణను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రతి ఔషధ ప్యాక్‌పైన పేరు, ఉత్పత్తి సంస్థ, మూలకాలు, మోతాదు; అన్నింటికంటే మించి మందు ధర, గడువు తేదీ అందరికీ స్పష్టమయ్యేలా ఉండాలన్నది నిబంధన. ఆయా ఔషధాల తయారీ, రవాణా, నిల్వ, విక్రయ సందర్భాల్లో అధికార బృందాల పరిశీలన వల్ల లోటుపాట్లను పరిహరించవచ్చు. అదేవిధంగా జనౌషధి దుకాణాల్ని ప్రతి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఏర్పాటుచేసి సమర్థంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత. ప్రాణావసర మందుల అందుబాటుతో పాటు, ఔషధ సీసాల వెనక ఉండే తొమ్మిది అంకెల నెంబరును సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్)గా పొందడం ద్వారా నాణ్యత వెల్లడించే ఏర్పాట్లనూ సంబంధిత సంస్థలు అమలుచేయాలి.

- ఇమ్మడి నాగేశ్, సంస్థాన్ నారాయణపురం, యాదాద్రి జిల్లా

కొత్త కొనుగోలు పద్ధతులు

పంట పండించే రైతుకు ధర దక్కడం లేదు. మరోవైపు వినియోగదారుడు వాటిని కొనుగోలు చేయడానికి పెద్దమొత్తాలు వెచ్చించాల్సి వస్తోంది. మధ్యలో లాభపడుతోంది దళారులు మాత్రమే. ప్రజలే సమూహాలుగా ఏర్పడి రైతులతో అనుసంధానం ఏర్పరచుకొని ఉత్పత్తులను కొనుగోలు చేయగలగాలి. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లోని కుటుంబాలు సమూహంగా ఏర్పడటానికి అవకాశాలు ఉన్న రోజులివి. ఈ సానుకూలాంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఒక వేదికను ఏర్పాటు చేసి రైతుల నుంచి ఉత్పత్తుల కొనుగోలుకు కొత్త విధానాలను రూపొందించాలి.

- ఎస్. మల్లేశ్వరరావు, కేపీహెచ్‌బీ, హైదరాబాద్

కర్మయోగం


పారమార్థిక జీవనంలో విజయ సాధనకు మానవుడు జ్ఞానవంతుడు కావాలి. ఆ విజ్ఞాన సముపార్జన- కర్మ వల్లనే అతడికి సాధ్యమవుతుంది. వ్యాసభగవానుడి 'మహాభారతం'లోని భగవద్గీతలో కర్మను 'యోగం'గా వర్ణిస్తాడు శ్రీకృష్ణపరమాత్మ.

'అకర్మ' కూడా కర్మలో అంతర్భాగమే! మౌనం అనేది అకర్మే అయినా, అది శబ్దానికి సంబంధించిన అవశేషమని పెద్దలు చెబుతారు. ఉదారబుద్ధి గల ఒక వ్యక్తికి చనిపోయే ముందు ఓ ఆలోచన వచ్చింది. అన్నదాతల కోసం అతిపెద్ద జలాశయం నిర్మించాలని భావించాడు. నిధులతో పాటు అవసరమైన భూమిని వెంటనే సమకూర్చాడు. అతడి సంకల్పం నెరవేరేందుకు, కార్యభారాన్ని మరొక వ్యక్తి తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. గొప్ప కార్యాన్ని మొదట సంకల్పించి నిధులు చేకూర్చిన దాత- ఆ సత్కర్మ ఫలం అనుభవించడానికి అన్నివిధాలా అర్హుడే! ఎప్పటికైనా అతడు ఆ పుణ్యఫలం పొందుతాడని సనాతన ధర్మశాస్త్రాలు చెబుతాయి.

కర్మయోగాన్ని జనక మహారాజు విశేషంగా ఆచరించాడు. ఆధ్యాత్మిక విజయానికి మూలం నిష్కామ కర్మ అని సూత్రీకరించాడు కృష్ణుడు. చేసిన కర్మకు ఫలం అనుభవించక తప్పదు. అది ఎవరూ తప్పించలేనిది. సామాన్యుడు మొదలు మహా యోగి వరకు ప్రతి వ్యక్తీ కర్మ ఫలాన్ని అనుభవించాల్సిందే.

కష్టాల నుంచి విడుదల పొందడమే (వి)ముక్తి అని పలువురు భావిస్తుంటారు. పారమార్థికంగా ముక్తి సాధించేందుకు సాధకులు భక్తి, జ్ఞాన, కర్మయోగాల్లో ఏదో ఒకటి ఎంచుకుంటారు. కర్మయోగం ప్రాధాన్యమే వేరు! భక్తి లేదా జ్ఞానం పొందడానికి అవసరమయ్యే సాధన సంపత్తి కర్మ ద్వారా కలుగుతుంది. అందువల్ల కర్మయోగం గొప్పదని పెద్దల మాట. జనక మహారాజుతో పాటు గార్గి, యాజ్ఞవల్క్యుడు కర్మ సిద్ధాంతాలు ఆచరించారు. బ్రహ్మవిద్యలో ఆరితేరిన ఘనురాలు గార్గి. ఆ బ్రహ్మవిద్యనే కాక అద్వైత వేదాంతాన్ని జనక చక్రవర్తికి బోధించాడు యాజ్ఞవల్క్యుడు. అద్వైతం అనే శబ్దాన్ని ఆయనే ముందుగా ప్రయోగించాడని ప్రతీతి. వేదాల్ని స్త్రీలూ పఠించవచ్చని ప్రతిపాదించిన సమతామూర్తి ఆయన.

కర్మయోగాన్ని అనుష్ఠించిన ఆధునికుల్లో స్వామి వివేకానంద ముఖ్యులు. ఆ యోగాన్ని



ఆయన ఓ మానసిక సాధనగా ప్రకటించారు. కర్మయోగ సాధనలో సమాజ శ్రేయస్సు ఇమిడి ఉండాలన్నది స్వామి సిద్ధాంతం. అటువంటి సాధనే బ్రహ్మజ్ఞాన సముపార్జనకు ఉపకరిస్తుందని ఆయన బోధనల సారాంశం!

మానవజన్మ ఉత్కృష్టమైనది. మనుషుల్లో దైవాంశ ఉంటుంది. 'వస్తువుల్లో, ఇతరాల్లో ఏది సమున్నతమో అదే నేను' అంటాడు గీతాచార్యుడు. ఏది మహోన్నతమో దాన్నే లక్ష్యంగా చేసుకొని మనిషి జీవిత పరమార్థం సాధించాలని భగవానుడి ఉవాచ.

పరమాత్మను తెలుసుకొనేందుకు మానవుడు సాగించే నిరంతర ప్రయత్నమే అతణ్ని ఉన్నత లక్ష్యం వైపు నడిపిస్తుంది. అదే సత్యాన్ని రామకృష్ణ పరమహంస తన భక్తులకు బోధించారు. మనిషి ప్రవర్తనలో మంచి మార్పు రావడమే అతడు ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాడనేందుకు నిదర్శనం. ఉత్తమ ప్రవర్తనను అతడు సొంతం చేసుకోవాలంటే, దానికి ఆధారభూతమైన కర్మయోగాన్ని ఆచరణకు తేవాలి.

ప్రతి వ్యక్తీ కర్మ చేయాలి. అది నిర్ణీత ఫలమిస్తుంది. అన్ని కర్మఫలాలూ మనిషి ఆశించిన విధంగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు. వాటిని యథాతథంగా స్వీకరించడమే కర్మయోగం. కర్మఫలాలన్నింటినీ భగవంతుడికి అర్పించడం విజ్ఞుల విధానం.

నిష్కామకర్మ ఎటువంటి ఫలితాన్నీ ఆశించకున్నా, అది రాక తప్పదని గ్రహించాలి. కోరకున్నా, సత్కర్మకు ప్రతిఫలం భక్తుడికి లభించి తీరుతుంది. అదే కర్మ సిద్ధాంత రహస్యం. అందుకే ప్రాశస్త్యం ఉన్న కర్మను, దానికి నమస్కరించి ప్రారంభించాలంటుంది ధర్మసూక్ష్మం!

- గోపాలుని రఘుపతిరావు

తాత్కాలిక ఉపాధి.. తక్కువ వేతనం...

- పేదరికంతో చదువుకు మధ్యలోనే మంగళం
- విద్య, వైద్య ఖర్చులను భరించలేనంత దుర్భరం
- మరుగుదొడ్డి, తాగునీరు దూరమే
- 'తెలంగాణలో ఎస్సీల మానవాభివృద్ధి నివేదిక'లో వెల్లడి




ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని దళితులు.. విద్య, వైద్యం, మానవాభివృద్ధి సూచీల్లో ఇతర వర్గాల కంటే వెనుకబడి ఉన్నారని ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) అధ్యయనంలో వెల్లడైంది. పేదరికానికి తోడు సరైన ఉపాధి, ఆసరా, ఆదాయం లేకపోవడంతో నేటికీ దళిత యువత, చిన్నారులు విద్య, వైద్యం పొంద లేని పరిస్థితుల్లో ఉన్నట్లు పేర్కొంది. యువతకు సరైన ఉద్యోగావకాశాలు లేవనీ, పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారని నివేదికలో వివరించింది. ఆరోగ్యం, విద్య, వైద్యం తదితర అంశాలతో తెలంగాణలోని దళితుల మానవాభివృద్ధి-2017 నివేదికను ఎస్సీ సంక్షేమశాఖ, సెస్ సంయుక్తంగా రూపొందించాయి. ఎస్సీలను అభివృద్ధి దిశగా నడిపించే విధానాలు తీసుకొచ్చి, వివిధ కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వానికి సూచించాయి.

కుటుంబ పోషణ కోసం బాలకార్మికులుగా...

- ఎస్సీ చిన్నారుల్లో ఎదుగుదల తక్కువగా ఉంది. ఎత్తుకు తగ్గ బరువు; వయసుకు తగ్గ కండరాల దృఢత్వం లేదు. ఆరు జిల్లాల్లోని 59% మంది ఐదేళ్లలోపు చిన్నారుల్లో ఈ పరిస్థితి కనిపించింది. ఉన్నత వర్గాల్లో ఎదుగుదల లోపమున్న చిన్నారులు 24% కాగా, ఎస్సీల్లో అత్యధికంగా 39% నమోదైంది.
- అన్నిదశల్లో మధ్యలోనే చదువును మానేస్తున్నవారిలో దళిత చిన్నారులే ఎక్కువ. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోకే వీరు బాలకార్మికులుగా మారుతున్నారు.
- విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడుతున్నారు. ప్రైవేటు చదువులకు వారి ఆర్థిక స్తోమత అనుకూలించట్లేదు. ఆయా పాఠ్యాంశాల్లో అడిగిన ప్రశ్నలకు వారు సరైన సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు. బడులకు హాజరయ్యే విద్యార్థుల శాతం ఓసీలతో పోలిస్తే 2% తక్కువ.

అనారోగ్యం వస్తే...



- గ్రామీణ దళితులకు వైద్యసేవలు దూరంగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో వారి ఆదాయం తక్కువగా ఉండటంతో వైద్యానికి ఖర్చు చేయలేకపోతున్నారని నివేదిక వెల్లడించింది.
- పురుషులు, మహిళల్లో మధుమేహం, రక్తపోటు స్థాయి ఎక్కువగా ఉంది. మూడు జిల్లాల్లో సర్వేచేసిన 82% పురుషుల్లో మధుమేహం ఉన్నట్లు వెల్లడైంది. 42% మహిళల్లో ఈ లక్షణాలు కనిపించాయి.

ఉన్నత విద్యకు దూరం... తక్కువ వేతనం




- రాష్ట్రంలోని 58% ఎస్సీ కుటుంబాలు విద్యకు; 93% కుటుంబాలు ఆరోగ్యానికి ఖర్చుచేసే స్థితిలో లేవు. ఎస్సీల్లో పేదరికం, నిరుద్యోగిత ఎక్కువగా ఉంది. వీరంతా నైపుణ్యాలు అవసరంలేని, తక్కువ వేతనాలొచ్చే, తాత్కాలిక ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు.
- ఉన్నతవర్గాలతో పోలిస్తే.. చదువును మధ్యలో మానేసే, కొలువులకు వెళ్తున్న దళిత యువత 8% ఎక్కువ. వీరిలో చాలామంది వ్యవసాయం, తక్కువ వేతనం వచ్చే వ్యవసాయేతర రంగాల్లో పని చేస్తున్నారు.
- వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో నివసిస్తున్న ఎస్సీల్లో వ్యవసాయ, పారిశ్రామికవృద్ధి తక్కువగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 45% ఎస్సీల్లో ఆదాయవృద్ధి లేదు. ఆరోగ్య పరిస్థితులూ అంతంతే.
- ఎస్సీ కుటుంబాలు నేటికీ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునే పరిస్థితుల్లో లేరు. ఇతర వర్గాలతో పోలిస్తే రక్షిత తాగునీరు వీరికి సరిగా అందట్లేదు.

ఏం చేయాలి?


ఎస్సీల అభివృద్ధికి కొన్ని రంగాల్లో సానుకూల విధానాలున్నా.. సవాళ్లు అధికంగానే ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్తు విధానాలు రూపొందిస్తూ, ప్రస్తుత విధానాలనూ సంస్కరించాలి. భూముల్లేని నిరుపేదలకు భూములివ్వాలి. సాగునీరు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు, పెట్టుబడులను ప్రభుత్వమే సమకూర్చాలి. వైద్య సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు.. దళిత విద్యాభివృద్ధికి కృషిచేయాలని నివేదిక సూచించింది.

పౌష్టికాహారలోపం ఉన్న ఐదేళ్లలోపు దళిత చిన్నారులు




జిల్లా	చిన్నారుల శాతం
రంగారెడ్డి	31.4
కరీంనగర్	32.8
నిజామాబాద్	45.1
మెదక్	36.8
నల్గొండ	29.4
ఖమ్మం	29.3

ప్రసూతి మరణాలు (లక్ష మందికి)




జిల్లా	మరణాలు
ఖమ్మం	99
ఆదిలాబాద్	152
మహబూబ్‌నగర్	98

18 ఏళ్ల పైబడిన ఎస్సీ పురుషుల్లో రక్తపోటు అధికంగా ఉన్న జిల్లాలు




జిల్లా	పురుషుల శాతం
రంగారెడ్డి	20.3
ఖమ్మం	16.4
నల్గొండ	15.5
మహబూబ్‌నగర్	15.9
మెదక్	16.8

మధుమేహం...




జిల్లా	పురుషుల శాతం
హైదరాబాద్	4.1
రంగారెడ్డి	4.7
వరంగల్	4.0
కరీంనగర్	5.5
ఖమ్మం	4.2
నల్గొండ	4.1
నిజామాబాద్	5.6
మహబూబ్‌నగర్	4.0

18 ఏళ్ల పైబడిన ఎస్సీ మహిళల్లో రక్తపోటు అధికంగా ఉన్న జిల్లాలు



జిల్లా	మహిళల శాతం
హైదరాబాద్	11.5
రంగారెడ్డి	12.8
ఖమ్మం	13.4
మహబూబ్‌నగర్	12.3
మెదక్	13.0

మధుమేహ మహిళలు ఎక్కువగా ఉన్న జిల్లాలు



జిల్లా	మహిళల శాతం
హైదరాబాద్	3.6
రంగారెడ్డి	3.1
కరీంనగర్	3.8
ఖమ్మం	3.8
నిజామాబాద్	3.6
మహబూబ్‌నగర్	3.9

మధ్యలోనే చదువు మానేస్తున్న దళితుల రేటు ఎక్కువగా ఉన్న జిల్లాలు

- **ప్రాథమిక విద్య:** మెదక్, నిజామాబాద్
- **మాధ్యమిక విద్య:** హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ
- **ఉన్నత విద్య:** మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ.



బాలమిత్రగా తెలంగాణ ఆదర్శం కావాలి

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో తగ్గిన బాల్య వివాహాలు
- ఇందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు
- నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి



సభలో మాట్లాడుతున్న కైలాస్ సత్యార్థి

ఈనాడు, కరీంనగర్: బాల కార్మికులు, బాలలపై వేధింపులు లేని స్వచ్ఛ, సురక్షతతో తెలంగాణ బాలమిత్ర (ఛైల్డ్ ఫ్రెండ్లీ) రాష్ట్రంగా రూపుదిద్దుకుని ప్రపంచానికే ఆదర్శం కావాలని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి ఆకాంక్షించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో తెలంగాణలో బాల్య వివాహాలు తగ్గుతున్నాయని, ఇందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఎంపీ వినోద్‌కుమార్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన బాల మిత్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో ప్రతి గంటకు నలుగురు బాలలు లైంగిక వేధింపులకు గురవుతుండటం సిగ్గుచేటన్నారు. 18 ఏళ్లలోపు వయస్సు గల వారిలో ప్రతి ఇద్దరిలో ఒకరు లైంగిక వేధింపుల బారిన పడుతున్నారని... వేధించే వారిలో సమీప బంధువులు, అరుదుగా తండ్రులు కూడా ఉండటం విషాదకరమన్నారు. బాలలకు స్వేచ్ఛ, సురక్షిత వాతవారణం, వేధింపులు, బాల కార్మికులు లేకుండా చేసే బాలమిత్రగా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిస్తున్నామన్నారు. బాలమిత్ర కరీంనగర్‌గా జిల్లా రాష్ట్రానికి ఆదర్శమైతే, రాష్ట్రం దేశానికి, దేశం ప్రపంచానికి ఆదర్శం కావాలని కోరారు. పలు రాష్ట్రాల్లో పని చేస్తున్న తమ ఫౌండేషన్ ఇందుకు తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తుందన్నారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కైలాస్ సత్యార్థి సూచించిన అంశాలను అనుసరిస్తామని తెలిపారు. సదస్సులో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, మేయర్ రవీందర్‌సింగ్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి

ప్రిన్స్ ఆగాఖాన్‌ను కోరిన మహమూద్‌అలీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత సహకరించాలని, మరిన్ని రంగాలకు సేవలందించాలని ప్రిన్స్ ఆగాఖాన్‌ను ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని పలక్‌నుమా ప్యాలెస్‌లో ఆయన ఆగాఖాన్‌తో సమావేశమయ్యారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఆగాఖాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రస్తుతం టోలిచౌకిలోని కుతుబ్‌షాహీ సమాధుల పరిరక్షణ పనులు జరుగుతున్నాయని, ఇదే మాదిరి గోల్కొండ కోటను అభివృద్ధి చేయాలని అభ్యర్థించారు. దీనికి ఆగాఖాన్ సానుకూలంగా స్పందించారు.

అధికారుల వైఖరిపై వైద్యఆరోగ్య కార్యదర్శి ఆగ్రహం

వైద్యవిద్య సంచాలకుల పరిధిలో ఉస్మానియా వైద్య కళాశాల, దంత కళాశాల ప్రధానాచార్యులు పదవీ విరమణ పొందుతుండడంతో.. వారి స్థానంలో నూతన అధిపతులను నియమించడంపై అధికారులు వ్యవహరించిన తీరు పట్ల వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిపతిని నియమించాల్సి వచ్చినప్పుడు అనుభవం ప్రాతిపదికన అర్హులైన వ్యక్తుల జాబితాను పంపిస్తుంటారు. కాగా ఉస్మానియా వైద్య కళాశాల, దంత వైద్యకళాశాల ప్రధానాచార్యులను నియామక విషయంలో అవి పాటించనట్లు సమాచారం. బుధవారంతోనే ఆయా వైద్యకళాశాలల ప్రధానాచార్యుల పదవీ విరమణ పూర్తికాగా.. దీనికి సంబంధించిన దస్త్రాన్ని బుధవారం ఆఖరి నిమిషంలో దస్త్రాన్ని పంపించడంతోపాటు కేవలం ఒక్కరి పేరునే సూచించడంపై ముఖ్యకార్యదర్శి మండిపడినట్లు సమాచారం.

తెలుగుదేశం పొత్తు ఎవరితో?

భాజపా, కాంగ్రెస్‌లతో తెలంగాణలో లేనట్టేనా.. ● చంద్రబాబు మాటలతో నాయకుల్లో చర్చ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఏడాది జరిగే సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో తెలుగుదేశం ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. భాజపానే పొత్తు వద్దని చెబుతూ మిత్రధర్మం పాటించడం లేదని చంద్రబాబు బుధవారం సమావేశంలో చెప్పడంతో ఇక ఆ పార్టీతో తెగతెంపులైనట్టేనా అని చర్చ జరుగుతోంది. భాజపాను వదిలేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్, తెరాస, వామపక్షాలున్నాయి. ఏపీలో తెదేపా పాలనపై వామపక్షాలు పోరాడుతున్నందున వాటితో వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉండకపోవచ్చని, ఒకవేళ పెట్టుకున్నా తెలంగాణలో పెద్దగా ప్రయోజనాలుండవని నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ఇష్టానుసారం విభజించి రాష్ట్రాన్ని నాశనం చేసిందని చంద్రబాబు చెప్పడాన్ని బట్టి ఆ పార్టీతోనూ పొత్తు ఉండకపోవచ్చని అంచనా. ఇక అధికార తెరాసతోనే పొత్తు పెట్టుకుంటారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. చంద్రబాబు మాత్రం పొత్తులపై ఇప్పుడేం మాట్లాడవద్దని, పొత్తు అవసరమైన పార్టీలే తెదేపా వద్దకు వచ్చేలా తెలంగాణలో బలపడాలని సూచించారు. మరోవైపు తెదేపా రాష్ట్రస్థాయి నేతలు కొందరు తెరాసతో పొత్తు ఉంటుందని ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. పొత్తులపై ఏదో ఒకటి తేల్చాలని, ఇంకా జాప్యం చేయడం వల్ల రాజకీయంగా నష్టం జరుగుతుందని రాష్ట్ర నేతలు, కార్యకర్తలు బుధవారం సమావేశంలో పార్టీ అధినేతను కోరడం గమనార్హం. గురువారం ఉదయం తిరిగి రాష్ట్రస్థాయి ముఖ్యనేతలతో చంద్రబాబు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా పొత్తులపై చర్చ జరిగే అవకాశాలున్నాయి. తెరాసతో ఇక్కడ పొత్తు పెట్టుకుంటే ఏపీలో నష్టం వాటిల్లకుండా చూసుకోవాల్సిన అవసరముంటుందని, అందువల్లనే ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పొలిట్‌బ్యూరో సభ్యుడొకరు విశ్లేషించారు.


పరిశీలన తర్వాతే సబ్ రిజిస్ట్రార్ విధులను అప్పగించాలి

తెలంగాణ తహసీల్దార్ల సంఘం

తహసీల్దార్లకు సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల్ని అప్పగించడం మారుమూల మండలాల ప్రజలకు ఉపయుక్తమైనా... సమగ్ర పరిశీలన తర్వాతే ఈ ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషిని టీజీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ నేతృత్వంలో ప్రతినిధులు కలిసి ఈ మేరకు విన్నవించారు. కొన్ని రోజులు శిక్షణ ఇచ్చి, బాధ్యతలను అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై తహసీల్దార్లు ఆందోళన చెందుతున్నారని వారు వివరించారు. పూర్తిస్థాయి శిక్షణ, నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఇవ్వాలనీ... పూర్తిస్థాయి బడ్జెట్, మౌలిక సౌకర్యాలు కల్పించాలనీ కోరారు. దీనికన్నా ముందు జిల్లాకో మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేయాలని కోరారు. రిజిస్ట్రేషన్లు, నగదు చెల్లింపులన్నీ ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 20,844 మంది గైర్హాజరు

ఈనాడు, హైదరాబాద్, మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, కన్నడ, మరాఠీ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. వికారాబాద్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్(బాలుర) కళాశాలలో విద్యార్థి బోడ సురేష్ రెండు నిమిషాలు, ఆదర్శపాఠశాల కేంద్రానికి తేజావత్ భాస్కర్ 15 నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షకు పంపేందుకు అధికారులు నిరాకరించారు. మొత్తం 4,82,360 మందికి 4,61,516 మంది హాజరయ్యారు. అంటే 20,844 మంది(4.32 శాతం) గైర్హాజరయ్యారు.



ఇరుకు సందులో.. మరుగుదొడ్డి పక్కన వరుసగా కూర్చున్న వారు ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు. నగరంలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ సూపర్‌విజ్ జూనియర్ కళాశాలలో బుధవారం కనిపించిన దృశ్యమిది. తరగతి గదులు చాలక , సరైన గాలి, వెలుతురు లేక బుధవారం ఇలా ఇబ్బంది పడ్డారు. ఇద్దరు కూర్చోవాల్సిన బెంచీలో ముగ్గురు కూర్చొని పరీక్షలు రాశారు. ఈ కళాశాలలో 400 మంది విద్యార్థులు పరీక్షలు రాసే వీలుండగా 510 మందికి కేటాయించారు. నెల ముందుగానే కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ ఇంటర్ బోర్డుకు సమాచారం ఇచ్చినా మార్పులు చేయలేదు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, బోర్డు దృష్టికి తీసుకు వెళ్లినా ఏంచేయలేని పరిస్థితి ఉందని చెప్పారు.

- న్యూస్‌టుడే, చందానగర్

పేదల కన్నీళ్లు తుడవడమే కేసీఆర్ లక్ష్యం

- బస్సుయాత్రల పేరుతో కాంగ్రెస్ దొంగయాత్రలు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాళేశ్వరాన్ని పూర్తి చేస్తాం
- మంత్రి కేటీఆర్

ఈనాడు - సూర్యాపేట

'గత పాలకుల హయాంలో నిరాదరణకు గురైన తెలంగాణ పేదల కన్నీళ్లు తుడవడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారు. 40 నెలల సమయంలో ఎన్నో చిక్కుముళ్లు, సవాళ్లు, సమస్యలను పరిష్కరిస్తూ దేశంలోనే అగ్రభాగంలో నిలిచేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దారు' అని ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా మద్దిరాలలో నిర్వహించిన తుంగతుర్తి ప్రగతిసభలో కేటీఆర్ మాట్లాడారు. అంతకు ముందు ఆయన నూతనకల్ మండలం చిల్పకుంట్లలో మిషన్ భగీరథ పథకంలో తుంగతుర్తిలోని 175 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన నీటిశుద్ధి ప్లాంట్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మద్దిరాల క్రాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రగతిసభలో ఆయన మాట్లాడుతూ తలాపునే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా తాగు నీరులేక ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2 లక్షల మంది ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులుగా మారడానికి కాంగ్రెస్ నేతలు కారణమయ్యారని విమర్శించారు. అత్యంత వెనుకబడిన తుంగతుర్తిలో మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంటును తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు.





నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభించి నల్లా ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ★ మద్దిరాల ఎక్స్ రోడ్ వద్ద నిర్వహించిన సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

కాంగ్రెస్‌వి మొసలి కన్నీరు

రాష్ట్రంలో పేరొందిన నాయకులందరూ కలిసి రాష్ట్రాన్ని ఇబ్బందులు పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కేవలం మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక యాత్రల పేరుతో కాంగ్రెస్ నేతలు దొంగయాత్రలు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టులు, కమీషన్లతో అప్పటి పాలకులు ఆస్తులు, ఆకారాలను పెంచుకోడానికే ప్రాధాన్యమిచ్చారని విమర్శించారు. ప్రస్తుతం మొసలి కన్నీరు కార్చుతూ అమాయక ప్రజల సానుభూతిని కూడగట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వివిధ కేసుల్లో ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కాంగ్రెసోళ్లు తమను విమర్శించే స్థాయికి చేరుకోలేదన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలంగా మారుస్తామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కేవలం 29 లక్షల మందికి రూ. 800 కోట్ల మేర పింఛన్లు అందించగా, తెరాస ప్రభుత్వం 40 లక్షల మందికి రూ. 5,500 కోట్లు ఇస్తుందని తెలిపారు. రేషన్‌లో సీలింగ్ విధానాన్ని తొలగించిన ఘనత తెరాస ప్రభుత్వానిదేనన్నారు. పరిశ్రమల ఏర్పాటులో నిబంధనలను సులభతరం చేయడంతో దేశంలోనే అత్యధికంగా పరిశ్రమలు తెలంగాణలో నెలకొల్పారని వెల్లడించారు. విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అంతర్గత కలహాలతో వారే తన్నుకుని, హత్యలు చేసుకుని దాన్ని తమపై నెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సభలో భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన బండా నరేందర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ మందుల సామేల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ భరత్ కుమార్, పార్టీ పరిశీలకులు కిషన్‌రావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలు లాప్‌టాప్ సాయంతో బోర్డు పరీక్షలు రాయవచ్చు

సీబీఎస్ఈ నిర్ణయం

దిల్లీ: పది, పన్నెండు తరగతుల బోర్డు పరీక్షలకు హాజరౌతున్న ప్రత్యేక అవసరాలున్న పిల్లలను కంప్యూటర్లు /లాప్‌టాప్‌లతో పరీక్షలు రాసేందుకు ఈ ఏడాది నుంచీ అనుమతించాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. అయితే, ఆయా పిల్లలు కంప్యూటర్/లాప్‌టాప్‌లతో పరీక్షలు రాయడానికి అర్హులేనంటూ అధీకృత వైద్య, మనస్తత్వ శాస్త్ర నిపుణులు జారీ చేసిన ధృవీకరణ పత్రాలను సమర్పించిన వారికే ఈ అనుమతి వర్తిస్తుంది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వు వెలువడింది. ఈ ఏడాది నుంచీ ప్రత్యేక అవసరాలున్న (సీడబ్ల్యుఎస్ఎన్) కేటగిరీకి చెందిన చిన్నారులకు బోర్డుపరీక్షల సమయంలో ఈ వెసులుబాట్లు కల్పించాలని సీబీఎస్ఈ పరీక్షల సంఘం ఇటీవలే నిర్ణయం తీసుకుంది. అయితే, ఇలాంటి వెసులుబాటు పొందే పిల్లలు కేవలం ప్రశ్నలను పెద్ద అక్షరాల్లో చదువుకునేందుకు....జవాబులు రాసేందుకే అనుమతిస్తారు. కంప్యూటర్ ద్వారా ప్రశ్నలను వినాల్సిన అవసరమున్న పిల్లలకు ఆ వసతిని కూడా కల్పిస్తారు. ఇందుకు అర్హులైన చిన్నారులు ముందుగా ఈ మేరకు తమ సొంత కంప్యూటర్‌లను ఫార్మాట్ చేసుకుని తీసుకురావాలి. సంబంధిత కేంద్రం సూపరింటెండెంట్ సదరు కంప్యూటరు/లాప్‌టాప్‌ను తనిఖీ చేసిన మీదటే పరీక్ష రాసేందుకు అనుమతిని మంజూరు చేస్తారు.

నిరీక్షణ జాబితాను దృష్టిలో పెట్టుకుని 20 రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే తెలిపింది. కాచిగూడ-చెంగల్‌పట్టు, చెంగల్‌పట్టు-కాచిగూడతో పాటు కాకినాడపోర్టు-చెంగల్‌పట్టు, చెంగల్‌పట్టు-కాకినాడపోర్టుల మధ్య తిరిగే 4రైళ్లకు ఒక్కో త్రీటైర్ ఏసీ బోగీని అదనంగా ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొంది.

150 రకాల ప్రభుత్వ సేవలతో 'టి-ఫోలియో'

- అప్లికేషన్‌ను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ సేవలు ఇక మరింత చేరువ కానున్నాయి. మొత్తం 150 రకాల సేవలందించే 'టీ యాప్ ఫోలియో' అప్లికేషన్‌ను మంత్రి కేటీఆర్ బుధవారమిక్కడ ఆవిష్కరించారు. దీనిని త్వరలోనే వేయి రకాల సేవలకు విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు. టి-ఫైబర్ యాప్ కూడా అందుబాటులోకి రానుందనీ, నగరంలో జరిగే విశేషాలను దీని ద్వారా గ్రామీణులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. 5జీ సాంకేతికత రాకతో సెకనుకు 15 మెగాబైట్ల ప్రసార సామర్థ్యాన్ని అందుకోనున్నట్లు ఆయన చెప్పారు. కొత్త యాప్‌తో 'మీసేవ' కేంద్రాలకు అన్యాయం జరగబోదనీ, వాటి నిర్వాహకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. సాంకేతికత సామాన్యుడకు ఉపయోగపడాలనీ, లేకుంటే అది నిష్ప్రయోజనమే అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఈఎస్‌డీ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు ఇలా...

'టీ యాప్ ఫోలియో'ను డౌన్‌లోడ్ చేసుకున్నాక... ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ వివరాలను ఇచ్చి నమోదు చేసుకోవాలి. తర్వాత వచ్చే ఎంపీఐఎన్‌తో యాప్‌ను వాడుకోవచ్చు. బిల్లుల చెల్లింపులు, రీఛార్జులు చేసుకోవచ్చు. అడంగల్, పహాణి, మ్యుటేషన్, సర్టిఫైడ్ కాపీ ఆఫ్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాపీలను పొందడానికి 'అప్లికేషన్ అండ్ సర్టిఫికేట్' ఆప్షన్ ఉంది. జీహెచ్ఎంసీకి పన్నులు కట్టేందుకు 'టాక్స్' ఉంది. ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు, మెట్రోరైల్ మార్గాలు, ఛార్జీల వివరాలు, దగ్గర్లోని మీసేవా కేంద్రాలు, రేషన్ దుకాణాలు తదితర వివరాలున్నాయి. వ్యవసాయంలో యాంత్రీకరణ, సబ్సిడీ, ధరలను తెలుసుకోడానికి ఆప్షన్లు ఇచ్చారు. వీటిని క్లిక్‌చేస్తే సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లొచ్చు. ఆర్టీఏ, ఎం-వ్యాలెట్, టీ-వ్యాలెట్, దేవస్థానాల సేవలను ఈ యాప్‌తో అనుసంధానం చేశారు.

- ఆదాయ, కుల, నివాస, జనన, మరణ తదితర ధ్రువపత్రాల కోసం ఇక మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. వీటన్నింటినీ టీ యాప్ ఫోలియో ద్వారా పొందవచ్చు. మీసేవ దరఖాస్తు ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు.

పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దు

ఉప ముఖ్యమంత్రి కడియం ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఎలాంటి పొరపాట్లు జరగకుండా పదో తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఆయన బుధవారం సచివాలయం నుంచి కలెక్టర్లు, డీఈఓలు, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారులు(డీఐఈఓ)తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు అనుమతించరాదన్నారు. మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలన్నారు. వేసవి మొదలైందని.. తాగునీరు, వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు.

టీడీఎస్ బకాయిలపై విచారణ

ఈనాడు, హైదరాబాద్: ఉద్యోగుల నుంచి ఆదాయపన్ను మినహాయించి దాన్ని ఆ శాఖకు చెల్లించని సంస్థలన్నింటిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆదాయపన్నుశాఖ నోటీసులు జారీ చేసింది. సమాధానాలు అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

వైద్యవిద్య సహాయ ఆచార్య పోస్టుల ఫలితాలు విడుదల

ఈనాడు, హైదరాబాద్: వైద్యవిద్య విభాగంలో సహాయ ఆచార్య (అసిస్టెంట్ ప్రొఫెసర్) పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. వివిధ సూపర్ స్పెషాలిటీ విభాగాల్లోని పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు జరిగాయి. ఆ వెంటనే 6 విభాగాలకు సంబంధించిన ఫలితాలను వెలువరించింది. న్యూరోసర్జరీ విభాగంలో ఇద్దరు; యూరాలజీలో ఇద్దరు; ప్లాస్టిక్ సర్జరీలో ఒకరు; ఎండోక్రినాలజీలో ఒకరు చొప్పున ఎంపికయ్యారు. ఫలితాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఉద్యానవిశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లు కేటాయించాలి

కేంద్ర మంత్రికి పోచారం వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది రూ.100 కోట్లు కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి.. కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారమిక్కడ జరిగిన భారత వ్యవసాయ పరిశోధన మండలి 89వ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన కేంద్ర మంత్రిని కలిసి ప్రత్యేక వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలోని కొత్త జిల్లాల్లో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కందులను మరింత కొనుగోలు చేయాలని, రాష్ట్రంలో నిర్మించబోయే కిసాన్ భవన్‌కు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు వ్యవసాయ పరిశోధన మండలి వార్షిక సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలంటే కేవలం ప్రణాళికలు సరిపోవని, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నేలను బట్టి పంటలు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. కనీస మద్దతు ధరకంటే ఎక్కువ లభించేలా ప్రభుత్వాలు చేయూతనిస్తేనే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని అన్నారు.

నిజాం నగలపై వివాదం

- నాలుగు పెట్టెల్లో రూ.వందల కోట్ల విలువైన ఆభరణాలు
- నవాబు ఆస్తులన్నీ తమవేనంటున్న వారసులు
- తమకు విక్రయించారంటున్న బీదర్ వాసులు

ఈనాడు - హైదరాబాద్

నిజాం నవాబుకు చెందిన నగలపై కొత్త వివాదం తలెత్తింది. చివరి నిజాంకు చెందిన నాలుగు పెట్టెల ఆభరణాలు తమకే దక్కాలంటూ వారసులుగా చెప్పుకొంటున్నవారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాదు..కాదు.. ఈ నగలను నవాబు స్వయంగా తమకు విక్రయించారంటూ బీదర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు చెబుతున్నారు. నిజాం వారసులుగా చెప్పుకొంటున్న నవాబ్ కరీముద్దీన్‌ఖాన్, అయేషాలు బీదర్‌కు చెందినవారిపై ఇటీవల ఫిర్యాదు చేశారు. 60 ఏళ్ల క్రితంనాటి ఈ వ్యవహారంపై హైదరాబాద్ సెంట్రల్ క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ బంగారు ఆభరణాల విలువ రూ.వందల కోట్లకుపైనే ఉంటుందని సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఓ ఆభరణాల సంస్థ వీటి విలువను ఉజ్జాయింపుగా లెక్కగట్టినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నిజాం నవాబు విక్రయించినట్టు చెబుతున్న పత్రాలు అసలైనవా? నకిలీవా? అన్నదానిపైనే తాము దర్యాప్తు చేస్తున్నామని సీసీఎస్ వర్గాలు తెలిపాయి.

ముంబయి విమానాశ్రయంలో స్వాధీనం

నిజాం సంస్థానం భారత్‌లో విలీనమయ్యాక... చివరి నిజాం నవాబు 1952లో లండన్‌కు ప్రయాణమయ్యారు. భార్య, సేవకుడు నరసింహతో కలిసి డబ్బు, బంగారు నగలతో బయల్దేరారు. ముంబయి నుంచి లండన్‌కు విమాన టిక్కెట్లు తీసుకున్నారు. ముంబయిలోని శాంతాక్రజ్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు ఆయన తీసుకెళ్తున్న సామగ్రిని పరిశీలించారు. నాలుగు పెట్టెల్లో ఉన్న బంగారు ఆభరణాలకు సంబంధించిన వివరాలు సక్రమంగా లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిజాం నవాబు అవి లేకుండానే భార్య, సేవకుడు నరసింహతో సహా వెళ్లిపోయారు. స్వాధీనం చేసుకున్న నగల పెట్టెలను కస్టమ్స్ అధికారులు జాగీర్ అడ్మినిస్ట్రేషన్ సెటిల్‌మెంట్ విభాగానికి అప్పగించగా... అధికారులు గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీహెచ్ ప్రధానశాఖలో ఉంచారు. ఆరేళ్ల తర్వాత నవాబు తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. అయితే... ఆయన తిరిగి వచ్చిన వెంటనే సదరు నగలను తమకు విక్రయించారంటూ బీదర్‌కు చెందిన అహ్మద్ మియా, జాకిర్ ఉస్మాన్‌లు చెబుతున్నారు.

మావి... కాదు మావి...

చివరి నిజాం స్థిరచరాస్తులన్నీ తమకే దక్కుతాయంటూ కరీముద్దీన్‌ఖాన్, ఆయేషాలు అంటున్నారు. సౌదీ అరేబియాలో నిజాం నవాబుకు చెందిన రూ.వందల కోట్ల విలువైన స్థిరాస్తులూ తమకే దక్కుతాయనీ... బీదర్‌కు చెందిన వ్యక్తులు నకిలీ దస్తావేజులు సృష్టించారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి కొన్ని పత్రాలను పోలీసులకు అందజేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసు అధికారులు కొన్నిరోజుల క్రితం ముంబయికి వెళ్లారు. శాంతాక్రజ్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులను కలిసి... చివరి నిజాం నవాబు నుంచి స్వాధీనం చేసుకున్న నగల వివరాలు కావాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించారు.

అర్హత పరీక్షకు దరఖాస్తు గడువు పొడగింపు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అర్హత పరీక్ష(ఎలిజిబెలిటీ టెస్ట్)-2018 దరఖాస్తు చివరి తేదీని మార్చి 22 వరకు పొడగించినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపాయి. కనీస విద్యార్హత లేకున్నా డిగ్రీ కోర్సులో చేరాలంటే విశ్వవిద్యాలయం నిర్వహించే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయ ఏదేని అధ్యయన కేంద్రంలో వివరాలు పొందవచ్చన్నారు. ముందుగా ప్రకటించిన పరీక్ష తేదీని మారుస్తూ ఏప్రిల్ 8న రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. టీఎస్ఆన్‌లైన్/ఏపీఆన్‌లైన్ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకొని నిర్దేశిత ఫీజు చెల్లించాలని, ఆన్‌లైన్ నమోదు, ఫీజు చెల్లింపు, అధ్యయన కేంద్రాల వివరాలను www.braouonline.in లో చూడవచ్చన్నారు.

21 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

- ఒమన్ దేశస్థుడినంటూ.. పాకిస్థానీయుడి మోసం
- పాతబస్తీ మహిళ మహమ్మదీ బేగంతో నిఖా
- స్వదేశానికి పంపేందుకు అడ్డంకులు

చంచల్‌గూడ - న్యూస్‌టుడే

కట్టుకున్న వాడు చేసిన మోసంతో పాకిస్థాన్‌లో బానిసగా బతుకుతున్న పాతబస్తీకి చెందిన మహిళ ఎట్టకేలకు బుధవారం 21 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకుంది. బండ్లగూడకు చెందిన మహమ్మదీ బేగం(45)కు 21 ఏళ్ల కిందట టెలిఫోన్‌లో ఒమన్ దేశస్థుడితో నిఖా కుదిరించారు. ఆమె అక్కడికి వెళ్లిన తర్వాత భర్త ఒమన్ కాదు పాకిస్థాన్ దేశస్థుడని తెలిసింది. ఆమెను పాకిస్థాన్ తీసుకెళ్లి బానిసగా మార్చాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆమెను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. పాకిస్థాన్‌లో భారత్ హైకమిషన్ అధికారులు, సిబ్బంది ఆమెకు వీసా ఇప్పించినా భారత్‌కు పంపేందుకు భర్త అడ్డంకులు సృష్టించాడు. దీంతో ఎంబీటీ నాయకుడు అమ్జదుల్లాఖాన్ ఆమెను తిరిగి రప్పించాలని విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్‌కు విజ్ఞప్తి చేశారు. విదేశాంగ శాఖ అధికారుల చొరవతో ఎట్టకేలకు మహమ్మదీ బేగం బుధవారం ఉదయం లాహోర్ నుంచి దిల్లీకి చేరుకుంది. అక్కడ ఆమెను తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్, ఎంబీటీకి చెందిన డా.జరార్‌లు కలుసుకున్నారు. రాత్రి నగరానికి చేరుకుని రెండు దశాబ్దాల తర్వాత తల్లిదండ్రులను కలుసుకుని ఆనందంగా హత్తుకుంది.



తల్లిదండ్రులతో మహమ్మదీ బేగం

సాహసమే ఊపిరిగా...



తెలుగు రాష్ట్రాలకు చెందిన వీరంతా కిందటి ఏడాది వరకూ సామాన్యులు. కొలువు కోసం కుస్తీ పట్టి... పోలీసుశాఖలో ఉద్యోగం సంపాదించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ఏడో పోలీస్ పటాలంలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందారు. బుధవారం శిక్షణ ముగింపు సందర్భంగా తమ అద్భుత విన్యాసాలతో ఆకట్టుకున్నారు. - ఈనాడు, నిజామాబాద్

అఖిలభారత ఉద్యోగుల పోటీల్లో పతకం

అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఎం.సునీత ఘనత

ఈనాడు, హైదరాబాద్ : ఇటీవల గుంటూరులో జరిగిన అఖిలభారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో తెలంగాణకు పతకం సాధించిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఎం.సునీతను సచివాలయ ఉద్యోగుల సంఘం బుధవారం ఘనంగా సన్మానించింది. ఒక వైపు విధులను నిర్వహిస్తూ, మరోవైపు క్రీడల్లో రాణిస్తూ ఆమె ఆదర్శంగా నిలిచారని నేతలు ప్రశంసించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

పింఛనుదారుల సంయుక్త కార్యాచరణ సమితి


ఈనాడు, హైదరాబాద్: తమ సమస్యల్ని పలు మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని తెలంగాణ ప్రభుత్వ పింఛనుదారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆక్షేపించింది. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా మార్చి 12న హైదరాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద మౌనప్రదర్శన నిర్వహించాలని తీర్మానించింది. టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో 25న జరిగే సకల ఉద్యోగుల ఐకాస సభలోనూ పాల్గొనాలని బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నిర్ణయించింది. పదో పీఆర్సీ కమిషనర్ ప్రతిపాదించినట్లుగా 70 ఏళ్లు నిండినవాళ్లకు 15శాతం అదనపు పింఛను ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని, తెలంగాణలో పనిచేసి పదవీవిరమణ చెందినవారికి ప్రత్యేక తెలంగాణ పారితోషికం ఇవ్వాలని, జిల్లాకు ఒక వెల్‌నెస్ సెంటరు ఏర్పాటు చేయాలని ఐకాస ఛైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికుల హామీలను విస్మరించిన సీఎం: చాడ

ఈనాడు, హైదరాబాద్: సింగరేణి ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఆదిలాబాద్ పర్యటనలో ప్రస్తావించకపోవడం దారుణమని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. వారసత్వ ఉద్యోగాలకు బదులుగా కారుణ్య నియామకాలిస్తామని చెప్పి ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడంతో సింగరేణి కార్మికులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని ఆయన పేర్కొన్నారు.

హిందీకి బదులు సంస్కృతం ప్రశ్నపత్రం ఇచ్చారు!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఓ విద్యార్థిని ఏడాది పాటు చదివిన పాఠ్య పరీక్షను కోల్పోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అల్లిగూడేనికి చెందిన నారం స్వాతి (హాల్ టికెట్ నంబరు : 1844114252) బుధవారం ప్రథమ భాష పరీక్షగా హిందీ రాయాల్సి ఉంది. దమ్మపేట మండలం మందలపల్లిలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల(బాలురు) పాఠశాలలో పరీక్షకు హాజరవగా ఇన్విజిలేటర్ హిందీ ప్రశ్నపత్రం బదులు సంస్కృతం ఇచ్చారు. తాను హిందీ పరీక్ష రాయాల్సి ఉందని చెప్పినా పట్టించుకోకుండా ఇచ్చిందే రాయమంటూ హుకుం జారీచేశారని బాధితురాలు వాపోయారు. పరీక్ష అనంతరం సమస్యను తమ కళాశాల ప్రిన్సిపల్ సాగర్‌కు తెలిపింది. తాను పరీక్షా కేంద్రంలోని ముఖ్య పర్యవేక్షణాధికారితో మాట్లాడినా బాధ్యతారహితంగా మాట్లాడారని, పూర్తినివేదిక ఆర్‌జేడీ, నోడల్ అధికారికి పంపనున్నట్లు ప్రిన్సిపల్ సాగర్ తెలిపారు.


హిందీ ప్రశ్నపత్రం ఇవ్వకుండా సంస్కృతం ఇచ్చారని చూపుతున్న విద్యార్థి నారం స్వాతి

మకరందం

ఈనాడు

మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

■ makarandam@eenadu.in



ఎన్నెన్నో వర్ణాలు

అన్నింటా అర్థాలు



పువ్వు పూస్తే రంగు...

మెరుపు మెరిస్తే రంగు..

రంగుల్లేని ప్రకృతిని ఊహించలేం...
రుతువు రుతువుకీ కొత్త వర్ణాలను
పులుముకునే పరిసరాలు
మనసుకు ఆహ్లాదాన్ని,
ఆధ్యాత్మిక వికాసాన్ని
కలిగిస్తాయి...

ఫాల్గుణమాసంలో ప్రకృతి
శోభాయమానమైన వర్ణాలతో
స్వాగతం పలుకుతుంది...

ఆ నెలలో వచ్చే పౌర్ణమి హోలీ
పేరుతో అందరినీ రంగుల్లో ముంచి
తేలుస్తుంది...

చూసే మనసుకు కళ్లుంటే జీవితం ఓ హరివిల్లు...

ఎంతో భావకుడైన సృష్టికర్త ప్రపంచాన్ని రంగుల మయంచేశాడు... చూసి ఆనందించమని.

అలా చూడ్డానికి అనుకూలంగా కంటిని అద్భుతంగా నిర్మించి మనిషికి ఇచ్చాడు.

భగవంతుడి సృష్టికే శోభాయమానం, అద్భుతం అనదగ్గ విషయమది.

దేవుళ్ల విషయానికి వస్తే శివుడు నీల కంఠుడు... కృష్ణుడు నీలి చంద్రుడు... రాముడు నీల మేఘశ్యాముడు... అంతే కాదు పువ్వుకో రంగు, ఆకుకో రంగు, హరివిల్లులో ఏడు రంగులు... ఇంత చేసిన భగవంతుడు ఓ అద్భుతమైన చిత్ర కారుడు. ఒక్కో రంగుకు ఒక్కో ప్రత్యేకత.. ఓ విశేషం... ఓ ఆకర్షణ ఉన్నాయి మనిషి మనస్తత్వాన్ని బట్టి వాటిపై ఆరాధన ఉంటుందంటారు. అవసరం మారుతుందంటారు. జాతకశాస్త్రంలో కూడా రంగుల విశ్లేషణ ఉంది. ఆ రంగుపై ఇష్టం ఆధారంగా అతని మనో స్వభావాలను విశ్లేషిస్తున్నారు నేటి మనస్తత్వ శాస్త్రవేత్తలు. ఇవన్నీ ప్రపంచమంతా వ్యాపించి ఉన్న వర్ణాలకు, మనిషి జీవితానికి ఉన్న సంబంధాన్ని తేటతెల్లం చేసే విషయాలే. దీన్ని అర్థం చేసుకోగలిగితే, విశ్లేషించుకోగలిగితే మన జీవితాన్ని మరింత తీర్చిదిద్దుకోవచ్చు. సుందరంగా, ఆకర్షణీయంగా, రంగుల లిపిగా మార్చుకోవచ్చు.

● తెలుపు రంగు ప్రశాంతతకు చిహ్నం. తాత్వికతకు నిదర్శనం. మనిషి ప్రశాంత స్థితిలో ఉన్నప్పుడు తెల్లటి రంగును ఇష్టపడతాడు. తెలుపు దుస్తులను ధరించాలనుకుంటాడు. స్వచ్ఛతకు ఈ రంగు ప్రతీక.

● నలుపును సాధారణంగా విషాదానికి చిహ్నంగా భావించినా ఇది పవిత్రతను సూచిస్తుంది. ఐహిక ప్రపంచానికి దూరంగా ఉన్నవారు ఈ రంగు దుస్తులను ధరించాలంటారు. అయ్యప్ప దీక్షధారులు ఈ రంగు దుస్తులను ధరించడంలో పరమార్థమిదే. మనం చూస్తున్న రంగులన్నీ నలుపులో నుంచే వచ్చాయని వేదాంతం చెబుతుంది. చీకటిలో నుంచి అనేక రంగులు ఉద్భవించి తెలుపులో లీనమవుతున్నాయి, కాబట్టి ఈ రంగును భగవంతుడి స్వరూపంగా భావిస్తారు. అందుకే ధ్యానం చేసేటప్పుడు నల్లటి చుక్కపై దృష్టి నిలుపుతారు. నలుపు చెడు ప్రాణ శక్తులను ఆకర్షిస్తుంది. తనలో నిక్షిప్తం చేసుకుంటుందని నమ్ముతారు. అందుకే కాటుకను దిష్టి చుక్కగా పెడతారు.

● ఎరుపు రంగు పౌరుషానికి, ఉత్తేజానికి నిదర్శనం. రజో గుణానికి ఎరుపు, తమోగుణానికి నలుపు, సత్వగుణానికి తెలుపు సూచికలు. సృష్టికర్త రజోగుణంలో ఉంచి సమస్తాన్నీ సృష్టిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. కాబట్టి ఎరుపు సృజనాత్మకతకు కూడా చిహ్నం. శత్రువులను భయపెట్టే గుణం కూడా ఈ రంగులో ఉంది.

● దివ్యత్వాన్ని నీలిరంగు సూచిస్తుంది. ఎక్కడ నీలిరంగు వ్యాపించి ఉంటుందో అక్కడ మనస్సు ప్రశాంత స్థితిలోకి జారుకుంటుంది. సాధారణంగా పూజా గదుల్లో, ధ్యానమందిరాల్లో నీలిరంగు కాంతులతో వెలుగుతున్న చిన్నపాటి విద్యుద్దీపాన్ని పెట్టుకుంటారు. దీనివల్ల ఏకాగ్రత కుదురుతుందని, మనసు లక్ష్యంపై లగ్నమవుతుందని చెబుతారు. నిద్ర గదిలో ఈ రంగు కాంతి ఉండడం వల్ల గాఢమైన, ప్రశాంతమైన నిద్ర పడుతుందని సైన్స్ రుజువు చేసింది.

● ఆకుపచ్చ ఎదుగుదలకు, ఉత్పత్తికి చిహ్నం. మనసులో ఒక పార్శ్వాన్ని పచ్చగా ఉంచుకోండని చెబుతారు. దీనివల్ల అంతులేని సృజనాత్మకత పెరుగుతుంది. ఆకుపచ్చదనం ఏర్పడడానికి అసలు కారణం పత్రహరితం. వాతవరణ కాలుష్యాన్ని పారదోలే శక్తి దీనికి ఉంది. రుషులు కూడా అందుకే తమ తపోస్థలిగా అడవులను, పచ్చటి ప్రాంతాలను ఎంచుకున్నారని చెప్పవచ్చు.

ఒక్కో రంగుకు ఒక్కో లక్ష్యం, అవసరం, ప్రత్యేకత ఉన్నాయి. మానసిక ఔన్నత్యం, ఆధ్యాత్మిక శక్తులకు రంగులు ప్రతీకగా నిలుస్తాయని కిర్లియన్ ఫొటోగ్రఫీ నిరూపించింది. దీంతో ఫొటోలు తీసినప్పుడు మనిషి చుట్టూ వైవిధ్యమైన రంగులతో కాంతి పరివేషం కనిపిస్తుంది. ఇది కోపంగా ఉన్నప్పుడు ఒకరకం, శాంతంగా ఉంటే మరో రకం, ఆందోళనగా ఉన్నప్పుడు ఇంకో రకంగా ఉంటుంది. కొన్నేళ్ల క్రితం భగవాన్ సత్యసాయిబాబాను ఈ విధానంలో ఫొటో తీసినప్పుడు ఆయన చుట్టూ అద్భుతమైన నీలికాంతులను గమనించానని ఓ శాస్త్రవేత్త వివరించారు. ఏ రంగు మన ఆధ్యాత్మికతకు, మన ఉన్నతికి, మన మనస్తత్వానికి దోహదపడుతుందో అర్థం చేసుకోవడమే భగవంతుడి స్వప్నలిపిని అధ్యయనం చేయడం. మనిషి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి ఈ అధ్యయనం ఎంతో దోహదపడుతుంది. దీన్ని తెలుసుకున్న వాళ్ల జీవితం వర్ణరంజితమవుతుంది. సప్తవర్ణ శోభితమవుతుంది.

– వై.శ్రీలక్ష్మి

కథల కేళీ!

ప్రకృతికాంత నూతన శోభను సంతరించుకున్నప్పుడు ఆమెకు స్వాగతం పలకడం అనాదిగా వస్తున్న భారతీయ సంప్రదాయం. ఆ ఆచారపు ఆనంద స్వరూపమే 'హోలీ'. అమితోత్సాహంతో జరుపుకునే ఈ పండగను ఫాల్గుణోత్సవం అంటారు. ఫాల్గుణ పౌర్ణమి నాటి ఈ ఉత్సవాన్ని మదనోత్సవంగా, వసంతోత్సవంగా వ్యవహరిస్తారు. కాల నిర్ణయం మన దేశంలో రెండు పద్ధతుల్లో జరుగుతుంది. సౌరమానం, చాంద్రమానం. ఉత్తర భారతంలో ప్రతి నెలా పౌర్ణమితో ముగుస్తుంది. దక్షిణ భారతదేశంలో అమావాస్యతో పూర్తవుతుంది. ఈ కారణం వల్ల ఉత్తరాదిన చైత్రమాసానికి ముందు రోజైన ఫాల్గుణ పౌర్ణమిని వసంతోత్సవంగా పరిగణిస్తారు. భవిష్య పురాణంలో మదనోత్సవం వర్ణన ఉంది.

■ హోలీ పదాన్ని నిఘంటువులు కూడా స్పష్టంగా నిర్వచించలేదు. కల్పద్రుమ కోశం 'అగ్నిలో సగం కాలిన గడ్డితో కూడిన గింజల'ను హోలికలు అని పేర్కొంది. ఇదే హోలకమని వైద్యశాస్త్ర గ్రంథాలు చెబుతున్నాయి. ఇది కఫ దోషాల్ని పోగొడుతుందని అంటారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రధాన ఆహార ధాన్యమైన గోధుమలు కోతకు వచ్చే తరుణం. కొత్తగా పండిన ధాన్యాన్ని తెచ్చి గ్రామస్థులంతా ఒకచోట చేరి దాన్ని కాల్చి సగం పక్వమైన తరువాత భుజిస్తూ పండగ చేసుకునేవారు. ఆనాడు రైతులు పంటల్ని కోస్తూ 'హో... హో...' అంటూ చేసే సందడే కాలక్రమంలో హోలీ పండగగా మారింది.

■ దేశవ్యాప్తంగా హోలీ పండగకు సంబంధించి ఓ గాథ ప్రాచుర్యంలో ఉంది. శివుని తపస్సుకు భంగం కలిగించేందుకు మన్మథుడు వసంత రుతువును సృష్టించి, శివుడిపై తన పుష్ప బాణాలను వదిలాడు. శివుడి మనస్సు చలించి... దానికి కారణం తెలుసుకుని తన మూడో కన్ను తెరిచి మన్మథుణ్ణి భస్మం చేశాడు. ఆ కామదహన స్మరణే హోలీ జరుపుకోవడానికి కారణమని, కామాన్ని అణచడమనే సంకేతంతో ఈ పర్వం విలక్షణమైందని భావిస్తున్నారు. ఈ భావనతోనే తెలుగునాట 'కాముని పున్నమి' అని, తమిళంలో 'కామకే పండగై' అని, కన్నడ ప్రాంతంలో 'కామిన హచ్చి' అనే వ్యవహారం ఏర్పడింది.

■ వంగదేశంలో ఈ ఉత్సవాన్ని డోలోత్సవం అంటారు. ఆనాడు శ్రీకృష్ణునికి డోలోత్సవం జరుపుతారు. పూర్ణపు బొబ్బట్లు నైవేద్యం పెట్టడం ఆచారం. డోల అంటే ఊయల. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం క్షేత్రంలో కూడా ఈ ఫాల్గుణ పౌర్ణమినాడు డోలోత్సవం నిర్వహిస్తారు. కూర్మనాథుణ్ణి ఊయలలో ఊగిస్తారు. ఈ సందర్భంగా ఇక్కడ జరిగే తిరునాళ్లను డోలాయాత్ర అంటారు. ఇది డోలా పౌర్ణమిగా ప్రసిద్ధి చెందింది.

■ కాముని పున్నమి నాడు తెలంగాణ గ్రామాల్లో పశువుల కాపర్లు వారిలో ఒకరికి ఎలుగుబంటి వేషం వేసి నడుముకు గంటలు కట్టి ఇంటింటి ముందు ఆడిస్తూ పాటలు పాడుకుంటూ భిక్షాటన చేసే ఆచారం ఉండేది. ఈ ఉత్సవంలో జాజర పాటలు పాడడం పరిపాటి.

'జాజిరాడుదాం జమకూడుదాం

ఎప్పుడెళ్లినా ఎనబయిమంది

జాజిరి జాజిరి జాజిరి...' అంటూ గుంపులు కట్టి వెన్నెల రాత్రుళ్లు ఇళ్ల ముందు ఆడడం వినోదంగా, హాస్యభరితంగా, శృంగారాభినయంగా ఉంటుంది. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో భీమనాథుడి ఎదుట వీణలు మీటుతూ అప్సరలు పాడారని వర్ణించాడు.

■ రఘు మహారాజు తన రాజ్యంలోని శిశువుల్ని చంపుతున్న 'హోలిక' అనే రాక్షసిని చంపాడు. ఆ సందర్భంగా ప్రజలు జరిపిన ఉత్సవం 'హోలీ' అయిందని కొన్ని గ్రంథాలు పేర్కొన్నాయి. ఈ ఉదంతాన్ని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వివరించినట్లు భవిష్యపురాణం చెబుతోంది. 'పురుషార్థ చింతామణి' కూడా హోలికా రాక్షసి బొమ్మను తయారు చేసి దహనం చేస్తారని ఆ సందర్భంగా అసభ్యకరమైన దూషణ చేస్తారని పేర్కొంది.

■ హాలుడి గాథాసప్తశతిలో, వాత్స్యాయన కామసూత్రాల్లో ఈ ఉత్సవం ప్రస్తావన ఉంది. శ్రీ హర్షుడి 'రత్నావళి' నాటకంలోనూ దీని గురించి ఉంది. ఫాల్గుణ పౌర్ణమి వెన్నెల్లో వెదురు పిచికారులతో రంగు నీటిని చల్లుకునేవారని, బురద నీరు చల్లుకోవడం ఈ పండగలో ఆచారమని ఆ గ్రంథాలు పేర్కొన్నాయి. రంగులు చల్లుకునే వేడుక ఉత్తరాది నుంచి దక్షిణ భారతానికి వ్యాపించింది. విజయనగరం, కొండవీటి రాజ్యాల్లో ఈ ఫాల్గుణోత్సవం వైభవంగా జరిగినట్లు చరిత్రకారుల రాతలు నిర్ధరిస్తున్నాయి. రెడ్డి రాజుల్లో కుమారకూరిరెడ్డికి 'కర్పూర వసంతరాయలు' అనే బిరుదు ఉంది.

–డా... దామెర వెంకటసూర్యారావు.



క్రీస్తువాణి

ఓ మంచి మాట...

'మాటే మంత్రం' అంటారు. అందులో మహత్తు ఉంది. మాట మధురంగా ఉండాలి. మలయమారుతంలా చల్లగా తాకాలి. ఒక మాటతో రెండు హృదయాలే కాదు.. రెండు దేశాలూ శాంతించిన సందర్భాలు ఎన్నో! ఈ మాటల గురించి క్రీస్తుప్రభువు చెప్పిన ఉపమానాలు గుర్తు చేసుకోవచ్చు.



ఒకసారి క్రీస్తు తన శిష్యులతో కలిసి ఒక గ్రామాన్ని సందర్శించాడు. సమయం మించిపోవడంతో శిష్యులు స్నానం చేయకుండానే భోజనానికి కూర్చున్నారు. ఆ రోజుల్లో యూదుల మతాచారం ప్రకారం.. భోజనానికి ముందు స్నానం చేయాలి. కనీసం శరీరంపై నీళ్లయినా చల్లుకోవాలి. వాటికి విరుద్ధంగా భోజనానికి ఉపక్రమించిన శిష్యులను చూసిన ఆనాటి మతపెద్దలకు అది రుచించలేదు. విమర్శలు చేయడం మొదలుపెట్టారు. అప్పుడు క్రీస్తు వారితో.. "వెలుపలి నుంచి లోపలికి పోయి మనుషులను అపవిత్రులను చేసేది ఏదీ లేదు. కానీ లోపల నుంచి బయటకు వెళ్లినవే మనుషులను అపవిత్రులను చేస్తాయి" అన్నాడు. ఇక్కడ ప్రభువు ఉద్దేశంలో లోపల నుంచి బయటకు వెళ్లేది.. నోటిలో నుంచి వెలువడే మాట! ఇది హృదయంలో నుంచి వస్తుంది. లోపల ఉన్న దురాలోచనలు, వైషమ్యాలు, క్రోధం, అహం వంటివి మాటలుగా బయటపడి అవి మనుషులను అపవిత్రం చేస్తాయి. ఫలితం పరస్పర వైషమ్యంతో మిత్రులు, శత్రువులుగా మారే ప్రమాదం ఉందని ప్రభువు ప్రవచనంలోని పరమసత్యం.

మంచిమాటలతో మనుషుల మధ్య స్నేహపు వంతెనలు నిర్మించవచ్చు. ఈ మాటలు కొన్నిసార్లు మనసుల మధ్య అడ్డుగోడలు నిర్మించి మారణహోమాన్ని కలిగిస్తాయి. ఒక శాంతియుత సహజీవనానికి, మనుషుల మానసిక వికాసానికి మంచి మాటలే మాట్లాడుదాం.

– డాక్టర్ ఎమ్.సుగుణరావు

గురు బోధ

జయ వందనం

పరంజ్యోతి స్వరూపం జయేంద్ర సరస్వతి ప్రతిరూపం. కంచి పీఠాధిపతులుగానే కాక భక్తుల మనోనేత్రంగా కూడా ఆయన ప్రకాశిస్తుండేవారు. ఆ దోవన వెళ్లండి మేలు జరుగుతుంది. ఇలా నడుచుకోండి జీవిత లక్ష్యం నెరవేరుతుందంటూ ఆయన చెప్పే విషయాలు జీవన గమనానికి వాగ్దీపికలే. ఒక్కసారి ఆయన బోధనలను వింటే, వాటి సారాన్ని తెలుసుకుంటే మనసు అంతులేని ఆనందాన్ని పొందుతుంది. అందులో కొన్ని..



● **పుణ్యానికి దగ్గరి దారి**

మనిషిగా జన్మించగలగడం, మోక్షాన్ని ఆశ్రయించగలగడం, మహా పురుషుల చెంతకు చేరగలగడం... ఇవన్నీ దైవానుగ్రహంతోనే ప్రాప్తిస్తాయి. దైవం అనుగ్రహించాలంటే తగిన సత్కార్యాలు తప్పనిసరి. తోటివారి సేవ పుణ్యానికి మంచి మార్గాన్ని చూపుతుంది. సమాజంలో అట్టడుగున ఉండి అన్నానికి, వస్త్రానికి నోచుకోని వారు, వైద్య సేవలు అందని వారు కోకొల్లలుగా ఉన్నారు. వారందరికీ సాయం చేయడం సులువైన మోక్ష మార్గం. కంచి పీఠం ప్రధాన లక్ష్యం సేవే.

● **స్వామి భక్తి.. ఫలితం...**

దైవ నామానికి ఉన్న శక్తి అనంతం. నామ మహిమను ఆంజనేయస్వామి ద్వారా తెలుసుకోవచ్చు. రామ నామ స్మరణ ద్వారా ఆయన ఎన్నో విజయాలు సాధించారు. స్వామి భక్తి ఉన్నప్పుడే కింది ఉద్యోగి పై అధికారి మాట వింటాడు. అలాగే పై అధికారి ఆపై అధికారి మాట వినాలి. ఇది మంచి ఫలితాలకు దారితీస్తుంది. ఉద్యోగి లేదా సేవకుడికి హనుమంతుడే ఆదర్శం.

● **సమానత్వం..**

ఏ మనిషీ మరో మనిషి కంటే తక్కువ కాదు. ఒక మతాన్ని నమ్ముతున్నప్పుడు ఆ మతంలోని దైవాన్ని ఆశ్రయించినప్పుడు దానికి సంబంధించిన శ్రుతులు, స్మృతులు, పురాణాల్లోని పాత్రలను అన్వయించుకోవాలి. అందులోని మంచిని ఆచరించగలిగినప్పుడే ఆ ధర్మాన్ని నిజంగా నమ్మినట్లు. పురుషులకంటే స్త్రీలు తక్కువనుకోవడం ఏ విధంగానూ సమంజసం కాదు. మన పురాణాల్లో ఎందరెందరో గొప్ప స్త్రీమూర్తులున్నారు. వారందరినీ గమనిస్తే స్త్రీల విలువ తెలుస్తుంది. పురాణాలు వయసు మీరిన వారిక కాదు, పిల్లలకు, యువతకు కూడా ఉపకరిస్తాయి.

–యల్లాప్రగడ మల్లికార్జునరావు

ఇస్లాం సందేశం

అతిథిని ఆదరించాల్సిందే...

అతిథిని ఆదరిస్తే దైవం కరుణిస్తాడని చెబుతోంది ఇస్లాం. ముహమ్మద్ ప్రవక్త (స) అతిథులను గౌరవించాలని చెప్పడమే కాదు.. ఆచరించారు కూడా. అతిథుల రాకను తెలుసుకొని వారి కోసం ఇంటి ముందు వేచి ఉండేవారు. ఇంటికి వచ్చిన బంధువులను సాదరంగా లోనికి ఆహ్వానించేవారు. ఆత్మీయంగా పలకరించేవారు. మంచి భోజన ఏర్పాట్లు చేసేవారు. తనకు ఆకలిగా ఉన్నా.. ముందుగా అతిథి ఆకలి గురించి ఆలోచించేవారు. ప్రవక్త అనుచరులంతా ఆయన బాటలోనే నడిచేవారు. ఒకసారి ప్రవక్త (స) ఇంటికి ఒక అతిథి వచ్చాడు. "ఇంట్లో తినడానికి ఏమైనా ఉన్నాయా?" అని తన భార్యను అడిగారు ప్రవక్త. 'మంచినీళ్లు తప్ప ఏమీ లేవు' అని సమాధానం వచ్చింది. ప్రవక్త (స) తన సహచరులతో 'నా అతిథికి భోజనం ఎవరు పెడతారు?' అని అడిగారు. ఒక సహచరుడు 'నేను!' అన్నాడు. అతిథిని తన వెంట ఇంటికి తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లాక భార్యతో.. 'ప్రవక్తగారి అతిథి మన ఇంటికి రావడం అదృష్టం. భోజన ఏర్పాట్లు త్వరగా చూడు' అని చెప్పాడు. దానికి భార్య 'ఇంట్లో పిల్లలకు సరిపడా అన్నమే ఉంది' అని బదులిచ్చింది. 'పిల్లలకు ఏదో నచ్చజెప్పు. అతిథికి భోజనం వడ్డించే సమయంలో దీపం ఆర్పేయ్. చీకట్లో మనం అన్నం తింటున్నట్టు నటిద్దాం. అతిథి కూడా మనం తింటున్నాం అనుకుంటాడు" అని భార్యకు నచ్చజెప్పాడు. అలా ఆ రాత్రి అతిథికి కడుపారా భోజనం పెట్టారు. పిల్లలు సహా భార్యాభర్తలిద్దరూ పస్తున్నారు. మర్నాడు ప్రవక్త నుంచి 'అతిథిని మీరు గౌరవించిన తీరుకు అల్లాహ్ సంతుష్టుడయ్యాడు' అని సందేశం వచ్చింది. అతిథి మర్యాదలకు ఇంతకన్నా గొప్ప ఉదాహరణ ఏముంటుంది.



పూర్వం ప్రవక్త ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ అతిథుల రాకకోసం అల్లాహ్‌ను వేడుకునేవారు. తమ ఇంటికి అతిథులు వస్తేనే ఇంట్లో శుభాల వర్షం కురుస్తుందని ఆయన విశ్వసించేవారు. కనుక మనింటికి వచ్చే అతిథులను గౌరవిద్దాం. వారిని సాదరంగా ఆదరిద్దాం. శుభాలను ఆహ్వానిద్దాం.

–ఖైరున్నీసాబేగం

ఈనాడు సినిమా


మహేష్‌బాబు

భరత్ ఆగమనం

మహేష్‌బాబు ముఖ్యమంత్రిగా కనిపించబోయే చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకుడు. డి.వి.వి.దానయ్య నిర్మాత. ఏప్రిల్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈనెల 6న 'ద విజన్ ఆఫ్ భరత్' అనే పేరుతో ఓ టీజర్ విడుదల చేయనున్నారు. రాజకీయ నేపథ్యంలో సాగే కథ ఇది. వినోదం, కుటుంబ బంధాలు, యాక్షన్... ఇలా కొరటాల శివ మార్క్ కనిపించబోతోంది. మహేష్ - కొరటాల కలయికలో 'శ్రీమంతుడు' వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. 'భరత్...' కూడా దాన్ని మించిన స్థాయిలో ఉండబోతోందని చిత్రబృందం చెబుతోంది. కైరా అద్వాని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

వెంకీతో శ్రియ



వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. డి.సురేష్‌బాబు, అనిల్ సుంకర నిర్మాతలు. ఈనెల రెండో వారంలో చిత్రీకరణ మొదలు కానుంది. ఇందులో కథానాయిక ఎవరనే విషయంపై గత కొంతకాలంగా చర్చ నడుస్తోంది. చిత్రబృందం కూడా చాలామంది పేర్లు పరిశీలించి చివరకు శ్రియని ఖరారు చేశారు. వెంకీ - శ్రియలు ఇదివరకు 'సుభాష్ చంద్రబోస్'లో జోడీగా కనిపించారు. ఆ తరవాత వీరిద్దరూ కలిసి నటించే చిత్రమిదే. నారా రోహిత్ ఓ కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. కుటుంబ బంధాలకు ప్రాధాన్యమున్న కథ ఇది. 'ఆటా నాదే - వేటా నాదే' అనే పేరు పరిశీలనలో ఉంది.

ఇది నాలుగోసారి


కె.టి.నాయక్, శ్రీకాంత్, వెంకట్

మకరంద్‌దేశ్‌పాండే, పూజాగాంధీ, రవికాలె, రవిశంకర్, పెట్రోల్ ప్రసన్న ప్రధానపాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'దండుపాళ్యం-4'. కె.టి.నాయక్ దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ నిర్మాత. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ "క్రైమ్ కథలతో ఆసక్తికరంగా రూపొందిన దండుపాళ్యం-1, 2 చిత్రాలకి ఆదరణ లభించింది. 'దండుపాళ్యం-4' కూడా ప్రేక్షకాదరణ పొందాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "దండుపాళ్యం లాంటి కథలను ఆసక్తికరంగా ఎన్ని భాగాలుగా అయినా తీయొచ్చు. ఈనెల 8న చిత్రీకరణని మొదలెట్టి ఏప్రిల్‌లోగా పూర్తిచేస్తామ'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "దండుపాళ్యం-1,2 చిత్రాల్లో నటించినవారితోపాటు మరికొంతమంది కొత్తవారు కూడా తెరపై కనిపిస్తారు. ఆనంద్ రాజా స్వరకర్త. అర్జున్ జన్య నేపథ్యసంగీతాన్నిస్తార"న్నారు.

సరికొత్త 'లవర్'


రాజ్ తరుణ్

'అలా ఎలా'తో ఆకట్టుకున్న దర్శకుడు అనీష్ కృష్ణ. ఇప్పుడు యువ కథానాయకుడు రాజ్ తరుణ్ కోసం ఓ కథ సిద్ధం చేశారు. అదే 'లవర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. రిద్ధి కుమార్ కథానాయికగా పరిచయం అవుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జూన్ 14న విడుదల చేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. "ప్రేమలోని కొత్త కోణాల్ని చూపించే చిత్రమిది. నటీనటులు, సాంకేతిక నిపుణులు చక్కగా కుదిరారా"ని నిర్మాత తెలిపారు. ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి, కూర్పు: ప్రవీణ్ పూడి

పరిష్కారం లభించేవరకు ప్రదర్శనల నిలిపివేత

"డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న ఛార్జీలకి... ఆ కంపెనీల గుత్తాధిపత్యానికి నిరసనగా తలపెట్టిన సినిమా ప్రదర్శనల నిలిపివేతపై దక్షిణాదికి చెందిన ఐదు రాష్ట్రాల చిత్ర పరిశ్రమలూ ఒకే తాటిపై ఉన్నాయి. ఛార్జీలు తగ్గించే వరకు మా పోరాటం ఆగదు. ఈ విషయంలో ప్రేక్షకులు కూడా సహకరించాలి" అన్నారు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యదర్శి ముత్యాల రాందాస్, డిజిటల్ కమిటీ ఛైర్మన్ కె.ఎల్.దామోదర్‌ప్రసాద్. చిత్ర ప్రదర్శన డిజిటలైజ్ అయిన తర్వాత కొన్ని ప్రైవేటు కంపెనీలు సినిమా థియేటర్లలో ప్రదర్శనకి సంబంధించిన డిజిటల్ సామాగ్రిని సొంతంగా ఏర్పాటు చేసి, ఆ తర్వాత వర్చువల్ ప్రింట్ ఫీజు (వి.పి.ఎఫ్), సర్వీసు ఫీజు పేరుతో ఛార్జీలు వసూలు చేసుకొనేలా ఒప్పందం కుదుర్చుకొన్నాయి. అయితే ఆ ఛార్జీలు అధిక మొత్తంలో ఉండటంతో నిర్మాతలకి, పంపిణీదారులకి తలకి మించిన భారంగా మారాయని, పైగా అలా ఐదేళ్లకి మించి వి.పి.ఎఫ్ వసూలు చేయడం సరైంది కాదని ఆరోపిస్తున్నారు నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులు. ఈ విషయంపై దక్షిణాదికి చెందిన ఐదు రాష్ట్రాల చిత్ర పరిశ్రమలు కలిసి డి.సురేష్‌బాబు అధ్యక్షుడిగా, జెమినీ కిరణ్ కన్వీనర్‌గా దక్షిణ భారత చలన చిత్ర ఐక్య కార్యాచరణ సమితిని ఏర్పాటు చేసుకొన్నాయి. డిజిటల్ కంపెనీలతో పలు దఫాలుగా చర్చలు జరిపాయి. ఆ చర్చలు విఫలం కావడంతో ఈ నెల 2 నుంచి డిజిటల్ కంపెనీలకి సినిమాలు ఇవ్వకుండా, ప్రదర్శనలు నిలిపివేయాలని నిర్ణయించింది ఐక్య కార్యాచరణ సమితి. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. "వి.పి.ఎఫ్ ఛార్జీలు క్రమంగా ఎత్తివేయాలని, విరామం సమయంలో ప్రదర్శించే రెండు ప్రకటనల్ని సినిమా పరిశ్రమకి ఇవ్వాలని, వాణిజ్య ప్రకటనలు 8 నిమిషాల కంటే ఎక్కువగా ప్రదర్శించకూడదనే డిమాండ్లని డిజిటల్ కంపెనీల ముందుంచాం. కానీ ఆ కంపెనీలు ససేమిరా అంటున్నాయి. క్యూబ్ సంస్థ ప్రతినిధి అయితే చర్చల్లో వ్యంగ్యంగా మాట్లాడుతూ వెళ్లిపోయాడు. చిత్ర పరిశ్రమపై ఆధారపడి బతికే వ్యక్తులే అలా మాట్లాడటం సంస్కారమా? అందుకే ఈ విషయంపై ఉపేక్షించకూడదని చిత్ర పరిశ్రమలన్నీ నిర్ణయం తీసుకొన్నాయి. ప్రదర్శనల నిలిపివేత వల్ల సమస్యలు ఎదురైనా సరే, పూర్తిగా సహకరిస్తామంటూ పంపిణీదారులు, ప్రదర్శనకారులు, నిర్మాతలు ముక్తకంఠంతో ముందుకొస్తున్నారు. ఛార్జీలు తగ్గించకపోగా, కొత్త కంపెనీల్ని రానివ్వకుండా, వాళ్లని గందరగోళానికి గురిచేస్తూ క్యూబ్, యు.ఎఫ్.ఓ సంస్థలు గుత్తాధిపత్యం వహిస్తున్నాయి. ఈ సమస్యకి పరిష్కారం లభించేవరకు కలిసి పోరాటం చేద్దామని అన్ని రాష్ట్రాల చిత్ర పరిశ్రమలూ మార్చి 2 నుంచి ప్రదర్శనల్ని నిలిపివేస్తున్నాయ"ని ముత్యాల రాందాస్, కె.ఎల్ దామోదర్‌ప్రసాద్ తెలిపారు.


ముత్యాల రాందాస్, కె.ఎల్.దామోదర్‌ప్రసాద్

త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తాం: మంత్రి తలసాని

డిజిటల్ ఛార్జీల వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ ఛైర్మన్ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో దక్షిణభారత, తెలుగు, తెలంగాణ ఫిలిం ఛాంబర్ల ప్రతినిధులు మురళీమోహన్, సి.కళ్యాణ్, జెమినీకిరణ్, దామోదర్ ప్రసాద్‌లు మంత్రిని సచివాలయంలో కలిశారు. క్యూబ్/యూఎఫ్‌వో సంస్థలు డిజిటల్ సేవల ఛార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం నుంచి దక్షిణభారత దేశంలో సినిమాల ప్రదర్శనను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. తెలుగు, హిందీ సినిమాల పట్ల ఒక విధంగా, హాలీవుడ్ సినిమాల పట్ల మరో విధంగా క్యూబ్ సంస్థ వ్యవహరిస్తోందని వారు మంత్రికి ఫిర్యాదు చేశారు. మంత్రి మాట్లాడుతూ, సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలోనే క్యూబ్ ఆపరేటర్లు, సినీ పరిశ్రమ వర్గాలతోనూ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అభినయ సౌందర్యానికి అశ్రునివాళి




వెంకటేష్


ఐశ్వర్యరాయ్


చిరంజీవి


జయాబచ్చన్


రేఖ


హేమమాలిని, ఇషాడియోల్

అతిలోక సుందరి శ్రీదేవి అంతిమయాత్రలో పాల్గొనేందుకు తారాలోకం తరలివచ్చింది. బరువెక్కిన హృదయాలతో... కన్నీటి సుడులు తిరిగే కళ్లతో సన్నిహితురాలైన శ్రీదేవికి తుది వీడ్కోలు పలికింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకొన్న ఆమెకి భారతదేశంలోని అన్ని చిత్ర పరిశ్రమలతోనూ ప్రత్యేకమైన అనుబంధం ఉంది. దాంతో భాషతో సంబంధం లేకుండా సినీ ప్రముఖులు శ్రీదేవి అంతిమయాత్రకి హాజరై ఆమెకి నివాళులర్పించారు. తెలుగు చిత్రసీమ నీడలోనే ఎదిగి... తెలుగు ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసిన శ్రీదేవి కడసారి చూపుకోసం తెలుగు సినీ ప్రముఖులతో పాటు అభిమానులు కూడా తరలివెళ్లారు.


జయప్రద


కాజోల్, అజయ్‌దేవగణ్


టబు


దీపికా పదుకొణె, సిద్ధార్థ్ మల్హోత్రా


సోనమ్‌కపూర్


సుస్మితాసేన్

రహస్య 'గూఢచారి'

అడవిశేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. శోభిత ధూళిపాళ్ల కథానాయిక. అభిషేక్ నామా, టిజి విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. శశికిరణ్ తిక్క దర్శకుడు. ప్రస్తుతం అమెరికాలో చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాతలు మాట్లాడుతూ "దిల్లీ, పూణె, హైదరాబాద్, కాకినాడ, రాజమండ్రిలలో ఇప్పటి వరకూ చిత్రీకరణ జరిపాం. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లోనూ కీలక సన్నివేశాలు తెరకెక్కించాం. ఇప్పుడు అమెరికాలో చిత్రీకరణ జరుగుతోంది. ఇటీవల విడుదలైన తొలి ప్రచార చిత్రానికి మంచి స్పందన వస్తోంది. సాంకేతికంగా ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాం. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: శ్రీచరణ్ పాకాల, మాటలు: అబ్బూరి రవి.


అడవిశేష్

అమ్మకోపానికి కారణం ఉంది...



ఒక చిన్న అబ్బాయి అమ్మ పర్సులో నుంచి పది రూపాయలు దొంగిలిస్తాడు. ఆ అబ్బాయి తల్లికి తెలుసు... కఠినంగా శిక్షించక పోతే ఆ అలవాటు అంతటితో ఆగదని! భవిష్యత్తులో దీని ప్రభావం ఎలా ఉంటుందోనని! ఆ పిల్లాడికి అన్నం పెట్టకపోతే తప్పు తెలుసుకుంటాడనుకుంటుంది. అలాగే చేస్తుంది. కానీ, ఇంట్లో ఉన్న వాళ్లంతా ఆ చిన్న పొరపాటుకే పిల్లాడిని ఎందుకంత మందలిస్తున్నావంటూ ఆమెను తిడతారు. వారికి ఎలాంటి సమాధానం ఇవ్వదామె. అంతా నిశ్శబ్దం. అప్పుడు వినిపిస్తుంది.. ఒక పెద్దాయన కంఠం. 'కోడలు చేసిందాట్లో తప్పేమీ లేదు. నేను తన స్థానంలో ఉంటే కనీసం మూడు రోజులైనా అన్నం పెట్టకుండా ఉంచుతా' అని చెబుతూ...! తనను అర్థం చేసుకుని మద్దతిచ్చే వ్యక్తి ఉన్నందుకు వెంటనే ఆ తల్లి ముఖంలో చిరునవ్వు...! ఇదంతా 'వెన్ యూ సీ ఏ మదర్ బీయింగ్ టఫ్... జస్ట్ స్టాండ్ బై హర్' అనే వీడియో సారాంశం. 'భవిష్యత్తు తరం బాగుండాలనే అమ్మ కఠినంగా ఉండాలి. ఆవిడకు మీ మద్దతివ్వండి' అని చెబుతూ రూపొందించారా వీడియో. ఆల్ అవుట్ ఇండియా రూపొందించిన ఈ వీడియోను కేవలం ఒక్క రోజులోనే ఫేస్‌బుక్ లింక్‌లో పదిహేను మిలియన్లకు పైగా చూశారు. మూడు లక్షలకు పైగా ఈ వీడియోను షేర్ చేశారు.

ఏ వంట వండాలబ్బా?

యూట్యూబ్‌లోనో, మ్యాగజైన్‌లోనో ఏదైనా వంటకం చూసి తయారుచేయాలనుకుంటే అందులో వాడే ఏదో ఒక పదార్థం మన దగ్గర లేక ఆగిపోవాల్సి వస్తుంది. అలా కాకుండా ఈ సారి 'కుక్‌బుక్' యాప్ ప్రయత్నించి చూడండి. మీ దగ్గర ఏయే పదార్థాలున్నాయో అందులో నమోదు చేస్తే వాటితో ఏ వంటకం చేయొచ్చో చెబుతుందా యాప్. కనీసం మూడు పదార్థాలున్నా కూడా వివిధ రకాల వంటలూ, వాటి తయారీ విధానాన్ని కూడా చూపిస్తుంది. దీంట్లో ఉన్న మరో అదనపు సౌకర్యం 'రెసిపీ స్కానింగ్'. ఏదైనా పుస్తకంలో వంటకం చూసినప్పుడు దాన్ని ఈ యాప్ ద్వారా స్కాన్ చేస్తే అందులో ఉన్న పదార్థాలూ, తయారీ విధానం వివరిస్తుంది. దాన్ని ఒక మెసేజీ రూపంలోకి మారుస్తుంది. అంతేకాక... మనం ఎంత మందికి వంట చేయాలనుకుంటున్నామో చెప్తే దానికి తగ్గట్లుగానే కావల్సిన పదార్థాల కొలతలు కూడా దీనిద్వారా తెలుసుకోవచ్చు.



సహజ రంగులతో ఆడేస్తున్నారు!

రంగుల పండగ అంటే పిల్లలే కాదు, అమ్మాయిలూ సరదాగా ఆడేస్తారు. కానీ ఈ అమ్మాయిలు ఆడటంతోనే ఆగిపోవడంలేదు. ఎలాంటి హాని కలగని సహజరంగుల్ని తయారు చేస్తున్నారు. వాళ్లే ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు. నారింజా, నీలం, ఆకుపచ్చా, పసుపూ, గులాబీ.. ఇలా ఐదురకాల రంగుల్ని మోదుగ పూలూ, బంతిపూలూ, మొక్కజొన్న పిండీ, పండ్లతో తయారుచేయడం వారి ప్రత్యేకత. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆ విశ్వవిద్యాలయం ప్రాంగణం ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత రంగుల తయారీ కేంద్రం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఆర్. గీతారెడ్డి నేతృత్వంలో మహిళా శాస్త్రవేత్తల పర్యవేక్షణలో విద్యార్థినులు వీటిని తయారు చేస్తున్నారు. ఆ అమ్మాయిలంతా బీఎస్సీ అగ్రికల్చర్ హోం సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. పూలూ, కూరగాయలతో ప్రకృతిలో లభించే బంతి పూలూ, మోదుగ పూలూ, నీలి ఆకులూ, బీట్ రూట్, ఇతర కూరగాయలూ, మొక్కజొన్న పిండీ, పసుపుతో మాత్రమే సహజ వర్ణాల్లో రంగులు తయారు చేస్తుండటం ప్రత్యేకత. ఇలా సహజ సిద్ధమైన రంగులు చల్లుకుంటే పిల్లలకే కాదు పెద్దలకూ సురక్షితం. చర్మంపై దద్దుర్లు, కళ్ల మంటలూ, శ్వాస సంబంధ సమస్యలు రావు. తరువాత కడిగేయడమూ సులువే. శరీరానికి ఏ మాత్రం అంటదు. పైగా తక్కువ ధరల్లో లభించడం వీటి ప్రత్యేకత. వీటిని సైఫాబాద్ గృహ విజ్ఞాన శాస్త్రం కళాశాలతోపాటు గచ్చిబౌలీ, లోయర్ ట్యాంక్ బండ్ ఇలా వివిధప్రాంతాల్లో అమ్ముతున్నారు.



రంగస్థలం కోసం ఊళ్లన్నీ తిరిగా..

'అ!' సినిమాకు ఎన్ని మార్కులు పడ్డాయో నటీనటుల ఆహార్యానికీ అన్నే మార్కులు వచ్చాయి. ఏ రెండు పాత్రలూ ఒకేలా ఉండవందులో. రెజీనాను ఊహకందనట్లుగా, కాజల్‌ను కాస్త భిన్నంగా, అవసరాల శ్రీనివాస్‌ను ఆసక్తికరంగా... తీర్చిదిద్దిన ఆ ఘనత కాస్ట్యూమ్ డిజైనర్ కృష్ణశాంతిది! ఇప్పుడు రంగస్థలం సినిమాకూ పనిచేస్తున్న ఆమె ఆ అవకాశాల్ని ఎలా అందుకుందీ... డిజైన్ల విషయంలో కష్టపడిన వైనాన్ని వసుంధరకు వివరించిందిలా...





లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు దానికోసం ఎంత కష్టమైనా పడే తత్వం నాది. దానికోసం అందుబాటులో ఉన్న అన్ని మార్గాలూ వినియోగించుకుంటా. వంద శాతం ప్రయత్నిస్తా. అదే నన్ను చదువు పూర్తవ్వకుండానే డిజైనింగ్‌వైపు అడుగులు వేసేలా చేసింది. మాది హైదరాబాద్. చిన్నప్పటి నుంచీ నాకు బొమ్మలు గీయడం అంటే ఇష్టం. సెకెండ్‌క్లాస్‌కొచ్చేసరికి డిజిటల్ ఆర్ట్, ఆయిల్ పెయింటింగ్ వేసేదాన్ని. ఎప్పటికైనా ఆర్టిస్ట్ అవ్వాలనుకున్నా. కానీ ఫ్యాషన్ డిజైనర్ అవుతాననుకోలేదు. అనుకోకుండానే ఇటువైపు వచ్చా. పెరిగేకొద్దీ డిజైనింగ్‌పై ఇష్టం పెరిగింది. అందుకే ఇంటరయ్యాక ఇంకేం ఆలోచించకుండా నిఫ్ట్‌లో చేరా.

ఎంపికవుతాననుకోలేదు...

చిన్నప్పటి నుంచీ సినిమాలు బాగా చూసేదాన్ని. సినిమాల్లోకి వస్తాననీ, రావాలనీ అనుకోలేదు. కానీ నిఫ్ట్‌లో చివరిఏడాది చదువతున్నప్పుడు రామ్‌గోపాల్‌వర్మ 'కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం... అప్పల్రాజు' సినిమాకోసం ఓ డిజైనర్‌ని వెతుకుతున్నారని తెలిసింది. కాస్ట్యూమ్‌డిజైనింగ్‌పై అవగాహన లేకపోయినా వెళ్లి ఆయనతో మాట్లాడా. నా ఐడియాలు చెప్పడం, ఆయనకు నచ్చడంతో ఆ సినిమాకు పూర్తిస్థాయిలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశా. అలా ఎనిమిదేళ్లుగా సినిమానే నా ప్రపంచం అయిపోయింది. పదుల సంఖ్యలో సినిమాలు చేశాను. ఇప్పటికీ నా చేతిలో మరికొన్ని సినిమాలు ఉన్నాయి. మూవీ స్క్రిప్ట్ కళ్లతో ఆకట్టుకోవాలి. అందుకే ప్రతి సినిమాలోనూ క్యాస్ట్యూమ్ డిజైనర్ పని కీలకం. అందుకే ముందు ఆ పాత్రను అర్థం చేసుకుంటాను. ఆ తరువాత వాటిని స్కెచ్‌లుగా వేసుకుంటాను. బహుశా అదే నాకు గుర్తింపు తెచ్చిందేమో. రాబోతున్న రంగస్థలం, మొన్న వచ్చిన 'అ'తోపాటూ 'ఊ కొడతారా ఉలిక్కి పడతారా', ''మిస్టర్ నూకయ్య', 'రొటీన్ లవ్‌స్టోరీ', 'ఎటాక్', 'వంగవీటి' వంటి సినిమాలకు పనిచేయగలిగాను.

ఎన్నో సేకరించా...

'వంగవీటి' సినిమాలో నా డిజైన్లు నచ్చడంతో డైరెక్టర్ సుకుమార్ నుంచి ఫోన్ వచ్చింది. అలా 'రంగస్థలం'కు పనిచేసే అవకాశం అందుకున్నా. రామచరణ్‌కి వాళ్లక్క, సమంతకి వ్యక్తిగత డిజైనర్ ఉన్నా.. వాళ్లతోపాటూ ఇతర పాత్రలకూ నేను డిజైనింగ్ బాధ్యతలు చూస్తున్నా. నిజానికి ఈ సినిమా 1980ల నాటిది. ప్రతి పాత్రలో ఆ కళ ఉట్టిపడాలి. ఆయా పాత్రల విషయంలో నాకు ఓ స్పష్టత రావడంకోసం కొన్నినెలలు పరిశోధన చేశా. ముఖ్యంగా అప్పటి వారు ఎలాంటి దుస్తులు ఎంచుకునేవారు, అలంకరణ... వంటివన్నీ తెలుసుకోవడానికి రాజమండ్రీ, కాకినాడ వంటి ప్రాంతాల్లో తిరిగొచ్చా. ముఖ్యంగా అక్కడి ఫొటో స్టూడియోలకు వెళ్లి పాత ఫొటోలను సేకరించా. ఇలా సుమారు నాలుగువేల ఫొటోలు సేకరించా. అప్పటి వస్తువులూ, చీరలూ, గాజులూ, చెవిపోగులూ, ఉంగరాలు... ఇలా ఒకటేమిటి అన్ని నమూనాలనూ తీసుకున్నా. ముఖ్యంగా అప్పట్లో వాడే కళ్లద్దాలు చాలా ప్రత్యేకంగా ఉండేవి. అచ్చంగా వాటిని పోలి ఉండే వాటిని తయారు చేయించాలన్నా కష్టమే. అయినా చేయగలిగాం.

స్టూడియోని ఏర్పాటుచేశా...

సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేయడం అంటే మాటలేం కాదు. వారు చెప్పింది చెప్పినట్లు చేసుకెళ్లిపోవడం కాదు. పాత్ర, ఆ సందర్భాన్ని బట్టి చివరి నిమిషంలో మార్పులు చేయాల్సి రావచ్చు. నప్పే రంగులూ, వస్తువుల కోసం గల్లీగల్లీకి తిరిగినా కొన్నిసార్లు దొరకవు. వాటిని తయారు చేయించుకోవడమూ సవాలే. ఇక నాలుగైదు సినిమాలు చేశాక మధ్యలో ఓ ఏడాదిన్నర విరామం తీసుకున్నాను. అలాని అది విశ్రాంతి తీసుకోవడానికి కాదు. చదువు పూర్తవ్వకుండానే ఉపాధి వెతుక్కున్నాను. అప్పటివరకూ నాలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసే అవకాశం రాలేదు. అందుకే దుస్తుల డిజైనర్ స్టూడియోని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశా. మరో పక్క ఎన్‌ఆర్‌ఐలకూ, డబ్బులు ఉన్నా షాపింగ్ చేసే సమయంలేని వారికి పెళ్లివార్డ్‌రోబ్‌లు సిద్ధం చేయడం నా ప్రత్యేకత. అలా ఇప్పటి వరకూ సుమారు వందమందికి పైగా పర్సనల్‌షాపర్‌గా పనిచేశా. అది నాకు ఇంకాస్త అనుభవాన్నిచ్చింది.



'అ!' కాస్త కష్టపడ్డా...

ఇక నేను చేసిన సినిమాల్లో డిజైనర్‌గా కాస్త కష్టంగా అనిపించిన సినిమా 'అ'. ఇంతకముందే రెజీనానూ, కాజల్‌ను తెరమీద చాలా సార్లు చూశాం. కానీ ఈ సారి కాస్త విభిన్నంగా డిజైన్ చేయాలని నిశ్చయించుకున్నా. ఎందుకంటే అప్పటివరకూ వాళ్లకున్న లుక్‌కి భిన్నంగా ఆకట్టుకునేలా కనిపించేలా చేయాలి. అందుకోసం ప్రత్యేకంగా లుక్‌బుక్ తయారు చేసుకున్నా. ఈ సినిమాలో ఉన్న విభిన్న పాత్రలూ వాటి సున్నితత్వం అర్థంచేసుకుంటూ డిజైనింగ్ చేయాలనుకున్నా. అలా రెజీనా, కాజల్, ఈషారెబ్బా, నిత్యామీనన్, అవసరా శ్రీనివాస్‌లకు కాస్ట్యూమ్ డిజైనింగ్ చేశా. రెజీనాకు చేసిన స్టయిలింగ్ ముఖ్యంగా హెయిర్‌స్టయిల్ నాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. దర్శకుడి అభిరుచికి తగినట్లుగా తలపిన్ను నుంచి కాలికి పెట్టుకునే గోళ్లరంగువరకూ అన్నింటిమీదా ఆయా పాత్రను బట్టి ఎంచుకోవాలి. అవసరం అయితే ఆ నటీనటులనూ ఒప్పించాల్సి ఉంటుంది. 'అ' విషయంలో అదే చేశా. తెరపై తమను చూసుకున్నాక కాజల్, రెజీనా, రాజమౌళి వంటివారు ప్రత్యేకంగా నన్ను మెచ్చుకోవడం నాకో మంచి జ్ఞాపకం.

– స్వాతి కొరపాటి

వసుంధర వంటల పోటీ!



మీరు చక్కగా వంట చేయగలుగుతారా? నోరూరించే పదార్థాలను చకచకా చేయడంలో సమర్థులా... అయితే రానున్న మహిళా దినోత్సవం సందర్భంగా **'ఈనాడు - వసుంధర'** మీకు ఆహ్వానం పలుకుతోంది. తక్కువ నూనె, ఉప్పు వాడుతూ నోరూరించే పదార్థాలు మాకు చేసి పంపండి. చిరుతిళ్లు, అల్పాహారాలు, కూరలూ, జంక్‌ఫుడ్.. ఇలా ఏవయినా సరే మాకు పంపొచ్చు. మీరు చేయాల్సిందల్లా.. వంటను చేసి వీడియో తీసి, మాకు వాట్సాప్ చేయడం, ఆ పదార్థాల వివరాలను తెలియజేయడం. మీ వంటల

వీడియోలను పంపించాల్సిన చివరితేదీ.. 04.3.2018. ఇక, వీడియోలు పంపించాల్సిన వాట్సాప్ నంబరు 9121167517.

ఎలా పంపాలంటే..

- **మీ పేరు, ఫొటో, ఊరు వివరాలు.**
- **వంటకం పేరు..**
- **పదార్థం వీడియో!**

మొదటి ఐదుగురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ఇంకెందుకాలస్యం! ప్రయత్నించండి మరి.

నజరానా

చర్మం తాజాగా ఆరోగ్యంగా కనిపించాలంటే... పెద్ద చెంచాడు బొప్పాయి గుజ్జులో ఒకటిన్నర చెంచా ముల్తానీమట్టి వేసి బాగా కలిపి ముఖానికి రాసుకోవాలి. ఇది పూర్తిగా ఆరిపోయాక కడిగేస్తే చాలు.

వీరితో జాగ్రత్త...!

సహోద్యోగులతో సఖ్యతగా ఉండాలి. కానీ కొందరు ఎల్లప్పుడు పక్క వారిని ఏదో ఒకవిధంగా ఇబ్బందులకు గురిచేస్తుంటారు. వీరి వల్ల పనికీ ఆటంకమే. అలాంటివారితో కాస్త జాగ్రత్తగా ఉండాలంటే...

వాగుడుకాయలు: కొందరు సహోద్యోగులు సమావేశాల్లోనైనా, బృంద చర్చల్లోనైనా, నలుగురు కలిసి మాట్లాడుకుంటున్న చోట... ఇలా ఎక్కడైనా అదేపనిగా మాట్లాడుతూ ఉంటారు. విషయాన్ని పక్కదారి పట్టిస్తారు. అయితే చివరికొచ్చేసరికి వారి మాటల వల్ల ఒనగూరేది ఉండదు. కాబట్టి వారిని కాస్త దూరం పెట్టడం మంచిది.

ప్రతికూల వ్యక్తులు: వీరిలో ప్రతికూల భావాలు ఎక్కువ. మీరు చేసే ప్రతి పనిలో ప్రతికూల అంశాలను చూపించేందుకు ప్రయత్నిస్తారు. మీరూ ప్రతికూలంగా ఆలోచించేలా మిమ్మల్ని మార్చాలనుకుంటారు. పనిమీదా దృష్టిపెట్టలేరు. ఇలాంటి వ్యక్తులకు ఎక్కువగా మాట్లాడే అవకాశాన్ని ఇవ్వొద్దు.

వేధించే వ్యక్తులు: తమ వ్యక్తిగత సమస్యల్ని అదేపనిగా ఏకరువు పెడుతుంటారు. వీరి వల్ల సమయం వృథా అవుతుంది. పనిలో ఉత్పాదకతా తగ్గిపోతుందని మరవకూడదు.

వదంతులు మోసేవారు: ప్రతి ఆఫీస్‌లో గాసిప్స్ సహజమే. అయితే కొంతమంది వ్యాపింపజేసే వదంతులకు అడ్డూ అదుపూ ఉండదు. బాస్ దగ్గర నుంచి చివరకు క్యాంటిన్ శుభ్రం చేసే వ్యక్తిని కూడా వదలరు. వీరికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

email: vasundhara@eenadu.net

బంగారం-వెండి

28న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	31,450	31,600
ఆర్నమెంట్	29,370	29,510
వెండి (కిలో)	39,360	39,625
విజయవాడ		
బంగారం (24క్యా)	31,400	31,400
ఆర్నమెంట్	29,150	29,150
వెండి (కిలో)	39,700	39,700
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,400	31,500
ఆర్నమెంట్	29,050	29,160
వెండి (కిలో)	39,400	39,800
రాజమండ్రి		
బంగారం (24క్యా)	31,110	31,270
ఆర్నమెంట్	29,080	29,240
వెండి (కిలో)	38,800	39,000
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,160	31,400
ఆర్నమెంట్	28,980	29,200
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,908	2,924
వెండి (గ్రా)	41.30	41.70

(రూ. లలో)

పాయలతో వారధిలా...

సిగ సింగారం

చిన్నపిల్లలకు రకరకాల జడలు వేసి ముచ్చట తీర్చుకోవాలని అమ్మలకు ఉన్నా వాళ్లో పట్టాన మాట వినరు. అలాంటి వారికోసమే ఈ హెయిర్‌స్టయిల్. చాలా తక్కువ సమయంలోనే దీన్ని వేయొచ్చు. ఎలాగో చూసేయండి మరి.



1 పాపిటకి ఇరువైపులా సన్నటి పాయల్ని తీసుకుని జడల్లా అల్లుకుని చివర్ల రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.



2 ఆ జడల పక్కనుంచి రెండు పాయలను తీసుకోవాలి. వాటిని నడినెత్తిపైకి తీసుకొచ్చి రెండింటినీ కలిపి రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.



3 ఇప్పుడు పోనీటెయిల్‌ను రెండు పాయలుగా విడదీసుకోవాలి. ఎడమవైపున పాయను అదేవైపున ఉన్న జడకు కలుపుతూ చిన్న రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. అదేవిధంగా కుడివైపు కూడా చేసుకోవాలి.



4 ఆ జుట్టును మళ్లీ కలిపి రబ్బరుబ్యాండు పెట్టాలి. ఇప్పుడు మళ్లీ దాన్ని విడదీసి.. ఇందాకటిలానే ఇంకోవరుస పెట్టుకుని ఆఖరున ఆ రెండింటినీ కలిపి రబ్బరుబ్యాండు పెడితే చాలు.




కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

చదువు
వైవిధ్య

ఈనాడు కరీంనగర్ 10
గురువారం మార్చి 1, 2018 ■ e-mail: edc@eenadu.in

గణితం అనగానే కొంతమంది గడ గడ వణికిపోతే... ఇంకొందరు టకటకా స్టెప్పులేసుకుంటూ వెళ్లిపోతారు. ఇది ఒక సబ్జెక్టు మాత్రమే కాదు. విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించే వేదిక కూడా. ఇంజినీరింగ్, అకౌంటింగ్ మొదలు అంతరిక్షం వరకు గణితం అన్ని రంగాల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. బోధన, పరిశోధనలతోపాటు ఎన్నో రకాల ఉద్యోగాలకు ఈ నిపుణుల అవసరం ఉంది. అందుకే గణితానికి సంబంధించి కొన్ని సంస్థలు అందిస్తున్న ప్రత్యేక కోర్సులతోపాటు ఉన్నతమైన ఉద్యోగాల గురించి తెలుసుకుందాం.



కెరియర్ గైడెన్స్

లెక్కలంటే.. మక్కువుంటే!

గణితం అంటే కొంచెం భయంగా.. చాలా గౌరవంగా అనిపిస్తుంది. నూటికి నూరు మార్కులు తెచ్చుకోడానికి వీలున్న విభాగాల్లో ఎందరికో ఇష్టమైన సబ్జెక్టు ఇది. లెక్కలపై మక్కువ ఎక్కువగా ఉంటే, వాటినే జీవితంగా గడపడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఉన్నత విద్యపరంగా చూస్తే ఎన్నో ప్రఖ్యాత సంస్థలు రకరకాల కోర్సులను అందిస్తున్నాయి. ఉపాధిని పరిశీలిస్తే బోధన, పరిశోధన రంగాల్లో పలు కొలువులు ఆహ్వానం పలుకుతున్నాయి. మ్యాథ్స్‌పై శ్రద్ధ, ఆసక్తి ఉంటే మొదటగా గుర్తుకొచ్చేది ఇంజినీరింగ్. అది వాస్తవమే. గణితంపై పట్టు వల్ల కచ్చితంగా ఇంజినీరింగ్‌లో ఉన్నత స్థానాన్ని చేరుకోవచ్చు. అప్లైడ్ మ్యాథమేటిక్స్ వంటి స్పెషలైజేషన్లతో ఉన్నత విద్యను, ఉపాధి మార్గాన్ని ఎంచుకుంటే లెక్కలే సర్వస్వంగా జీవనాన్ని సాగించవచ్చు.

ప్రత్యేక సంస్థలు

ఆర్యభట్ట నుంచి రామానుజన్ వరకు ఎందరో మహానుభావులు భారతదేశ గణిత చరిత్రకి పునాదులు వేశారు. ఆధునిక కాలంలోనూ కేవలం గణితం కోసం ప్రత్యేకమైన సంస్థలు ఏర్పాటయ్యాయి. మ్యాథమేటిక్స్‌లో ఈ కింది సంస్థలు ప్రత్యేక గుర్తింపుతో ప్రపంచ పటంలో తమకంటూ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఆయా సంస్థల్లోకి ప్రవేశాల వివరాలను సంబంధిత వెబ్ సైట్‌ల్లో చూడవచ్చు.



- చెన్నై మ్యాథమేటికల్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై www. cmi.ac.in
- ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమేటికల్ సైన్సెస్, చెన్నై www.imsc.res.in
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్, www.tifr.res.in
- హరీశ్ చంద్ర రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, www.hri.res.in
- సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ www.crraoaimscs.org

ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త సీఆర్ రావు పేరుతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. ఈ సంస్థలోని కింది విభాగాలు ఉత్తమమైన పరిశోధనా విద్యకి, మేధోపరమైన ఉపాధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో మార్గాలు చూపిస్తున్నాయి.

- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మ్యాథమేటికల్ సైన్సెస్
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ స్టాటిస్టిక్స్
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్రిప్టోగ్రఫీ
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ కంప్యూటేషనల్ జెనోమిక్స్

మ్యాథమేటిక్స్ రంగంలో రిసెర్చ్ సైంటిస్ట్, రిసెర్చ్ అసోసియేట్స్, సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ వంటి పేర్లతో కెరియర్ ప్రారంభానికి కావాల్సిన ప్రోత్సాహాన్ని సీఆర్ రావు ఇన్‌స్టిట్యూట్ అందిస్తోంది. దీంతోపాటు ఏటా స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్‌లను నిర్వహించి హైస్కూల్ స్థాయిలో విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలుగులోకి తీసుకొస్తోంది.

వివిధ సంస్థల్లో విభిన్న కోర్సులు

సాధారణంగా మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, అప్లైడ్ మ్యాథ్స్ తదితరాల్లో బీఎస్సీ కోర్సులను; మాస్టర్స్ స్థాయిలో రకరకాల స్పెషలైజేషన్లతో ఎమ్మెస్సీని మన దేశంలోని దాదాపు అన్ని యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలలు అందిస్తున్నాయి. వీటితోపాటు దేశంలో ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎస్సీల్లోని మ్యాథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌ల్లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లోకి జామ్ (జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ) ర్యాంకుతో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీలో మ్యాథమేటిక్స్ చదివితే జామ్ రాయడానికి అర్హత లభిస్తుంది. మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ పేపర్లతో ఎమ్మెస్సీ పూర్తి చేస్తే వినూత్న రంగాలకు సంబంధించిన ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ఆపరేషన్స్ రిసెర్చ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఓషన్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్స్, అప్లైడ్ స్టాటిస్టిక్స్ విభాగాల్లో ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ చేయవచ్చు. జామ్ ద్వారా భువనేశ్వర్, బాంబే, దిల్లీ, ధన్‌బాద్, గాంధీనగర్, గువాహటి, హైదరాబాద్, ఇండోర్, జోద్‌పూర్, కాన్పూర్, రోపర్, పట్నా, రూర్కీల్లోని ఐఐటీల్లోకి ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ అడ్మిషన్లు లభిస్తున్నాయి. ఈ కోర్సులు పరిశోధన రంగంలో మంచి ఉద్యోగాలకు మార్గం చూపిస్తాయి.



రవి కటుకం
ఇన్నోవేషన్ ఇవాంజిలిస్ట్

భారత ప్రభుత్వం ఉన్నతశ్రేణి సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ కోసం ఐఐఎస్ఈఆర్‌లను బరంపురం, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతిల్లో ఏర్పాటు చేసింది. వీటి ద్వారా అయిదు సంవత్సరాల బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌ని అందిస్తోంది. ప్రస్తుతం ఐఐఎస్ఈఆర్-2018 నోటిఫికేషన్ విడుదలైంది.

పరిశోధనలో!

మ్యాథమేటిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన వారికి ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలైన ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో), సొసైటీ ఫర్ ఎలక్ట్రానిక్ ట్రాన్సాక్షన్స్ అండ్ సెక్యూరిటీ (ఎస్ఈటీఎస్) ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి.

ఐబీఎం, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు మ్యాథమేటిక్స్‌లో ప్రావీణ్యం సాధించినవారికి థియరిటికల్ కంప్యుటేషన్ పేరుతో పరిశోధనా విభాగంలో ఎక్కువ వేతనంతో కూడిన ఆకర్షణీయ ఉద్యోగాలను ఇస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రిసెర్చ్ బోర్డ్ ఆయా రంగాల్లో పరిశోధనకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని రామానుజన్ ఫెలోషిప్‌ల పేరుతో అందిస్తోంది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో

ఉపాధికి సంబంధించి పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మొదలు యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకు ఉన్నాయి.

మ్యాథమేటిక్స్‌కి సంబంధించి ముఖ్యంగా స్టాటిస్టిక్స్‌లో దేశవ్యాప్తంగా ప్రామాణికమైన ఉద్యోగం జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (జేఎస్ఓ). ఇది స్టాటిస్టిక్స్ రంగంలోకి ప్రవేశ ద్వారం లాంటిది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష ద్వారా మూడంచెల విధానంలో ఈ పోస్టులను భర్తీ చేస్తోంది. సాధారణంగా ఏప్రిల్‌లో ఈ పరీక్ష నోటిఫికేషన్ విడుదలవుతుంది. పూర్తి వివరాలకు www.ssc.nic.in చూడవచ్చు.

జేఎస్ఓగా ఎంపికైన అభ్యర్థులు సబార్డినేట్ స్టాటిస్టికల్ సర్వీస్ (ఎస్ఎస్ఎస్) కేడర్‌లో మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్‌లో భాగంగా పని చేస్తారు. వీరు డేటా కలెక్షన్, డేటా ప్రాసెసింగ్ లాంటి కార్యక్రమాల్లో అంకగణిత పరంగా ప్రభుత్వ ప్రణాళికలకు సాయపడతారు.

■ ఎన్నో ఉద్యోగాలు.. మరెన్నో కోర్సులు

జేఎస్ఓల పదోన్నతి ఈ కింది విధంగా ఉంటుంది.

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ➛ సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ➛ అసిస్టెంట్ డైరెక్టర్ ➛ డిప్యూటీ డైరెక్టర్ ➛ జాయింట్ డైరెక్టర్ ➛ డైరెక్టర్ ➛ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ➛ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ➛ డైరెక్టర్ జనరల్

స్టాటిస్టిక్స్ రంగంలో ఉద్యోగాలు అందజేసే మరో ముఖ్య సంస్థ ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (www.iasri.res.in). ఇది ఎలాంటి ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇస్తుందో తెలుసుకోడానికి వెబ్‌సైట్‌ను చూడవచ్చు.

రాష్ట్రస్థాయిలో కూడా అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వస్తాయి. ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు భర్తీని నిర్వహిస్తాయి.

స్టాటిస్టిక్స్‌లో బీఎస్సీ లేదా ఎమ్మెస్సీ లేదా పీహెచ్‌డీ చేసినవారు ప్రైవేటు రంగంలో ఈ కింది టూల్స్/టెక్నాలజీలు నేర్చుకోవడం ద్వారా కార్పొరేట్ రంగంలో అధిక వేతనాలు పొందవచ్చు.

- ఆర్ ప్రోగ్రామింగ్ టూల్
- ఎస్ఏఎస్
- ఎస్‌పీఎస్ఎస్
- మినిట్యాబ్
- ఎక్సెల్ అనలిటిక్స్
- మ్యాట్‌లాబ్
- స్టాటా

స్టాటిస్టిక్స్‌లో పట్టుతో పాటు కొన్ని ప్రోగ్రామింగ్ లాంగ్వేజస్‌లో నైపుణ్యాన్ని సంపాదిస్తే దాదాపు అన్ని ఫైనాన్స్, ఇన్స్యూరెన్స్, బ్యాంకింగ్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

మ్యాథ్స్‌లో పీజీ ఉంటే ఐఐటీ, ఎంసెట్, క్యాట్, శాట్, జీమ్యాట్ తదితర ఎన్నో రకాల పరీక్షార్థులకు గణితం బోధించవచ్చు. పీహెచ్‌డీ చేసిన వారు ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రొఫెసర్ ఉద్యోగాల్లో చేరవచ్చు. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, బ్యాంక్‌లు మొదలైన పోటీ పరీక్షల్లోనూ గణితం కీలకమైన విభాగం. ఆ అభ్యర్థులకూ శిక్షణ ఇవ్వవచ్చు.

టెక్నాలజీ అభివృద్ధిలో ప్రధాన పాత్ర గణిత నిపుణులదే అని చెప్పవచ్చు. రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ చదివిన వారికి డిమాండ్ ఉంది. ఆపరేషన్స్ రిసెర్చ్ అనలిస్ట్, సిస్టమ్ అనలిస్ట్ తదితర సాఫ్ట్‌వేర్ కొలువులు, డేటా సైంటిస్టులు వంటి ఉన్నతమైన ఉద్యోగాలూ మ్యాథ్స్ మేధావులకు స్వాగతం పలుకుతున్నాయి.

పునశ్చరణే విజయ సూత్రం

సీఎంఏ టాప్ ర్యాంకర్ పూజిత



'పాసైతే చాలు' అనుకుందా విద్యార్థిని. కానీ క్రమపద్ధతిలో పట్టుదలగా కృషి చేసింది. ఫలితంగా టాప్ ర్యాంకును కైవసం చేసుకుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన పూజిత ఇటీవల విడుదలైన సీఎంఏ (ఐసీడబ్ల్యూఏ) ఫైనల్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. భీమవరం ప్రాంతానికి చెందిన ఈమె సీఏ, సీఎంఏ.. ఈ రెండు కోర్సులనూ ఏకకాలంలో అభ్యసించటం విశేషం. తన విజయ రహస్యాలను ఆమె ఇలా పంచుకున్నారు.

పేరు: **గణపతినీడి పూజిత**
ఊరు: రాయకుదురు (భీమవరం)
పదో తరగతి: 568 మార్కులు **ఇంటర్:** 981 మార్కులు
సీఏ సీపీటీ: 180 మార్కులతో అఖిల భారత స్థాయిలో పదో ర్యాంకు
సీఎంఏ ఫైనల్: ఆల్‌ఇండియా ఒకటో ర్యాంకు

మాది భీమవరానికి సమీపంలోని రాయకుదురు గ్రామం. నాన్న మురళీధర్ సాధారణ రైతు. మా ఊరిలోనే వ్యవసాయం చేస్తుంటారు. పదోతరగతి చదువుతున్నప్పుడే సీఏ/ సీఎంఏ కోర్సులపై ఆసక్తి ఏర్పడింది. భీమవరంలోని విశ్వకవి పాఠశాలలో చదివాను. పదోతరగతిలో 568 మార్కులు సాధించాను. అందరూ నన్ను ఇంజినీరింగ్/ ఐఐటీ లేదా మెడిసిన్ చదవమని సలహాలు ఇచ్చారు. కానీ నాకు కామర్స్ కోర్సులైన సీఏ/ సీఎంఏలే చదవాలని ఉండేది. సీఏ చదవాలంటే ఇంటర్‌లో ఎంఈసీనే మేలని అప్పుడు నాకు తెలియదు. అందుకే ఎంపీసీ తీసుకుని చదివాను. ఇంటర్‌లో 981 మార్కులు సాధించాను. అప్పటికే సీఏ చదవాలనే పట్టుదలతో ఉన్నాను.

సీపీటీలో పదో ర్యాంకు

అందరూ తీసుకునే రొటీన్ కోర్సులను చదవకూడదనే సీఏ కోర్సును ఎంచుకొని 'మాస్టర్ మైండ్స్' సంస్థలో చేరాను. సీఏ-సీపీటీ కష్టంగా ఉంటుందేమోనని మొదట్లో కొంచెం భయపడ్డాను. కానీ నాకు కోర్సు ఏ రోజూ కష్టం అనిపించలేదు. సీపీటీలో మొదటి ప్రయత్నంలోనే 200 మార్కులకు 180 తెచ్చుకోవడమే కాకుండా ఆల్ ఇండియా పదో ర్యాంకును సాధించాను.

సీపీటీతోపాటు సీఎంఏ ఫౌండేషన్ కూడా చేశాను. ఆ తరువాత ఐపీసీసీ, సీఎంఏ ఇంటర్ రెండు కోర్సులూ మొదటి ప్రయత్నంలోనే కంప్లీట్ అయ్యాయి. ఇప్పుడు సీఎంఏ ఫైనల్ కూడా మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయడంతోపాటు అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు కూడా పొందాను.

ఈ విజయం మా అమ్మానాన్నల కష్టానికి ప్రతిఫలం అనిపించింది. ఎందుకంటే అమ్మానాన్నలు నేనూ, చెల్లి ఎక్కడ చదువుతుంటే అదే ఊరికి వచ్చి మాతోపాటు ఉండి మమ్మల్ని ప్రోత్సహించేవారు. ఇప్పుడు బంధువులు, తెలిసినవాళ్లు అభినందిస్తుంటే అమ్మానాన్నల ఆనందానికి అవధుల్లేవు.

సీఏలో అడ్వాంటేజి

బీటెక్‌లో అయితే కుదరదు గానీ.. సీఏతోపాటు మరో కోర్సు కూడా చదువుకోవచ్చు. అందుకనే నేను సీఎంఏ కోర్సును ఎంచుకున్నాను. కొంతమంది విద్యార్థులైతే సీఏతోపాటు బీకాం కూడా చదువుతుంటారు. ఇది కూడా మంచి ఆప్షనే! ఒకవేళ ఏ కారణం చేతనైనా సీఏ కోర్సులో అనుకున్నంత ప్రతిభ చూపలేక పాస్ అవ్వకపోతే బీకాం పూర్తి చేసుకోవచ్చు. మంచి బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ పూర్తి చేసుకుని జీవితంలో స్థిరపడవచ్చు. ప్రస్తుతం నేను సీఏ ఫైనల్‌కు సిద్ధమవుతున్నా.

అడ్డంకులకు బెదరకూడదు

ఏదైనా సాధించాలని లక్ష్యం పెట్టుకున్నపుడు ఏవైనా అవరోధాలు ఎదురైతే నిరాశా నిస్పృహలకు గురికాకూడదు. లక్ష్య సాధనకు కావాల్సినంత కష్టపడుతూనే ఉండాలి. సీఏ/ సీఎంఏ లక్ష్యంగా పెట్టుకున్న తరువాత మధ్యలో నాకూ చాలా అవాంతరాలు వచ్చాయి. కానీ పట్టుదలతో లక్ష్యం దిశగానే ముందుకు సాగాను. .

సీఎంఏ చదవాలనుకునేవారు ముందుగా సీఏ కోర్సుకి కోచింగ్ తీసుకుని ఉంటే సీఎంఏ చాలా సులభంగా పూర్తిచేయవచ్చనేది నా అభిప్రాయం.

పూర్వ ప్రశ్నల విశ్లేషణ

స్కానర్ (ఇంతకుముందు పరీక్ష పత్రాలు)ను విశ్లేషించుకోవడానికి తగిన సమయాన్ని కేటాయించాలి. ఆర్‌టీపీ (రివిజన్ టెస్ట్ పేపర్)-2 అటెంప్ట్స్, ఎంటీపీఎస్ (మోడల్ టెస్ట్ పేపర్స్), పీటీపీఎస్ (ప్రాక్టీస్ టెస్ట్ పేపర్స్)ను తప్పకుండా సాధన చేసుకోవాలి. కచ్చితంగా ఇలా చేస్తే కనీసం 60% మార్కులు పొందవచ్చు. వీటిని ఇన్‌స్టిట్యూట్ వెబ్‌సైట్ www.icmai.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీఏ, సీఎంఏ కోర్సులు చదివే ప్రతి విద్యార్థి తప్పకుండా రివిజన్ పరీక్షలకు హాజరు కావాలి. సీఏ విద్యాసంస్థలు ఇప్పుడు ప్రత్యేకమైన రివిజన్ బ్యాచ్‌లను నిర్వహిస్తున్నాయి. పునశ్చరణ లేకుండా ఇలాంటి కోర్సుల్లో విజయం సాధించడం దాదాపుగా అసంభవమే. నా విజయానికి కారణం ఉత్తమ శిక్షణతోపాటు రివిజన్ పరీక్షలకు హాజరుకావడమే. తరగతిలో వినడం ఎంత ముఖ్యమో పద్ధతి ప్రకారం పునశ్చరణ చేసుకోవడమూ అంతకన్నా ముఖ్యం. సన్నద్ధత సమయంలో తప్పకుండా ప్రతి అంశానికీ ప్రాముఖ్యమివ్వాలి. అన్ని అంశాల పునశ్చరణా సరిగా చేయగలిగారో లేదో చూసుకోవాలి.

సీఎంఏ ఫైనల్ కేవలం పాస్ అవుతానను కున్న నేను క్రమపద్ధతిలో సాగించిన పునశ్చరణ వల్లే ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌గా మారాను. వీలైనంత త్వరగా సీఏ ఫైనల్ కూడా పూర్తిచేసి మంచి కార్పొరేట్ ఉద్యోగంతో స్థిరపడాలనేది నా లక్ష్యం.

వెయిటేజి గమనించి ప్రణాళిక

సీఎంఏ పరీక్షలకు సన్నద్ధమయ్యేటపుడు ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు, ఏయే అంశాలను ఎక్కువగా కవర్ చేస్తున్నారనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

వెయిటేజీని గమనించి సన్నద్ధమవ్వాలి. సిలబస్‌లోని అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రతి చాప్టర్ మొదటి పేజీల్లో ఈ వెయిటేజీ తాలూకు వివరాలున్నాయి. సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ వారు ప్రశ్నపత్రాన్ని రూపొందించేటప్పుడు కచ్చితంగా ఈ వెయిటేజీని అనుసరిస్తారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఈ సందర్భంగా వెయిటేజీని పరిగణనలోకి తీసుకోవాలి.

ఇంతకు పూర్వంలా ప్రతి పేపర్‌లోనూ అంశాలవారీగా కాకుండా సెక్షన్లవారీగా వెయిటేజీ ఇచ్చారు. విద్యార్థి ఎట్టి పరిస్థితుల్లోనూ సెలక్టివ్‌గా అధ్యయనం చేయకూడదు. అన్ని అంశాలపై అవగాహన అవసరం.

గత రెండు పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను కూలంకషంగా విశ్లేషించుకోవాలి. పరీక్షలో ఏవిధమైన ప్రశ్నలు అడుగుతున్నదీ (ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్, ప్రాక్టికల్, థియరీ, కేస్‌లాస్) విశ్లేషించుకుని ఆ విధంగా సన్నద్ధమవ్వాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

పోస్టు: ఎగ్జిక్యూటివ్ ట్రైనీ-హెచ్ఆర్
ఖాళీలు: సంస్థ నిబంధనల ప్రకారం
అర్హత: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2018 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు.
ఎంపిక: సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరై సర్వీసులకు ఎంపిక కాని అభ్యర్థుల జాబితా ఆధారంగా.
దరఖాస్తు: ఎన్‌టీపీసీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 2019 మార్చి సివిల్ సర్వీసెస్ దరఖాస్తుకు **చివరితేది:** 06.03.2018
వెబ్‌సైట్: www.ntpccareers.net/

ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్

పోస్టులు: స్టేషన్ మేనేజర్, కేబిన్ క్రూ తదితరాలు.
ఖాళీలు: 35 **అర్హత:** డిగ్రీ, బీఈ/ బీటెక్, ఎంసీఏ, సీఏ, ఇతర అర్హతలు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.1500 **చివరితేది:** 23.03.2018
వెబ్‌సైట్: http://www.airindia.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

మనూ, హైదరాబాద్

పోస్టులు: ఫిమేల్ మెడికల్ ఆఫీసర్-01, మేల్ జిమ్ ట్రైనర్-01
అర్హత: ఎంబీబీఎస్, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, అనుభవం.
ఇంటర్వ్యూ తేది: 05.03.2018
వేదిక: మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మనూ) గెస్ట్ హౌస్, గచ్చిబౌలి క్యాంపస్, హైదరాబాద్.
వెబ్‌సైట్: www.manuu.ac.in/

ప్రవేశాలు

తెలంగాణ ఎంసెట్-2018

తెలంగాణలోని 2018-19 విద్యా సంవత్సరానికిగాను వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో ప్రవేశాలు
కోర్సులు: బీఈ/ బీటెక్, బీఎస్సీ, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఫార్మసీ, ఫార్మాడీ.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.
ఎంసెట్ తేదీలు: 2018 మే 2, 3, 4, 5, 7
దరఖాస్తు: ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.800 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 04.03.2018 నుంచి 04.04.2018 వరకు
వెబ్‌సైట్: http://eamcet.tsche.ac.in/

ఐఐఎస్ఈఆర్‌లలో డ్యూయల్ డిగ్రీ

దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఐఐఎస్ఈఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్)లలో ఉమ్మడి ప్రవేశాలు
కోర్సు: బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ
కాల వ్యవధి: 5 సంవత్సరాలు
ప్రవేశాలు కల్పించనున్న ఐఐఎస్ఈఆర్‌లు: బరంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతి.
అర్హత: సైన్సు సబ్జెక్టులతో 2017, 2018 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.
ఎంపిక: కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్/ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 ర్యాంకు/ ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 2018 మే లో ప్రారంభం. **దరఖాస్తు ఫీజు:** రూ.2000
వెబ్‌సైట్: www.iiseradmission.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



బుధవారం ముంబయిలో శ్రీదేవి అంతిమ యాత్రలో ఆమె భర్త బోనీకపూర్, కుమార్తె ఖుషీ, బంధువులు



శ్రీదేవి అంతిమ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన అభిమానులు

తరలిపోయిన వసంత కోకిల

ముంబయి - న్యూస్‌టుడే

అతిలోక సుందరి ఇక తిరిగిరాని లోకాలకు మరలిపోయింది. నాలుగు రోజుల క్రితం హఠాన్మరణంతో అభిమాన లోకాన్ని హతాశుల్ని చేసిన శ్రీదేవి అంత్యక్రియలు బుధవారం మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. విల్లేపార్లే ఎస్వీరోడ్డులోని 'విల్లేపార్లే సేవా సమాజ్ శ్మశానవాటికలో' హిందూ సంప్రదాయపద్ధతిలో సాయంత్రం సుమారు 5.30 ప్రాంతంలో కుమార్తెలు ఖుషి, జాన్వి చెంతన ఉండగా శ్రీదేవి భర్త బోనీకపూర్ ఆమె చితికి నిప్పంటించారు. ఇతర కుటుంబసభ్యులు, సన్నిహితులు కూడా అక్కడే ఉన్నారు. అంత్యక్రియలకు అనేక మంది బాలీవుడ్ ప్రముఖులు హాజరై శ్రీదేవికి బరువెక్కిన హృదయంతో కన్నీటి వీడ్కోలు పలికారు.

అభిమానులు, మీడియాను లోపలకి అనుమతించలేదు. అధికార లాంఛనాల్లో భాగంగా తుపాకులు గాల్లోకి పేల్చి, చితికి బోనీకపూర్ నిప్పంటించగానే పలువురు కన్నీటిని దిగమింగుకుంటూ కనిపించారు. శ్మశానవాటిక బయట వేల మంది ప్రజలు గుమిగూడారు. వారిని నియంత్రించడానికి పోలీసులు కష్టపడ్డారు. షారుక్ ఖాన్ వంటి పలువురు సెలబ్రిటీలు, అనిల్ కపూర్ కుమార్తె సోనమ్ కపూర్ కూడా తమ వాహనాల్లోంచి దిగి శ్మశానవాటిక వద్దకు నడిచి వెళ్లాల్సి వచ్చింది.

రెండు గంటల పాటు అంతిమయాత్ర

పూలతో అలంకరించిన వాహనంలో ఆమె పార్థివ దేహాన్ని తరలించారు. వాహనం ముందు భాగంలో చిరునవ్వుతో కనిపిస్తున్న శ్రీదేవి పెద్ద ఫొటోను ఉంచారు. లోఖండ్‌వాలాలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని శ్మశానవాటిక వద్దకు యాత్రగా చేరుకోవడానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. వేల మంది అభిమానుల మధ్య అంతిమ యాత్ర సాగింది. అంతిమ యాత్ర రథంపై బోనీ కపూర్, ఇద్దరు కుమార్తెలు, బోనీ కపూర్ మొదటి భార్య కుమారుడు అర్జున్ కపూర్, పరిమిత సంఖ్యలో సమీప బంధువులు ఉన్నారు.



శ్రీదేవి అంతిమ యాత్రలో ఆమె భర్త బోనీకపూర్, కుమార్తె జాన్వీ

జనసంద్రం...

అంత్యక్రియలకు వాహనం బయలుదేరగానే తమ అభిమాన తారను కడసారి వీక్షించేందుకు వేల మంది అభిమానులు వీధిలో పోటెత్తారు. వాహనం వెంబడి నడిచారు. కనుచూపు మేర జనసంద్రం కనిపించింది. పలువురు అభిమానులు సమీపంలోని చెట్లు, గేట్లు ఎక్కి నిలబడ్డారు. 2012లో రాజేష్‌ఖన్నా అంతిమయాత్ర తర్వాత శ్రీదేవి అంతిమయాత్రే దివంగత సినీతారలకు నిర్వహించిన అంతిమయాత్రల్లో పెద్దదని, తారామణుల్లో ఇదే పెద్ద అంతిమయాత్ర అని పాతతరం నటులు చెప్పారు. ఆమెను కడసారి చూసేందుకు బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ నటీ, నటులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ నటులు చిరంజీవి, వెంకటేష్, ప్రకాశ్ రాజ్, సరోజ్ ఖాన్, జయాబచ్చన్, ఐశ్వర్యరాయ్ బచ్చన్, అజయ్ దేవగన్, కాజోల్, వివేక్ ఒబెరాయ్, టబు, మాధురి దీక్షిత్, జయప్రద, సుస్మితా సేన్, ఊర్వశి రౌతెలా, ఆదిత్య ఠాక్రే, అర్బాజ్ ఖాన్, ఫరాఖాన్, సంజయ్ లీలా భన్సాలీ, కునాల్ ఖేమ్, సోహా అలీఖాన్, హేమ మాలిని, ఇషా డియోల్, రితేష్ దేశ్‌ముఖ్ తదితరులున్నారు.

దక్షిణాది పద్ధతిలో అంత్యక్రియలు..

అంత్యక్రియలు నిర్వహించేందుకు తమిళనాడు పండితులు బృందంతో ప్రత్యేకంగా తరలివచ్చారు. తమిళనాడు పద్ధతిలో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. అంతిమ వీడ్కోలు పలికేందుకు ఆమె పుట్టింటి వారైన అయ్యప్పన్ వంశీయులు వచ్చారు.

అభిమానుల సందర్శనార్థం..

శ్రీదేవి భౌతికకాయం దుబాయి నుంచి మంగళవారం రాత్రి 9.30కు విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత అక్కడినుంచి అంధేరి పశ్చిమంలోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లో గ్రీన్‌ఏకర్స్ టవర్‌లోని వారి నివాసానికి తరలించారు. రాత్రంతా అక్కడే భద్రపరిచారు. అభిమానుల సందర్శనార్థం బుధవారం ఉదయం 9.30కు పక్కనే ఉన్న సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లోని సెంట్రల్ హాల్‌కు తరలించారు. మండపం దిగువన ప్రత్యేక గాజుపేటికలో భౌతికకాయాన్ని ఉంచారు. ఆ హాలును తెల్లని లిల్లీ పూవులు, మల్లెలు, గులాబీలతో అలంకరించారు. ప్రార్థన నిర్వహించారు. పోలీసులు తుపాకులతో వందనం సమర్పించారు. తమ వెండితెర దేవతను కడసారి చూసి పుష్పాంజలి ఘటించేందుకు వేల మంది అభిమానులు తరలివచ్చారు.

ఎర్రటి కంచిపట్టు చీరలో..

శ్రీదేవిని నవ వధువులా అలంకరించారు. నుదుట ఎర్రటి గుండ్రపు బొట్టు ఉంచారు. మెడలో నగలు వేశారు. ఆమెకెంతో ఇష్టమైన వెడల్పాటి జరీ అంచుతో మెరిసిపోయే ఎర్రటి కంచిపట్టు చీరతో భౌతికకాయాన్ని అలంకరించారు. ఆ పైన త్రివర్ణ పతాకాన్ని చుట్టారు.

కుటుంబసభ్యులు, సన్నిహితులు, ప్రముఖులు అశ్రునయనాలతో నివాళులర్పించారు. అక్కడి హాలులో ఒక మూలన శ్రీదేవి భర్త బోనీకపూర్ ఎర్రటి కనులతో విషణ్ణ వదనంతో నిలబడి ఉన్నారు. ఆయనతో పాటు శ్రీదేవి మరుదులు అనిల్ కపూర్, సంజయ్ కపూర్, అనిల్ కపూర్ కుమారుడు హర్షవర్ధన్ కపూర్, కుమార్తెలు సోనమ్ కపూర్, రియా కపూర్ సహా కుటుంబసభ్యులు ఉన్నారు. వారి కళ్లు నీటితో నిండి కనిపించాయి. వారికి కొద్దిగా వెనకగా శ్రీదేవి కుమార్తెలు జాన్వి, ఖుషి నిలబడి ఉన్నారు.

పలువురు పాత, నవతరపు తారలు శ్రీదేవికి నివాళులు అర్పించేందుకు వచ్చారు. ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్ర భోరున విలపించారు. కరణ్‌జోహార్ తన కన్నీటిని దిగమింగుకుంటూ మనీష్‌ను ఓదార్చారు. రాణి ముఖర్జీ శ్రీదేవి భౌతిక కాయం పక్కనే కూర్చొన్నారు. సోనమ్‌కపూర్ ఓదార్చారు.

శ్రీదేవి భౌతిక కాయాన్ని ఉంచిన హాలుకు మూడు ప్రవేశ ద్వారాలున్నాయి. వీఐపీలను ఒక ద్వారం గుండా పంపించారు. మీడియాను ఒక ద్వారం గుండా, అభిమానులను మరొక ద్వారం గుండా అనుమతించారు. వేదిక వద్ద దాదాపు 200 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు.

సాధారణ ప్రజానీకాన్ని ఉదయం పది నుంచి అనుమతించారు. కర్ణాటక, చెన్నై సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ఆమె అభిమానులు తరలివచ్చారు. ఉదయం ఆరు నుంచి వరుసలో నిలబడ్డారు.

మీడియా ప్రతినిధులకు ఆంక్షలు..

శ్రీదేవి భౌతికకాయాన్ని సందర్శించేందుకు కపూర్ కుటుంబం మీడియా ప్రతినిధులకు అనుమతి ఇచ్చింది. అయితే లోపలికి కెమెరాలు, వాయిస్ రికార్డర్ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. శ్మశానవాటిక వద్ద గేటులోపలికి మీడియా ప్రతినిధులను అనుమతించలేదు.





శ్రీదేవి అంతిమ యాత్రలో పాల్గొన్న షారుఖ్ ఖాన్, జాకీష్రాఫ్



అంతిమ యాత్ర వద్ద శ్రీదేవి చిత్రపటంతో అభిమానులు

హోలీ సంబరాలు రద్దు!

శ్రీదేవి మృతికి సంతాపంగా ఆమె నివసించిన లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లోని గ్రీన్‌ఏకర్స్ సొసైటీ మార్చి 2న నిర్వహించే హోలీ సంబరాలను రద్దు చేసింది. సొసైటీలో రంగులు చల్లుకోవడం, రెయిన్ డ్యాన్స్, మ్యూజిక్ తదితర కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఓ లేఖ విడుదల చేశారు.



శ్రీదేవి పార్థివ దేహం వద్ద కుటుంబ సభ్యులు

మనసారా దుఃఖపడనివ్వండి

- మీడియాకు శ్రీదేవి కుటుంబం విజ్ఞప్తి
- ప్రపంచానికి ఆమె చాందిని కావచ్చు.. నాకు మాత్రం నా ప్రేమమూర్తి
- బోనీకపూర్ ఉద్వేగభరిత ప్రకటన

ముంబయి: శ్రీదేవి మరణంతో తాము ఎంతో వేదన అనుభవిస్తున్నామని, మనసారా దుఃఖం అనుభవించేందుకు తగిన అవకాశం కల్పించాలని ఆమె కుటుంబం ఒక ప్రకటనలో మీడియాకు విజ్ఞప్తి చేసింది. శ్రీదేవి కుమార్తెలు ఖుషి, జాన్విలకు అండగా నిలబడినందుకు సినీ పరిశ్రమ సభ్యులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపింది. శ్రీదేవి అంత్యక్రియల అనంతరం కపూర్, అయ్యప్పన్, మార్వా కుటుంబాల నుంచి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బోని కపూర్ వేరుగా శ్రీదేవి అధికారిక ట్విట్టర్ హ్యాండిల్‌లో ఉద్వేగభరితంగా మరో ప్రకటన చేశారు.

"స్నేహితురాలు, భార్య, ఇద్దరు కుమార్తెలకు తల్లి అయిన వ్యక్తిని కోల్పోవడం మాటల్లో చెప్పలేనంత నష్టం. ఈ సమయంలో మాకు అండగా నిలబడిన శ్రీదేవి అసంఖ్యాక అభిమానులకు, మా శ్రేయోభిలాషులకు, స్నేహితులకు హృదయపూర్వక ధన్యావాదాలు. నా బిడ్డలు అర్జున్, అన్షులా ఇద్దరూ నాకు, ఖుషి, జాన్వికి ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చారు. అండగా నిలబడ్డారు. భరించలేని ఈ నష్టాన్ని ఎదుర్కోవడానికి ఒక కుటుంబంగా మేము కలిసి ప్రయత్నించాం.

ఈ ప్రపంచానికి ఆమె ఒక చాందిని, ఈ అద్భుత నటి వారికి శ్రీదేవి. నాకు మాత్రం ఆమె నా ప్రేమమూర్తి. నా స్నేహితురాలు. మా అమ్మాయిలకు తల్లి. నా జీవితభాగస్వామి. మాఇద్దరు అమ్మాయిలకు ఆమే సర్వస్వం. ఆమే వారి జీవితం. మా జీవితాన్ని నడిపిన ఇరుసు.

నా ప్రియమైన శ్రీమతికి; ఖుషి, జాన్వి మాతృమూర్తికి మేము వీడ్కోలు పలికిన ఈ సమయంలో నాదొక హృదయపూర్వక విజ్ఞప్తి. మేము ఏకాంతంగా దుఃఖించాల్సిన మా అవసరాన్ని గౌరవించండి.

శ్రీదేవి గురించి మీరు మాట్లాడాలనుకుంటే అది.. ఆమెతో మీకు ముడిపడి ఉన్న ప్రత్యేక జ్ఞాపకాలే కానివ్వండి. ఆమె అసమాన నటి. అందుకే ఆమెను ప్రేమించండి, గౌరవించండి. నటుల జీవితంపై తెర ఎప్పటికీ పడదు. ఎందుకంటే వెండి తెరపై వారు ఎప్పుడూ తళుకులీనుతూనే ఉంటారు.

ఈ సమయంలో నా ఆందోళన అంతా ఒకటే. నా కుమార్తెలను రక్షించుకోవడం, శ్రీ లేకుండానే ముందుకు వెళ్లే మార్గం చూసుకోవడం. ఆమె మా జీవితం, మా బలం, మేము సదా నవ్వుతూ ఉండడానికి ఆమే కారణం. మేము ఆమెను అమితంగా ప్రేమిస్తున్నాం.

నా ప్రియతమా నీ ఆత్మకు శాంతి కలుగుగాక. మా జీవితాలు మాత్రం మునపటిలా ఎప్పటికీ ఉండబోవు... " అని బోని కపూర్ పేర్కొన్నారు.

శ్రీదేవిపై చూపించిన ప్రేమకన్నా ఎక్కువ చూపించండి..: కొద్ది రోజులుగా తాము క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటున్నామని, ముఖ్యంగా బుధవారం తమకు చాలా కష్టమైన రోజని కపూర్, అయ్యప్పన్, మార్వా కుటుంబాల ప్రకటన పేర్కొంది. తాము పడుతున్న వేదనను అర్థం చేసుకుని శ్రీదేవి సహచరులు, ఆమె అభిమానులు, ఆమె స్నేహితులు తమకు ఎంతో తోడ్పాటును, ప్రేమను అందించారని ఆ ప్రకటనలో అన్నారు. ఆమె మరణం తాలూకూ దుఃఖాన్ని అనుభవించే స్వేచ్ఛను తమకు మీడియా ఇవ్వాలని, శ్రీ తన జీవితాన్ని హుందాగా జీవించారని, అంతే గౌరవం ఆమెకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని ప్రకటనలో కోరారు. శ్రీదేవిపై కురిసిన ప్రేమను ఆమె ఇద్దరు కుమార్తెలు ఖుషి, జాన్వి కలకాలం తమ జ్ఞాపకంగా పదిలపర్చుకోవాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. వారిద్దరి బాధను తగ్గించేలా శ్రీపై కనబర్చిన ప్రేమకు మించిన ప్రేమను వారిపై కనబర్చాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ వారి కోసం కలలు కన్న జీవితాన్ని ఏర్పర్చుకునేలా వారికి సహకారం అందించాలన్నారు.

శ్రీదేవి మృతిపై దర్యాప్తు జరగాలన్న వాదనపై భిన్నాభిప్రాయాలు

ముంబయి: సినీతార శ్రీదేవి దుబాయ్‌లో మృతిచెందిన ఘటనపై.. ముంబయి పోలీసులు దర్యాప్తు జరపాలన్న వాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఈ వాదనకు మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. శ్రీదేవి ప్రమాదవశాత్తు స్నానాల తొట్టిలోని నీటిలో మునిగి చనిపోయిందని తేలుస్తూ.. దుబాయ్ పోలీసులు ఈ కేసును మూసివేసిన సంగతి తెలిసిందే. అయితే దుబాయ్ పోలీసులు చెప్పిన ప్రతి విషయాన్నీ విశ్వసించాల్సిన అవసరమేంటని జయహో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆదిల్ ఖత్రీ వ్యాఖ్యానించారు. ఘటన ఎలా జరిగిందన్నదానిపై స్పష్టత లేదని.. వదంతులు ఆగాలంటే పారదర్శకమైన విచారణ జరగాలని అన్నారు. ఈ మేరకు ముంబయి పోలీసు కమిషనర్‌కు ఇ-మెయిల్ చేసినట్లు వెల్లడించారు. మరో సామాజిక కార్యకర్త ఎస్.బాలకృష్ణన్ కూడా ఇదే డిమాండుతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాశారు. 'మొదట గుండెపోటు వల్ల శ్రీదేవి మృతిచెందారని వార్తలు వచ్చాయి. తర్వాత ఆమె ప్రమాదవశాత్తు నీటిలో మునిగినట్లు నివేదికలు వెల్లడించాయి. ఇదంతా విచిత్రంగా ఉంది. ఫోరెన్సిక్ వైద్యులెవరూ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందని నిర్ధారించలేరు" అని ఆయన అన్నారు. మరోవైపు దుబాయ్ పోలీసులు చట్టప్రకారం విచారణ పూర్తి చేసినందున.. మళ్లీ ముంబయి పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు జరపాల్సిన అవసరం లేదని మానవహక్కుల కార్యకర్త అభాసింగ్ తెలిపారు. శ్రీదేవి మరణంలో అనుమానించాల్సిన కోణాలేవీ కనిపించట్లేదని చెప్పారు.

ఆమె నిదురిస్తున్న సుందరిలా కనిపించింది

- యూఏఈలోని సామాజిక కార్యకర్త అష్రఫ్ వెల్లడి

దుబాయ్: అంతిమ యాత్రకు ముందు సినీతార శ్రీదేవి 'నిదురిస్తున్న సుందరి (స్లీపింగ్ బ్యూటీ)'లా కనిపించిందని. . ఆమె మృతదేహ తరలింపు ప్రక్రియలో పాలుపంచుకున్న సామాజిక కార్యకర్త అష్రఫ్ షెర్రీ వ్యాఖ్యానించారు. దుబాయ్ నుంచి ముంబయికి జెట్ విమానంలో శ్రీదేవి దేహాన్ని తరలించే ముందు ఆమెను ప్రత్యక్షంగా చూసిన అతికొద్దిమందిలో అష్రఫ్ కూడా ఒకరు. ఎంబామింగ్ చేస్తున్న సమయంలో ఆయన అదే గదిలో ఉన్నారు. సినిమాలు, ఫోటోల్లో చూసినదానికి భిన్నంగా శ్రీదేవి ఉందని. . ఆమె ప్రశాంతంగా నిద్రపోయినట్లుగా కనిపించిందని ఆయన చెప్పారు. మీడియాలో వార్తలు వచ్చినట్లుగా ఆమె



తలపై ఏ గాయాలూ లేవని అష్రఫ్ పేర్కొన్నారు. 3 తెల్లటి నూలు దుప్పట్లను శ్రీదేవి దేహానికి చుట్టి.. రూ. 32వేలు విలువచేసే ఓ సాధారణ చెక్క శవపేటికలో తరలించారని తెలిపారు. ఒక్క శ్రీదేవి విషయంలోనే కాదు.. ఇప్పటివరకూ యూఏఈలో ప్రాణాలు వదిలిన దాదాపు 4,700 మంది దేహాలను వారి వారి సొంత దేశాలకు పంపించడంలో అష్రఫ్ తన సహకారం అందించారు. స్వస్థలం కేరళ అయినప్పటికీ.. అష్రఫ్ యూఏఈలోని అజ్మన్‌లో స్థిరపడ్డారు. ఆటోమొబైల్ మరమ్మతుల దుకాణాన్ని నిర్వహిస్తూనే.. సామాజిక సేవలో పాలుపంచుకుంటున్నారు. భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక ప్రవాసీ సమ్మాన్ పురస్కారాన్నీ అందుకున్నారు.

ఆరోజు బోనీ చిన్నపిల్లాడిలా విలపించారు

నటుడు అద్నాన్ సిద్దికీ

ముంబయి: 'శ్రీదేవి ఇక లేదని తెలిసిన వెంటనే దుబాయ్‌లో బోనీ కపూర్ చిన్నపిల్లాడిలా భోరుమంటూ విలపిస్తూనే ఉన్నారు' అని నటుడు అద్నాన్ సిద్దికీ చెప్పారు. అతడిని ఓదార్చడం ఎవ్వరితరం కాలేదని చెప్పారు. 'మామ్' సినిమాలో శ్రీదేవితో కలిసి అద్నాన్ సిద్దికీ నటించారు. శ్రీదేవి మృతి వార్త తెలిసిన వెంటనే తాను వారు బసచేసిన హోటల్‌కు పరిగెత్తి వెళ్లానన్నారు. శ్రీదేవి మృతి చెందిన సమయంలో తాను కూడా దుబాయ్‌లోనే ఉన్నట్లు చెప్పారు. పరిచయం ఉన్న ఓ పాత్రికేయుడు తనకు ఆరోజు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో ఫోన్‌చేసి... అసలు శ్రీదేవి మృతి వార్త నిజమా? కాదా? అని అడిగినట్లు అద్నాన్ సిద్దికీ చెప్పారు. వెంటనే హోటల్‌కు వెళ్లాననీ... అయితే తనను వారెవరూ లోపలికి అనుమతించలేదన్నారు. ఆ సమయంలో దుబాయ్ అధికారులు బోనీకపూర్ మాత్రమే ఘటనా స్థలంలో ఉన్నట్లు చెప్పారు. గంటకుపైగా లాబీలో నిరీక్షించిన తర్వాత తాను బోనీని కలుసుకోగలిగినట్లు అద్నాన్ వెల్లడించారు.

శ్రీదేవి మరణంపై తప్పుడు ప్రచారం

ఆమె చిన్ననాటి స్నేహితురాలు పింకీరెడ్డి ఆవేదన

ముంబయి: శ్రీదేవి మరణంపై తప్పుడు ప్రచారం జరుగుతోందంటూ ఆమె చిన్ననాటి స్నేహితురాలు, టి.సుబ్బరామి రెడ్డి కుమార్తె పింకీ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరణించినవారి గురించి ఇంత తప్పుగా ఆలోచించడమేంటని ప్రశ్నించారు. తన స్నేహితురాలికి కడసారిగా వీడ్కోలు పలికేందుకు ముంబయికి వచ్చిన పింకీ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. 'దుబాయ్‌కి వెళ్లే ముందు శ్రీదేవి నాకు ఫోన్ చేసింది. అప్పటికి తాను జ్వరంతో బాధపడుతున్నానని.. యాంటీబయాటిక్ ఔషధాలు వాడుతున్నానని చెప్పింది. ఇంత జ్వరంతో వెళ్లడం ఎందుకని నేను ఆమెను ప్రశ్నించాను. అయితే, పెళ్లికి తప్పకుండా వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. చివరకు అందరినీ విడిచి వెళ్లిపోయింది' అంటూ కంటతడి పెట్టారు. శ్రీదేవి మరణంపై తప్పుడు ప్రచారం జరుగుతుండటం తనను తీవ్ర కలచివేస్తోందని వ్యాఖ్యానించారు. 'లైపోసెక్షన్ చేయించుకుందని.. శస్త్రచికిత్సలు చేయించుకుందని.. ఏవేవో రాసేస్తున్నారు. ఆమె చేసిన మంచి సినిమాల గురించి ఎందుకు మాట్లాడరు?' అంటూ పింకీ ప్రశ్నించారు. శ్రీదేవి, బోనీ కపూర్ మధ్య మనస్పర్థలేవీ లేవని ఆమె పేర్కొన్నారు.

సాగర్ కుడి కాలువకు ఐదు రోజులు నీటిని విడుదల చేయండి

- కృష్ణా యాజమాన్యబోర్డు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్, నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ కుడి కాలువకు రోజూ రెండువేల క్యూసెక్కుల చొప్పున ఐదురోజుల పాటు నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్యబోర్డు ఆదేశించింది. మరోవైపు మార్చి రెండోతేదీన త్రిసభ్య కమిటీ సమావేశమై మిగిలిన నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోనుంది. జనవరి 10న త్రిసభ్య కమిటీ నీటి విడుదలపై తీసుకొన్న నిర్ణయం కంటే 2.324 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా వాడుకొందని, దీనిని అనధికారికంగా వాడుకోవడంగానే భావిస్తున్నామంటూ శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలను నిలిపివేయాలని మంగళవారం బోర్డు రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది. గతంలో తీసుకొన్న నిర్ణయం కంటే ఎక్కువ నీటిని వాడుకోవడమే కాక, కనీస నీటిమట్టాలకు పైన ఉన్న నీటిలోనూ ఆంధ్రప్రదేశ్‌కు 0.56 టీఎంసీ మాత్రమే మిగులు ఉందని తెలంగాణ మరో లేఖ రాసింది. ఈ లేఖలపై బుధవారం ఆంధ్రప్రదేశ్ స్పందించింది. ఆ రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావులు బోర్డు సభ్యకార్యదర్శితో మాట్లాడి పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు నీటి విడుదలను కొనసాగించాలని కోరారు. త్రిసభ్య కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకొనేవరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు రోజుకు రెండువేల క్యూసెక్కుల చొప్పున 5 రోజులపాటు సాగర్ కుడికాలువకు విడుదల చేయాలని బోర్డు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండో తేదీన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జరుగుతుంది.

నీటి విడుదల కొనసాగించాల్సిందేనని పట్టుబట్టిన ఏపీ అధికారులు: నాగార్జునసాగర్ కుడి కాల్వకు బుధవారం నీటి విడుదల నిలిపివేయగా ఆంధ్రా అధికారులు కొనసాగించాల్సిందేనని పట్టుబట్టారు. మాచర్ల ఈఈ వెంకటస్వామి, డీఈ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యాం కంట్రోల్‌రూం వద్ద పట్టుదలగా కూర్చున్నారు. ఎన్నెస్పీ సీఈ సునీల్ మాట్లాడుతూ బుధవారం ఉదయానికి లక్ష్యం పూర్తి కావడంతో సాగర్ నుంచి కుడికాల్వకు నీటివిడుదలను నిలిపివేసినట్లు తెలిపారు. నీటి విడుదలను కొనసాగించాలని ఏపీ ప్రభుత్వ విన్నపం, కృష్ణా బోర్డు ఆదేశాల మేరకు మరో 10 వేల క్యూసెక్కులను 5 రోజుల పాటు రోజుకు 2 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు.

సెన్సెక్స్ ▼ 162	నిఫ్టీ ▼ 61	రూపాయి 65.17 ▼ 30 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	బంగారం 30535 ▼ రూ.లలో 160 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	వెండి 38210 ▼ రూ.లలో 285 (ముంబయిలో కిలో)	ముడి చమురు 65.99 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
34184	10493				

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,388	–22
నాస్‌డాక్	7,361	+30
నిక్కీ 225 (జపాన్)	22,068	–322
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,518	–22
షాంఘై(చైనా)	3,260	–33
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,232	–51
డాక్స్ (జర్మనీ)	12,436	–55

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.22	68.67
పౌండ్ స్టెర్లింగ్	82.33	95.49
యూరో	72.42	83.98
జపనీస్ యెన్/100	55.25	64.08
ఆస్ట్రేలియా డాలరు	46.12	53.37
సింగపూర్ డాలరు	44.67	52.92
థాయ్ బాత్/100	188.19	225.07
బహ్రెయిన్ దీనార్	160.38	183.79
కువైట్ దీనార్	179.62	223.70
సౌదీ రియాల్	15.75	18.67
యూఏఈ దిర్హమ్	16.12	18.84
మలేషియా రింగిట్	14.77	18.16
చైనీస్ యువాన్	7.27	11.80

బుధవారం నిఫ్టీ కదలికలు




హోలీ కానుక

- అక్టోబరు-డిసెంబరు జీడీపీ వృద్ధి 7.2 శాతం • చైనాను అధిగమించాం
- పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.6% వృద్ధిరేటు • గత అంచనా 6.5 శాతమే

దిల్లీ: హోలీకి ముందే దేశ ఆర్థిక వ్యవస్థ కాంతులీనింది.. మూడో త్రైమాసిక జీడీపీ, జనవరి నెలకు 8 కీలక రంగాల్లో వృద్ధి మెరిపించడమే ఇందుకు కారణం. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో వేగవంతమైన వృద్ధి కలిగిన దేశం 'భారత్' అన్నది మరోసారి రుజువైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో వృద్ధిరేటు 7.2 శాతంగా నమోదైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయిదు త్రైమాసికాల్లోనే ఇది అధికం కావడం గమనార్హం. ఇదే కాలంలో చైనా వృద్ధిరేటు 6.8 శాతమే కావడం గమనార్హం. వ్యవసాయం, తయారీ, నిర్మాణ రంగాలతో పాటు కొన్ని సేవల రంగాలు బాగా రాణించడమే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి కారణాలని ప్రభుత్వం వెల్లడించింది. వినియోగ వ్యయాలు, పెట్టుబడులు అధికం కావడం కలిసి వస్తోంది. కార్పొరేట్ ఆదాయాలు, పారిశ్రామికోత్పత్తి వృద్ధి చెందుతున్నాయనడానికి ఇది దర్పణం పడుతోంది. ఫలితంగా మార్చి 31తో పూర్తయ్యే ఆర్థిక సంవత్సరం మొత్తానికి వృద్ధిరేటు 6.6 శాతం కావచ్చని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌ఓ) రెండో ముందస్తు అంచనాల్లో పేర్కొంది. గతంలో రూపొందించిన అంచనాల్లో పూర్తి 2017-18 వృద్ధిరేటు 6.5 శాతం కావచ్చని సీఎస్‌ఓ అంచనా వేసింది. మూడు త్రైమాసికాల వాస్తవ గణాంకాలను పరిగణనలోకి తీసుకుని, సీఎస్‌ఓ తాజా అంచనాలు విడుదల చేసింది. దీనికి అదనంగా జనవరి నెలకు సంబంధించి బొగ్గు, ఉక్కు, సిమెంటు, పెట్రోలియం వంటి 8 కీలక రంగాల్లో వృద్ధి 6.7 శాతంగా నమోదైంది. 2017 జనవరిలో వీటి వృద్ధి 3.4 శాతమే కావడం గమనార్హం. ఈ గణాంకాలు వాస్తవ ఆర్థిక కార్యకలాపాల్లో వృద్ధికి చిహ్నాలని, ఆర్థిక సర్వే అంచనాల ప్రకారమే ఉన్నాయని ఆర్థిక శాఖ పేర్కొంది. 2016-17లో వృద్ధి రేటు 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో తయారీ రంగానికి జోడించిన స్థూల విలువ (జీవీఏ) 8.9 శాతం పెరిగింది. రెండో త్రైమాసికంలో ఈ వృద్ధి 6.9 శాతమే. ఇదే సమయంలో వ్యవసాయ రంగ జీవీఏ వృద్ధి కూడా 2.7 శాతం నుంచి 4.1 శాతానికి పెరిగింది.


8 కీలక రంగాల పనితీరు



8 కీలక రంగాల్లో

- బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాలు జనవరిలో 6.7 శాతం వృద్ధి చెందాయి. 2017 డిసెంబరులో ఈ వృద్ధి 4.2 శాతం, నవంబరులో 7.4 శాతంగా నమోదయ్యాయి.
- పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తి 11 శాతం, సిమెంటు ఉత్పత్తి 20.7 శాతం, విద్యుదుత్పత్తి 8.2 శాతం, బొగ్గు 3 శాతం, ఉక్కు ఉత్పత్తి 3.7 శాతం పెరిగాయి. ముడిచమురు ఉత్పత్తి 3.2 శాతం, ఎరువుల ఉత్పత్తి 1.6 శాతం, సహజవాయువు ఉత్పత్తి 1 శాతం తగ్గాయి.
- ఏప్రిల్-జనవరి నెలలన్నిటికీ కలిపితే, 8 కీలక రంగాల్లో వృద్ధి 4.3 శాతానికి తగ్గింది. 2016-17 ఇదే కాలంలో వృద్ధి 5.1 శాతం.

జీడీపీ వృద్ధి (వార్షిక) స్థిర ధరల వద్ద (2011-12)



ఇదే కాలంలో నిర్మాణ రంగం వృద్ధి కూడా 2.8 శాతం నుంచి 6.8 శాతానికి వృద్ధి చెందింది.

- జీడీపీ నుంచి నికర పన్నుల మొత్తాన్ని తొలగించగా వచ్చే స్థూల విలువ జోడింపు (జీవీఏ) మూడో త్రైమాసికంలో 6.7 శాతంగా నమోదైంది. రెండో త్రైమాసికంలో ఇది 6.1 శాతం. 2017-18 మొత్తానికి ఇది 6.4 శాతం కావచ్చని అంచనా. 2016-17లో ఇది 7.1 శాతం.
- మూడో త్రైమాసికంలో తయారీ రంగం 8.1 శాతం వృద్ధి చెందగా, పూర్తి ఏడాదికి 5.1 శాతం కావచ్చని అంచనా.
- సేవలతో కలిపి మొత్తం సేవల రంగం వృద్ధి కూడా 6.4 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగింది.
- ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో వృద్ధి రేటు 6.3 శాతమని గతంలో అంచనా వేయగా, 6.5 శాతానికి పెంచుతూ తాజాగా సీఎస్‌ఓ సవరించిన గణాంకాలు విడుదల చేసింది.
- 2016-17 రెండో త్రైమాసికంలో వృద్ధిరేటు 7.5 శాతంగా నమోదైంది.
- 2011-12 స్థిర ధరల కనుగుణంగా, 2017-18 వాస్తవ జీడీపీ రూ.130.04 లక్షల కోట్లుగా ఉండొచ్చని సీఎస్‌ఓ పేర్కొంది. 2016-17కు తొలి సవరించిన అంచనాల ప్రకారం ఇది రూ.121.96 లక్షల కోట్లు.

మళ్లీ బేర్..

- రెండో రోజూ నష్టాల్లోనే మార్కెట్
- అమెరికా వడ్డీ రేట్ల పెంపు సంకేతాల ప్రభావం

సమీక్ష

మార్చి సిరీస్ ప్రారంభమయ్యాక తొలి రెండు రోజులు అదరగొట్టిన మార్కెట్.. ఆ తర్వాతి రెండు రోజులు డీలాపడింది. పీఎన్‌బీలో కుంభకోణం విలువ పెరగడంతో బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి కొనసాగడం ఇందుకు ప్రధాన కారణం. వడ్డీ రేట్ల పెంపునకు అమెరికా ఫెడ్ సంకేతాలు ఇవ్వడం, దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు నిరుత్సాహపర్చడం కూడా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగడమూ సెంటిమెంటును దెబ్బతీసింది. ఫలితంగా నిఫ్టీ 10500 స్థాయి దిగువకు వచ్చింది. అయితే సెన్సెక్స్ 34000 స్థాయిని నిలబెట్టుకోవడం కొంతలో కొంత ఊరటనిచ్చే విషయం.

నేలచూపులతో మొదలై..: ఉదయం సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్ల నష్టంతో 34155.63 వద్ద ఆరంభమైంది. అనంతరం మరింత ఒత్తిడికి లోనై 34076.45కు దిగివచ్చింది. మధ్యాహ్నం తర్వాత తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీకి నష్టాలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఈ సంతోషం కొద్ది సేపే నిలిచింది. మళ్లీ ఆఖర్లో మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గు చూపారు. దీంతో ఆఖరుకు సెన్సెక్స్ 162.35 పాయింట్ల నష్టంతో 34,184.04 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 61.45 పాయింట్లు కోల్పోయి 10,492.85 పాయింట్ల వద్ద స్థిరపడింది.

యాక్సిస్, ఐసీఐసీఐ విలవిల..: పీఎన్‌బీ కుంభకోణం సెగ ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లకే కాదు ప్రైవేట్ రంగ బ్యాంకులకు కూడా తాకింది. యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు 1-2% వరకు నష్టపోయాయి. నిర్వహణ, సాంకేతికతపరంగా నష్ట నివారణ ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఆర్థిక శాఖ 15 రోజులు గడువు ఇవ్వడం ఇందుకు నేపథ్యం. మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరుకు నష్టాలు కొనసాగడంతో 20 నెలల కనిష్ఠానికి పడిపోయింది. గీతాంజలి జెమ్స్ షేర్లు 5 శాతం వరకు క్షీణించాయి.

వచ్చే ఏడాది రాణిస్తాం

బ్యాంకింగ్ విభాగంలో ఆర్డర్లు కారణం • ఇన్ఫోసిస్ అంచనాలు

బెంగళూరు: వచ్చే ఆర్థిక సంవత్సరం(2018-19)లో అధిక వృద్ధి నమోదవుతుందని ఇన్ఫోసిస్ అంచనా వేస్తోంది. బలమైన ఆర్థిక మూలాలు ఇందుకు దోహదం చేస్తాయని కంపెనీ భావిస్తోంది. అయితే ఎంత మేర వృద్ధి సాధిస్తారన్న విషయం ముందే ఊహించలేమని తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవల విభాగంలో ఆర్డర్లు ఎక్కువగా వస్తుండడంతో వృద్ధికి ఊతమిస్తాయని ఐటీ దిగ్గజం అంటోంది. అందుకే 2018-19పై ఆశావహంగా ఉన్నామని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్‌తో తెలిపింది. అయితే రిటైల్ విభాగంలో కొన్ని నిర్మాణాత్మక సవాళ్ల పరంగా ఊగిసలాటలకు గురికావొచ్చని అంటోంది. ఇటీవలి త్రైమాసికాల్లో టెలికమ్యూనికేషన్ల విభాగం రాణించిందని.. బీమా, ఆరోగ్య సంరక్షణ రంగాలు 2018-19లో మెరుగ్గా ఉంటాయని అంచనా వేస్తోంది. లైఫ్ సైన్సెస్, యుటిలైజేషన్ విభాగాలు మాత్రం స్తబ్దుగా ఉండొచ్చని భావిస్తోంది. డిజిటల్ సేవల విభాగంలో తమకు బలమైన సామర్థ్యాలున్నాయని అంటోంది. సమీప భవిష్యత్‌లో మార్జిన్లు స్వల్పశ్రేణిలో కదలాడవచ్చని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంటోంది. ఇన్ఫోసిస్ సైతం తమ సంస్థాగత నిర్మాణం, వ్యూహాల్లో భారీ మార్పులేమీ ఉండకపోవచ్చని అంటోంది.

ఇన్ఫీ లక్ష్యం రూ.1250: ఇన్ఫోసిస్ షేరు లక్ష్యం ధరను రూ.1250గా కోటక్ కొనసాగించింది. అదే సమయంలో 'జతచేసుకోండి' రేటింగ్‌ను సైతం అట్టేపెట్టిఉంచింది. నాయకత్వ వలసల వల్ల ఇన్ఫోసిస్‌పై కొంత ప్రభావమే పడిందని.. మా అంచనాల కంటే మిన్నగా రాణించిందని.. అందువల్ల 2018-19పై తాము సానుకూలంగా ఉన్నామని కోటక్ వివరించింది.

మార్కెట్ కబుర్లు

- ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,013 కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టును దక్కించుకున్నట్లు **దిలీప్ బిల్డ్‌కాన్** వెల్లడించింది. ఎన్‌హెచ్ఏఐ నిర్వహించిన వేలంలో అతి తక్కువ బిడ్ వేసి ఈ కాంట్రాక్టును చేజిక్కించుకున్నట్లు పేర్కొంది.
- **హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్** పబ్లిక్ ఇష్యూకు 5 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో 1,21,37,070 షేర్లను జారీ చేయగా 6,02,90,505 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి.
- పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు సెబీకి **సంధ్యా మెరైన్స్** సంబంధిత పత్రాలను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.300 కోట్ల విలువైన షేర్లతో పాటు ప్రస్తుత వాటాదార్లకు చెందిన 1.26 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.
- మార్చి 5 నుంచి 36 కంపెనీల షేర్లను **బీఎస్ఈ** తొలగించనుంది. గత మూడేళ్లుగా ఈ షేర్ల ట్రేడింగ్‌పై నిషేధం ఉండటమే ఇందుకు కారణం.
- డెక్స్‌మెడెటోమైడైన్ హైడ్రోక్లోరైడ్ మందుసూదీని (ఇంజక్షన్) విక్రయించే నిమిత్తం అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ నుంచి తుది అనుమతులు లభించాయని **జైడస్ కేడిలా** తెలిపింది.

యూఎస్‌లో జనరిక్ విక్రయాలు తగ్గొచ్చు

జనవరి- మార్చిపై డాక్టర్ రెడ్డీస్

హైదరాబాద్: జనవరి- మార్చి త్రైమాసికంలో అమెరికా విపణిలో జనరిక్ ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చని డాక్టర్ రెడ్డీస్ భావిస్తోంది. రెన్వేలా జెనరిక్ ఔషధం ధర, దాని మార్కెట్ వాటా గణనీయంగా తగ్గడం ఇందుకు కారణమని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలియజేసింది. కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్సలో రెన్వేలాను వాడుతారు. అమెరికాలో ఈ ఔషధం వార్షిక అమ్మకాల విలువ సుమారు 180 కోట్ల డాలర్లుగా ఉంటోంది. గతేడాది రెన్వేలాను అమెరికా మార్కెట్లో విడుదల చేశాక.. అరబిందో ఫార్మా, సిప్లా, మరికొన్ని కంపెనీలు కూడా తమ జనరిక్ ఔషధాలతో అడుగుపెట్టాయి. దీంతో ఔషధం ధరతో పాటు కంపెనీ మార్కెట్ వాటా కూడా తగ్గింది. అయితే కొన్ని ఔషధాల పరిస్థితి ఇలా ఉంటే డెకోజెన్ లాంటి మరికొన్ని ఔషధాల డిమాండు పెరిగిందని అన్నారు. డెకోజెన్‌ను కేన్సర్ చికిత్సలో వాడతారు. 2018-19లో నువారింగ్, అలోక్సి, ప్రోపోఫోల్, ఎక్సెలాన్ ప్యాచ్ లాంటి కొన్ని కొత్త ఔషధ ఉత్పత్తులను ప్రవేశపెట్టే అవకాశం ఉందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. సుబోక్జోన్, కోపాక్జోన్ జెనరిక్ ఔషధాలకు నియంత్రణ సంస్థల అనుమతులు రావాల్సి ఉంది.

భెల్ మధ్యంతర డివిడెండు చెల్లింపు

దిల్లీ: విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్ 2017-18 ఆర్థిక సంవత్సరానికి తమ వాటాదార్లకు 40 శాతం మధ్యంతర డివిడెండు చెల్లించినట్లు తెలిపింది. 'విలువ పరంగా చెప్పాలంటే రూ.293.71 కోట్లు చెల్లించాం. దీంతో నాలుగు దశాబ్దాలుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా డివిడెండు చెల్లిస్తున్నామ'ని సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. భారత ప్రభుత్వానికి భెల్‌లో 63.06 శాతం వాటా ఉంది. దీంతో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అనంత్ జి.గీతే, సహాయ మంత్రి బాబుల్ సుప్రియోలకు భెల్ సీఎండీ అతుల్ సోబ్తి రూ.185.21 కోట్ల మధ్యంతర డివిడెండు చెక్కును అందించారు.

ఇన్ఫోసిస్



రూ.1147.60 వద్ద ప్రారంభమై రూ.1142.55 - 1189.50 మధ్య కదలాడి క్రితం ముగింపు 1150.20 తో పోలిస్తే రూ.22.40 (1.95%) లాభంతో రూ.1172.60 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 86,34,208.

వేదాంతా




రూ.338.70 వద్ద మొదలై రూ.327.00 - 338.70 మధ్య చలించి క్రితం ముగింపు 340.60తో పోలిస్తే రూ.10.85 (3.19%) నష్టంతో రూ.329.75 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 1,05,66,570 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
అశోక్ లేలాండ్	142.00	బ్యాంక్ ఆఫ్ ఇండియా	112.15
భారత్ బిజిలీ	1659.00	కార్పొరేషన్ బ్యాంక్	30.60
భారత్ ఫోర్జ్	798.00	కాస్మో ఫిలిమ్స్	284.00
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1475.95	ధనూకా అగ్రిటెక్	612.30
అవెన్యూ సూపర్‌మార్ట్స్	1387.00	ఇక్రా	3691.15
వెంకీస్	4146.40	పీఎన్‌బీ	92.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
28/02	8,739	10,490	–1751	4791	3194	1597
26/02	4,274	5,394	–1,120	3,899	2,490	1,409
23/02	5,344	5,831	–487	4,241	2,727	1514
22/02	7,595	9,931	–2,335	6,510	5,451	1,059
21/02	5,860	7,074	–1,214	4,218	2,843	1,375

28న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) కోడిగుడ్లు



(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	385	చెన్నై	395
1వ తేదీకి		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	380

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 408.35 (410.45) 2823115
AMBUJA CEMEN 252.35 (251.40) 3500262
ASIAN PAINTS 1117.75 (1110.35) 1006756
AUROBIND PHA 613.90 (614.40) 1572536
AXIS BANK LT 528.75 (538.40) 6626661
BAJAJ AUTO L 3020.60 (3034.70) 519406
BAJAJ FINANC 1640.25 (1656.80) 1756349
BHARTI AIRTE 428.55 (430.50) 23360784
BHARTI INFRA 346.70 (344.80) 41050485
BOSCH LTD 18687.30 (19017.85) 16160
BPCL 429.55 (426.95) 6071324
CIPLA 589.65 (586.50) 2255189
COAL INDIA L 309.15 (309.00) 3731061
DR. REDDYS 2237.25 (2236.00) 992777
EICHER MOTOR 27437.75 (27154.65) 62724
GAIL 457.50 (457.05) 3198891
HCL TECH 940.30 (949.90) 2559774
HDFC 1808.70 (1828.65) 2802070
HDFC BANK 1884.20 (1902.55) 1016591
HERO MOTOCOR 3596.70 (3585.50) 362559
HINDALCO IND 245.40 (244.30) 8747792
HINDUSTAN UN 1317.75 (1346.35) 1862621
HPCL 380.15 (391.50) 4408388
ICICI BANK 313.25 (322.15) 17481687
INDIABULLS H 1254.10 (1279.75) 1071839
INDIAN OIL 379.30 (377.45) 2103575
INDUSINDBANK 1680.75 (1685.20) 913679
INFOSYS LTD 1172.60 (1150.20) 8634208
ITC 265.05 (266.40) 13451146
KOTAK MAHIND 1090.55 (1093.05) 886902
LARSEN & TOU 1318.15 (1338.10) 2439968
LUPIN 819.95 (826.30) 882036
M&M 728.35 (739.80) 1814444
MARUTI SUZIK 8850.95 (8891.20) 680125
NTPC LTD 163.25 (165.55) 4381524
ONGC 188.30 (188.50) 6147245
POWER GRID C 197.70 (197.75) 3259699
RELIANCE IND 954.55 (950.50) 25898694
SBI 268.00 (267.60) 26810799
SUN PHARMA 535.35 (544.80) 8366660
TATA CONSULT 3035.05 (3042.35) 1353432
TATA MOTORS 369.90 (372.55) 8009429
TATA STEEL L 671.60 (671.75) 7112650
TECH MAHINDR 612.65 (610.55) 2113430
ULTRATECH 4155.60 (4176.10) 160018
UPL LIMITED 728.75 (721.15) 2577819
VEDANTA LIMI 329.75 (340.60) 10566570
WIPRO 292.80 (291.75) 5146717
YES BANK LTD 322.30 (327.15) 10985771
ZEE ENTERTAI 565.35 (576.50) 1239880

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1531.75 (1528.35) 118705
ACC 1623.05 (1632.80) 208350
ASHOK LEYLAN 141.50 (137.70) 24992386
AVENUE SUPER 1348.15 (1354.70) 1695261
BAJAJ FINSER 5051.70 (5121.35) 130485
BANK OFBAROD 141.95 (141.45) 15443300
BEL 154.35 (152.85) 2144271
BHEL 89.90 (91.35) 9655809
BRITANNIA 4994.25 (4952.25) 90480
CADILA HEALT 405.10 (407.90) 653753
COLGATE PALM 1041.10 (1049.15) 412526
CONTAINER 1304.15 (1330.15) 340399
CUMMINS INDI 795.95 (808.45) 538592
DABUR INDIA 325.05 (328.10) 2526442
DLF LIMITED 226.25 (222.45) 6333501
EMAMI LIMITE 1080.00 (1094.15) 58669
GLAXOSMI CON 6696.90 (6733.85) 3725
GLAXOSMI PHA 2384.15 (2393.40) 13950
GLENMARK PHA 544.55 (540.40) 915406
GODREJ CONSU 1070.45 (1091.35) 763744
HAVELLS INDI 507.65 (512.10) 612090
HINDUSTAN ZI 326.45 (329.40) 1309367
ICICI PRU LI 412.80 (413.75) 1102032
IDEA CELLULR 83.90 (84.30) 44965704
INTERGLOBE A 1335.70 (1337.45) 686740
JSW STEEL LT 312.20 (318.10) 6391843
LIC HOUS.FIN 507.80 (509.50) 1426568
MARICO LIMIT 308.15 (312.60) 1018294
MCDOWELL 3291.95 (3279.85) 301953
MOTHERSON 330.00 (327.20) 3376512
MRF 73391.60 (72665.80) 11901
NHPC LTD 27.30 (27.70) 16927917
NMDC LTD 129.35 (131.10) 2830706
OIL INDIA 349.85 (349.15) 409813
ORACLE FIN S 3941.60 (3871.30) 50510
P&G HYG&HEAL 9392.75 (9370.85) 704
PETRONET LNG 247.30 (249.65) 11377512
PIDILITE IND 900.95 (885.80) 1120499
PIRAMAL ENTE 2582.55 (2618.25) 205790
PNB 101.40 (98.35) 210781693
POWER FIN CO 105.10 (107.40) 6866804
RURAL ELEC C 144.30 (145.35) 4295681
SAIL 83.20 (84.25) 13081341
SHREE CEMENT 16623.45 (16859.90) 16897
SHRIRAM TRAN 1333.85 (1348.45) 491204
SIEMENS 1167.90 (1164.05) 189741
SUN TV LTD 927.80 (950.50) 1038261
TATA POWER 84.50 (85.65) 3879178
TITAN IND 816.15 (822.60) 1583674
TORRENT PHAR 1368.65 (1348.35) 424288

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 170.50 (173.80) 571412
ADANI ENTERP 203.55 (207.05) 3876913
ADANI POWER 31.65 (32.05) 5683910
ALL BANK 52.65 (51.70) 4350724
AMARA RAJA 822.25 (815.75) 368236
ANANT RAJIND 55.85 (56.85) 943441
ANDHRA BANK 46.05 (45.05) 3270332
APOLLO HOSPI 1203.05 (1196.70) 438159
APOLLO TYRES 274.55 (264.65) 5332447
APTECH 320.20 (319.45) 646029
BAJAJ ELECT. 527.55 (540.10) 247361
BAJAJ HIND 12.60 (12.70) 1560731
BAJAJ HOLDIN 2723.55 (2737.40) 2512
BALAJI TELE 138.05 (139.05) 78277
BALLARPUR IN 13.50 (13.70) 788199
BALRAMPUR CH 119.75 (119.60) 2351095
BANK OF MAHA 16.80 (16.55) 1415271
BANK OFINDIA 116.20 (118.45) 17307583
BATA INDIA 729.95 (722.65) 514165
BGR ENERGY S 116.85 (117.70) 37841
BHARAT FORGE 789.85 (772.50) 1878047
BHUSHAN STEE 46.45 (47.90) 2834658
BIOCON LTD 630.05 (622.90) 6497436
BOMBAY DYE 258.65 (263.25) 2556758
CANARA BANK 299.25 (295.60) 8276314
CEAT LIMITED 1602.45 (1573.95) 620196
CENTRAL BANK 65.30 (66.40) 462934
CHAMBAL FERT 168.75 (163.90) 1288662
CHENNAI PETR 364.70 (369.50) 462309
CITY UNIBANK 174.80 (172.40) 758251
CORPO BANK 33.55 (32.45) 514614
COX & KINGS 238.75 (238.95) 60888
D B REALTY L 58.10 (57.20) 359916
DELTA CORP L 346.85 (356.90) 1672030
DENA BANK 20.60 (20.70) 1250330
DHANALAKBANK 23.05 (22.85) 289843
DIVIS LAB 1025.90 (1035.55) 362857
EDELWEISS CA 268.75 (265.75) 1899093
EID PARRY 316.55 (313.25) 111882
EIH 173.80 (169.95) 520716
ESSAR SHIPPI 25.40 (25.65) 14143
ESTER INDUST 65.35 (64.50) 90037
EXIDE INDUST 207.40 (209.10) 1861329
FEDERAL BANK 94.25 (95.95) 8361771
FINOLEX CABL 716.95 (710.60) 186133
G E SHIP LTD 365.60 (371.30) 311726
GAMMON INFRA 3.00 (3.05) 2293160
GATI LIMITED 112.15 (113.25) 239504
GAYATRI PROJ 211.70 (212.50) 178136
GITANJALIGEM 21.30 (22.40) 25952
GMR INFRASTR 18.95 (18.75) 37442931
GODREJ IND 551.75 (547.80) 210734
GRASIM IND 1152.70 (1171.95) 1095669
GUJ ALK&CHEM 737.45 (751.30) 122593
HCL INFOSYS 63.90 (64.05) 5890086
HEXA TECH 346.10 (346.05) 786850
HIMACHAL FUT 29.95 (28.75) 8750071
HOUSING DEV 49.90 (50.50) 8749523
IDBI 74.55 (73.50) 49500579
IDFC 52.95 (52.45) 3010224
IFCI 22.65 (22.95) 6200945
IL&FS TRANS 70.65 (70.90) 118660
IND SWIFTLAB 67.45 (67.15) 15002
INDBULLS REL 215.35 (219.50) 3042939
INDIA CEM 159.25 (157.85) 3457355
INDIAN BANK 331.10 (311.65) 4293602
INDO RAMA SY 33.65 (34.35) 118958
INDRAPRASTHA 304.70 (305.20) 2075256
IND-SWIFTLTD 8.60 (8.60) 5726
INGERSOLL-R 723.30 (724.60) 11067
IOB 19.60 (19.60) 875781
IPCA LAB 672.85 (672.90) 158209
IRB INFRA DE 228.60 (233.85) 1240495
J&K BANK 66.60 (67.90) 596201
JAI CORP 157.75 (160.00) 966950
JAIN IRRIGAT 116.95 (119.30) 6000168
JAYPEE INFRA 12.75 (12.35) 5584523
JAYSHREE TEA 100.45 (100.55) 19182
JET AIRWAYS 746.10 (742.70) 1920592
JINDAL SAW 138.35 (138.25) 996756
JINDAL STEEL 254.40 (264.05) 9436525
JK LAKSHMI C 424.85 (435.90) 80816
JK PAPER LIM 139.95 (139.30) 293194
JM FINANCIAL 147.55 (152.80) 1534113
JP ASSOCIATS 17.70 (18.35) 46228999
JSW ENERGY L 80.70 (81.35) 1902068
JUBILANT FOO 2034.00 (2038.35) 498823
JUBILANT ORG 877.50 (889.50) 936503
JYOTHY LABS 343.20 (346.20) 29872
JYOTI STRUC 10.50 (10.45) 127711
KARNATA BANK 135.15 (134.40) 1418092

ఘనం (+)

నిఫ్టీ	28న	మార్పు %
INFOSYS	1172.60	1.95
UPL	728.75	1.05
EICHER MOTORS	27437.75	1.04
ASIAN PAINTS	1117.75	0.67
Bpcl	429.55	0.61
BHARTI INFRATEL	346.70	0.55
CIPLA	589.65	0.54

గ్రహణం (-)

నిఫ్టీ	28న	మార్పు %
VEDANTA	329.75	-3.19
HPCL	380.15	-2.90
ICICI BANK	313.25	-2.76
HUL	1317.75	-2.12
INDIABULLS HSG	1254.10	-2.00
ZEE ENTERTAINMENT	565.35	-1.93
AXIS BANK	528.75	-1.79

KEC INTL LTD 415.25 (411.85) 844213
KOLTE PATIL 349.00 (348.30) 143384
KPIT CUMMINS 216.10 (213.30) 3616429
L&TFIN.HOLD 162.30 (165.60) 2860386
LAK VIL BANK 104.40 (112.20) 2678501
M & M FINANC 432.65 (440.15) 1942695
MANAPPURAM G 107.95 (108.70) 2272248
MMTC LIMITED 52.05 (52.15) 817057
MPHASIS LTD 859.70 (872.55) 242947
MRPL 119.25 (122.65) 974650
MTNL 22.50 (22.60) 656182
NAGARJUNA OI 4.15 (4.05) 553437
NCC LIMITED 131.70 (130.35) 9352932
NETWORK18 FI 50.65 (49.90) 1753072
NEULAND LAB 719.90 (719.10) 11554
NIIT LTD 93.35 (94.40) 584643
NIIT TECHNOL 834.50 (832.80) 1181472
OMAXE LTD 226.40 (225.35) 621104
ONMOBILE GLO 50.10 (50.95) 164725
ORIENT PAPER 41.05 (40.70) 176982
ORIENTALBANK 100.25 (96.05) 15606246
PARSVNATH DE 20.75 (21.15) 338304
PATEL ENGG 71.10 (71.45) 168814
PFIZER 2272.20 (2270.05) 10331
POLARIS SOFT 471.00 (470.75) 58583
POWERTRADING 102.75 (101.10) 1174751
PRAJ IND 90.75 (92.75) 423669
PRISM CEMENT 126.35 (122.85) 753907
PROVOGUE (IN 5.25 (5.50) 529633
PUNJ LLOYD 19.80 (20.25) 1502204
PUNJAB & SIN 38.95 (38.20) 104581
PURAVANKARA 145.05 (143.45) 218111
PVP VENTURES 6.40 (6.65) 423269
PVR LIMITED 1320.45 (1335.50) 271427
RADICO KHAIT 346.80 (348.50) 655869
RAJESH EXPOR 837.55 (793.65) 188741
RALLIS INDIA 231.40 (229.45) 216058
RAMCO IND 256.20 (252.65) 59357
RAMCO SYS 460.20 (460.95) 11614
RAMKY INFRA 201.15 (197.50) 195993
RAYMOND 954.45 (946.60) 520072
RELIANCE CAP 472.25 (473.65) 4016751
RELIANCE COM 28.35 (28.00) 82662554
RELIANCE INF 455.60 (457.70) 1982777
RELIANCE POW 44.70 (44.70) 5336665
ROLTA INDIA 68.90 (69.40) 1031834
SAGAR CEMENT 975.95 (985.80) 1271
SAREGAMA 704.70 (707.10) 43320
SHANTHI GEAR 143.40 (141.65) 12380
SHIPPNG CORP 71.65 (73.10) 685006
SHREE RENUKA 15.65 (15.70) 714054
SINTEX IND 20.65 (20.90) 2338427
SOBHA DEVELO 554.75 (556.35) 177467
SOUTHINDBANK 26.60 (27.00) 5996641
SRS LIMITED 1.15 (1.20) 773203
STERLITE TEC 359.35 (359.15) 1072928
SUJANA METAL 1.40 (1.45) 32194
SUN PHARMA 425.35 (436.45) 386679
SUND FASTNER 564.40 (557.05) 182535
SUZLON ENERG 12.80 (12.95) 29917622
SYND. BANK 61.10 (58.65) 9347185
TATA CHEM 704.65 (703.80) 477028
TATA COFFEE 131.90 (132.95) 209797
TATA COMMUN 642.35 (648.85) 395885
TATA GLOBAL 275.50 (275.00) 2808234
TATA METALIK 810.30 (821.20) 73777
TATA MOT DVR 206.90 (208.80) 1708273
TATA TELESER 6.20 (6.25) 401990
THE INDIAN H 137.15 (138.40) 2016773
TORRENT POWE 264.65 (269.80) 858778
TRIVENI ENGG 64.00 (62.75) 415995
TTK PRESTIGE 6917.55 (6997.45) 2220
TV TODAY NET 465.50 (450.10) 228575
TV18 BROADCA 62.65 (60.70) 12146998
TVS MOTOR 680.95 (677.00) 742459
UCO BANK 25.95 (26.10) 774029
UNION BANK 105.55 (103.05) 12454730
UNITECH 7.05 (7.15) 17264420
UNITED BANK 14.10 (13.50) 2902699
UNITED BREWE 1059.40 (1065.15) 186355
USHA MARTIN 22.45 (23.50) 609017
VADILAL INDU 932.90 (938.00) 51903
VENKYS 3924.25 (3463.30) 971532
V-GUARD IND 242.30 (232.50) 2288986
VIJAYA BANK 59.90 (57.40) 1458530
VIP 338.45 (346.60) 342442
VOLTAS 609.40 (607.20) 1203140
ZEE LEARN LI 40.80 (40.90) 739644
ZUARI GLOBAL 201.80 (207.80) 109808
ZYDUS WELLNE 1251.25 (1268.70) 8091

AISHWARYA TE 5.82 (5.80) 6406
ALPHAGEO 809.15 (809) 1161
AMAR RAJA BA 822.50 (816) 15362
ANDHRA BANK 46.05 (45) 234133
ANDHRA CEMEN 10.91 (10.90) 19448
ANDHRA PAPER 308.50 (314.05) 5363
ANDHRA PETRO 58.90 (59.80) 50595
ANDHRA SUGAR 487.80 (506.40) 2100
ANJANI PORTL 191.30 (192.95) 2335
ASTRA MICROW 90.65 (92) 88532
AUROBINDO PH 613.45 (614.35) 125106
AVANTEL SOFT 533.90 (534.30) 1214
AVANTI FEEDS 2401.95 (2395.20) 8146
BALAJI AMIN 644.55 (657.95) 12227
BARTRONICS 12.88 (13.27) 14458
BHAGIRA CHEM 301.70 (306.40) 21813
BHAGYA NAG 48.65 (50.50) 212768
BRILLIANT SE 11.80 (11.55) 239749
CONT COFFEE 297.45 (298.65) 2325
COROMAN FERT 558.30 (543) 10655
CYIENT LIMIT 636.50 (629.50) 8417
DIVI'S LAB 1023.30 (1035) 118407
DR REDDY 2235.65 (2234.15) 40886
FOUR SOFT 89.85 (92.15) 3668
GATI CORPN 111.75 (113.25) 74368
GAYATRI PROJ 211.55 (212.30) 10028
GMR INFRASTR 18.95 (18.80) 2487550
GOLDST INFRA 217.10 (218.75) 33632
GRANULES (I) 118.40 (117.25) 198172
GSS AMERICA 45.85 (47.50) 200083

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 16.95 (17.15) 485300
HBL NIFE POW 55.55 (56.20) 41295
HYD INDUS 1752 (1738.60) 2397
IDL INDUSTRS 565.30 (567.75) 686
ILFS ENGINEE 43.30 (43.95) 11524
INNAREDY COM 3.06 (3.20) 22472
IVRCL INFRAS 4.45 (4.42) 76447
KAKATIYA CEM 291.80 (294.10) 1866
KAVERI SEED 499.55 (506.20) 13628
KCP LTD 127.40 (130.35) 17493
KERNEX MICRO 41.75 (43.45) 14638
LANCO INDUS 347.35 (351.80) 18479
LANCO INFRAT 1.27 (1.33) 321150
LAURUS LABS 538.35 (532.45) 240052
LOKESH MACH 65.95 (66.30) 3403
MADHUCON PRO 27.35 (27.45) 26851
MIC ELECTRON 7.01 (6.99) 33376
MOLDTK PLA 339.15 (330.95) 641
NAGARJAGRICH 43.50 (44.60) 10951
NATCO PHARMA 799.20 (769.55) 64968
NAVA BH VENT 156.30 (154.50) 15290
NCC 131.35 (130.05) 764483
NCL IND 228.30 (230.60) 4895
NEHA INTER 7.18 (7.44) 16771
NETTLINX 76.60 (78.50) 75723
NIHAR INFO 14.75 (15.50) 192
NILE 803.75 (810.90) 1533
OIL COUNTRY 42.70 (42.50) 3669
PANKAJ POLY 9.60 (10.10) 6145
PANYAM CEMEN 46.40 (47.35) 8474
PENNER IND 58.60 (60.60) 36402
PIONEER DIST 189.40 (186.40) 2865
PITTI LAMIN 93.95 (91.25) 16029
PRISM CEMENT 126.30 (122.55) 82086
PRUDENTL PHA 4.36 (4.33) 108899
RAIN INDUSTR 381 (399.20) 1689102
RAJ PACKAGIN 37.05 (37.20) 6319
SAMKRG PIST 298.80 (302.65) 4847
SATVAH. ISPA 22.55 (22.60) 5777
SMS PHARMA 87.50 (88.40) 10644
SPHERE GLOBA 38.15 (39.95) 8947
SREE RAYAL A 57.20 (57.15) 123981
SRINIVASA SH 60.45 (59.05) 23096
STEEL EXCHAN 30.05 (31) 64033
SUJANA METAL 1.41 (1.40) 38508
SUJANA TOWER 4.14 (3.96) 1004
SURYALAKSH.C 80.05 (78.90) 4998
SUVEN PHARMA 188.35 (190.55) 38039
TANLA 34.70 (31.70) 398380
TERA SOFTWAR 58.40 (56.90) 1708
VAMSHI RUBB 52.70 (54.45) 4413
VICEROY HOTE 15.70 (15.70) 16019
VISAKA IND 689.70 (689.45) 7297
VISTA PHARMA 53.50 (48.95) 862810
VIVIMED LABS 77.35 (76.95) 101527
YBRANT DIGIT 5.05 (5.16) 119721
ZENTECH 117.60 (115.90) 11385

హార్లే డేవిడ్‌సన్ మరో2 బైకులు



లోరైడర్ రూ.12.99 లక్షలు, డీలక్స్ రూ.17.99 లక్షలు

దిల్లీ: అమెరికాకు చెందిన బైకుల తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్ తాజాగా రెండు కొత్త మోడళ్లను ఆవిష్కరించింది. వీటిలో లోరైడర్ ధర రూ.12.99 లక్షలు కాగా డీలక్స్ ధరను రూ.17.99 లక్షలుగా నిర్ణయించారు. అక్టోబరు 2017లో విడుదల చేసిన నాలుగు ఎంవై 18 సాఫ్టైల్ మోడళ్లకు అదనంగా వీటిని విడుదల చేశారు. లోరైడర్ విషయానికొస్తే 19 అంగుళాల ముందు చక్రం, 16 అంగుళాల వెనక చక్రం (రేడియేట్ క్యాస్ట్ వీల్స్), ఏబీఎస్ (యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్)తో రూపొందింది. డీలక్స్ విషయానికొస్తే రెట్రో మోడ్రన్ స్టైల్డ్ ఎల్ఈడీ లైటింగ్ (ముందు నుంచి వెనక్కు), రన్నింగ్ లైట్స్, టూంబ్‌స్టోన్ టెయిల్ తదితర ఫీచర్లతో తయారైంది. రెండు మోడళ్లు కూడా 1745 సీసీ మిల్‌వాకీ-ఎయిట్ 107 ఇంజిన్ సామర్థ్యం కలిగి ఉన్నాయి. లీజర్ రైడింగ్ విభాగంలో ప్రీమియం మోటార్ సైకిళ్ల వృద్ధి కొనసాగుతుందని హార్లే డేవిడ్‌సన్ భారత్, చైనా ఎండీ పీటర్ మాకెంజీ తెలిపారు. కాగా గతంలో విడుదల చేసిన బైకు మోడళ్ల ధరలు సవరించినట్లు సంస్థ తెలిపింది. రోడ్ కింగ్ ధరను రూ.28.37 లక్షల నుంచి రూ.24.99 లక్షలకు తగ్గించారు. అయితే స్ట్రీట్ గ్లైడ్ స్పెషల్ ధరను మాత్రం రూ.29.99 లక్షల నుంచి రూ.33.50 లక్షలకు పెంచారు. రోడ్ గ్లైడ్ స్పెషల్ ధరను రూ.35.61 లక్షల నుంచి రూ32.99 లక్షలకు, సీవీఓ టీఎం ధరను రూ.53.72 లక్షల నుంచి రూ.49.99 లక్షలకు తగ్గించినట్లు హార్లే డేవిడ్‌సన్ సంస్థ వెల్లడించింది.

ఈనాడు బిజినెస్

ఒకే రోజు రూ.460 తగ్గిన పసిడి



దిల్లీ: అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతుండటంతో బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.460 తగ్గి రూ.31,390కి చేరింది. దీంతో నాలుగు రోజుల నుంచి పెరుగుతున్న బంగారం ధరకు కళ్లెం పడినట్లైంది. అంతర్జాతీయ పరిణామాలతోపాటు స్థానికంగా నగల వ్యాపారుల నుంచి బంగారానికి డిమాండ్ తగ్గిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వెండి కూడా కేజీకి రూ.250 పడిపోయి రూ.39,300కి చేరింది. పారిశ్రామిక యూనిట్లు, నాణేల తయారీదారుల నుంచి గిరాకీ తగ్గడమే ఇందుకు కారణమని విశ్లేషకులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు తగ్గడం కూడా ఇక్కడి మార్కెట్లపై ప్రభావం చూపించిందని ట్రేడర్లు చెప్పారు. సింగపూర్‌లో ఔన్సు బంగారం ధర 0.07 శాతం పడిపోయి 1316.80 యూఎస్ డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సుకు 0.37 శాతం తగ్గి 16.32 యూఎస్ డాలర్లకు చేరింది. మన దేశ రాజధాని దిల్లీలో 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.460 తగ్గి రూ.31,390లు కాగా, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం రూ.31,240కి చేరింది. ఇదిలా ఉండగా, గత నాలుగు సెషన్లలో బంగారం ధర రూ.500 పెరిగిన విషయం తెలిసిందే.

రిలయన్స్ ట్రెండ్స్‌కు రానా ప్రచారం

హైదరాబాద్ (అమీర్‌పేట), న్యూస్‌టుడే: ప్రస్తుత ఫ్యాషన్ తీరుకు తగినట్లుగా దుస్తులను విక్రయించడంలో రిలయన్స్ ట్రెండ్స్ ఎప్పుడూ ముందుంటోందని సంస్థ మార్కెటింగ్ విభాగాధిపతి కపిల్ ఖత్తర్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలిపి 60కి పైగా స్టోర్లు ఉన్నాయనీ, వీటిని మరింత విస్తరించేందుకు అవకాశం ఉందని తెలిపారు. బుధవారం రిలయన్స్ ట్రెండ్స్ ప్రచార కర్తగా సినీనటుడు దగ్గుబాటి రానాను నియమించుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 22 నగరాల్లో 430 షోరూములున్నాయని పేర్కొన్నారు. రానాను ప్రచారకర్తగా నియమించుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని వినియోగదారులతో మరింత అనుబంధం పెరుగుతుందన్నారు. అంతర్జాతీయంగా ప్రస్తుత ధోరణులకు తగ్గట్టు రిలయన్స్ ట్రెండ్స్‌లో దుస్తులు లభ్యమవుతున్నాయని రానా పేర్కొన్నారు.



రిలయన్స్ ట్రెండ్స్ ప్రచారకర్తగా నియమితులైన దగ్గుబాటి రానాతో సంస్థ మార్కెటింగ్ అధిపతి కపిల్ ఖట్టర్

ఎయిర్‌సెల్ దివాలా

● పిటిషన్ దాఖలు ● మూసుకుపోయిన దారులు ● పోటీ, రుణాలే కారణమని వివరణ

దిల్లీ

ఆర్థికపరమైన ఒత్తిడులు తీవ్రంగా ఉన్న టెలికాం రంగంలో 'అత్యంత క్లిష్టమైన సమయాల'ను ఎదుర్కొంటున్నామని చెబుతూ టెలికాం ఆపరేటరు ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్ దాఖలు చేసింది. కొత్త ఆపరేటరు రాకతో ధరల యుద్ధం మొదలు కావడంతో రుణాలు, నష్టాలు పెరుగుతూ వచ్చాయని అందులో పేర్కొంది. మలేషియాకు చెందిన మాక్సిస్ కమ్యూనికేషన్స్ బీహెచ్‌డీకి ఎయిర్‌సెల్‌లో 74 శాతం వాటా ఉంది. మొదట రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో విలీనం కావాలని ఈ కంపెనీ ప్రయత్నించినప్పటికీ.. గతేడాది చివర్లో విఫలం అయింది. రూ.15,500 కోట్ల రుణ పునర్నిర్మాణ ప్రయత్నాలు కూడా బెడిసికొట్టాయి. అన్ని దారులూ మూసుకోవడంతో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ముంబయి) దివాలా పిటిషన్ దాఖలు చేసింది.



కంపెనీ గురించి: మలేషియాలోనే మూడో అత్యంత ధనవంతుడైన క్రిష్ణన్ 2005లో ఈ కంపెనీలో మెజారిటీ వాటా కొన్నారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం కోసం అప్పట్లో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. డిసెంబరు చివరకు ఈ కంపెనీకి 8.5 కోట్ల మంది వినియోగదార్లున్నారు. భారత్‌లో ఆరో అతిపెద్ద ఆపరేటరుగా ఉంది.

దివాలా దారి ఇదీ..

- ✦ పోటీ పెరగడంతో తట్టుకోలేని ఈ కంపెనీ ఇటీవలే ఆరు సర్కిళ్లలో గుజరాత్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్(పశ్చిమ)లలో సేవలను నిలిపివేసింది.
- ✦ గత వారం కూడా టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్)కు లేఖ రాస్తూ.. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నట్లు తెలిపింది. అదే సమయంలో తమకు మౌలిక వసతులను అందించే జీటీఎల్ ఇన్‌ఫ్రా మూడో వంతు సైట్లలో సేవలు నిలిపివేయడం కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిందని అందులో అంగీకరించింది.
- ✦ ఆంధ్రప్రదేశ్, అసోం, బిహార్, దిల్లీ, జమ్ము-కశ్మీర్, కర్ణాటక, కేరళ, కోల్‌కతా, ముంబయి, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్(తూర్పు), పశ్చిమ బంగ తదితర లైసెన్సింగ్ సేవల ప్రాంతాల్లో సేవల అంతరాయంతో భారీ స్థాయిలో వినియోగదార్లు అసౌకర్యానికి గురయ్యారు. నంబరు పోర్టబులిటీ ద్వారా వారంతా వేరే ఆపరేటర్లను వెతుక్కున్నారు.
- ✦ ఈ పరిణామంతో ట్రాయ్ సైతం మంగళవారం వినియోగదార్లు సులభంగా వేరే నెట్‌వర్క్‌కు వెళ్లేలా అదనంగా పోర్ట్ అవుట్ కోడ్‌ను ఎయిర్‌సెల్‌కు కేటాయించింది.
- ✦ వీటికి తోడు ఫిబ్రవరి మొదట్లో అంతర్ అనుసంధాన సేవలను ఎయిర్‌సెల్‌కు ఇవ్వబోమంటూ ఐడియా సెల్యులార్ ప్రకటించింది. బకాయిలు చెల్లించకపోవడం ఇందుకు నేపథ్యం. వొడాఫోన్ కూడా ఎయిర్‌సెల్‌కు సేవలను నిలిపివేసినట్లు సమాచారం.

"దివాలా ప్రక్రియ ద్వారా నగదీకరణ చేసుకోవాలని మేం భావించడం లేదు. వెండార్లు, పంపిణీదార్లు, ఉద్యోగులు,.. ఇలా ప్రతి ఒక్కరికి అత్యంత ఉత్తమమైన ప్రయోజనాలను అందించడం కోసం ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న అత్యుత్తమ మార్గాన్ని మేం ఎంచుకున్నాం. వెండార్లు, ఛానెల్ భాగస్వాముల నుంచి సహకారాన్ని కోరుతున్నాం. ప్రస్తుత వ్యాపారం కోసం సేవలను కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం'

- దివాలా ప్రకటన సందర్భంగా ఎయిర్‌సెల్

చివరకు మిగిలేది ఎన్ని?: కొత్త ఆపరేటరు రిలయన్స్ జియో రావడంతోనే అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించడంతో మిగతా ఆపరేటర్లు సైతం వాటిని అందుకోవడానికి ప్రయత్నించాయి. దీంతో వాటి ఆర్థిక పరిస్థితి దెబ్బతినింది. అప్పులు పెరిగాయి. చాలా వరకు చిన్న ఆపరేటర్లు ఒత్తిడిని తట్టుకోలేక.. పెద్ద ఆపరేటర్లలో విలీనం అయ్యాయి. టెలినార్ తన భారత్ వ్యాపారాన్ని భారతీ ఎయిర్‌టెల్‌కు విక్రయించడానికి అంగీకరించింది. అదే సమయంలో భారతీ ఎయిర్‌టెల్ కూడా టాటా టెలీసర్వీసెస్‌కు చెందిన మొబైల్ వ్యాపారాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. డిసెంబరు 2017లో ముకేశ్ అంబానీ తన సోదరుడు అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన స్పెక్ట్రమ్, టవర్లు, ఓఎఫ్‌సీ నెట్‌వర్క్, ఇతరత్రా వైర్‌లెస్ ఆస్తులను కొనుగోలు చేశారు. ఇక వొడాఫోన్, ఐడియాలు విలీన ప్రక్రియలో ఉండడంతో భారత టెలికాం మార్కెట్లో కేవలం మూడు నాలుగు ఆపరేటర్లు మాత్రమే మిగులుతాయని విశ్లేషకులు అంటున్నారు.

థండర్‌బర్డ్ కొత్త బైకులు



దిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ థండర్‌బర్డ్ విభాగంలో థండర్‌బర్డ్ 500 ఎక్స్, థండర్‌బర్డ్ 350 ఎక్స్‌లను తాజాగా ఆవిష్కరించింది. వీటి ధరలను (ఎక్స్ షోరూం, దిల్లీ) రూ.1,98,878 (500 ఎక్స్), 1,56,849 (350 ఎక్స్)లుగా నిర్ణయించింది. థండర్‌బర్డ్ 500 ఎక్స్ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ 499 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో తయారు కాగా, 350 ఎక్స్ 346 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగి ఉంది. వినియోగదారులకు నచ్చేలా మలిచామని రాయల్ ఎన్‌ఫీల్డ్ అధ్యక్షుడు రుద్ర తేజ్ సింగ్ పీటీఐకి తెలిపారు.

పెరిగిన ఎస్‌బీఐ డిపాజిట్ రేట్లు

● 0.75 శాతం వరకు పైకి ● రుణాల రేట్లూ పెరిగే అవకాశం

ముంబయి: రుణరేట్లు పెరిగే సమయం దగ్గర పడింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిపాజిట్ రేట్లను 0.75 శాతం వరకు పెంచడమే ఇందుకు కారణం. తక్కువ మొత్తం (రిటైల్), భారీమొత్తం (బల్క్) డిపాజిట్ రేట్లను 0.75 శాతం వరకు పెంచుతున్నామని, ఇది వెంటనే అమల్లోకి వచ్చిందని ఎస్‌బీఐ వెల్లడించింది. బల్క్ డిపాజిట్ రేట్లను పెంచడం గత 4 నెలల్లో ఇది మూడో సారి.

ప్రస్తుతం నిధుల వ్యయం ఆధారంగా రుణ రేట్లను (ఎంసీఎల్ఆర్) నిర్ణయిస్తున్న సంగతి విదితమే. అంటే బ్యాంకులు నిధులు సమీకరించే వ్యయం (డిపాజిట్ రేట్లు) ఏమాత్రం పెరిగినా, ఆ ప్రభావం రుణరేట్లపై పడుతుంది.

రిటైల్ డిపాజిట్లకు సంబంధించి..

- ✦ రూ.కోటి లోపు మొత్తాలకు 0.50 శాతం వరకు పెంచారు. 1-2 ఏళ్ల కాలావధి రుణాలకు 0.15 శాతం పెంచి 6.40 శాతం చేశారు. ఇప్పటివరకు 6.25 శాతం వడ్డీ చెల్లించేవారు.
- ✦ 2-10 ఏళ్ల కాలావధి డిపాజిట్లకు వడ్డీరేటును 0.50 శాతం పెంచి 6.50 శాతం చేశారు. ఇప్పటివరకు ఈ డిపాజిట్లకు 6 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు.

SBI

బల్క్ డిపాజిట్లకు సంబంధించి..

- ✦ రూ.1-10 కోట్ల మొత్తాలకు, 1-2 ఏళ్ల కాలావధికి 0.50 శాతం పెంచి 6.75 శాతం చేశారు.
- ✦ 2-3 ఏళ్ల కాలావధి రుణాలకు 0.75 శాతం పెంచి 6.75 శాతం వడ్డీ చెల్లించనున్నారు.
- ✦ రూ.10 కోట్లకు మించిన మొత్తాలపై 1-2 ఏళ్ల కాలావధికి 0.50 శాతం పెంచి 6.75 శాతం వడ్డీ చెల్లిస్తామని బ్యాంక్ తెలిపింది.
- ✦ 2-3 ఏళ్ల కాలావధి డిపాజిట్లపై 0.75 శాతం పెంచి, 6.75 శాతం వడ్డీరేటు చెల్లిస్తారు.

బ్యాంకింగ్ రంగాన్ని కాపాడండి

● త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటు చేయండి ● జైట్లీని కోరిన ఏఐబీఈఏ

హైదరాబాద్: బ్యాంకింగ్ రంగాన్ని కాపాడేందుకు పటిష్ఠమైన రక్షణాత్మక చర్యలు చేపట్టేందుకు ఆర్థిక శాఖ, బ్యాంకు యాజమాన్యాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలతో త్రైపాక్షిక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం కోరారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారులను ఏకమొత్తంగా బదిలీలు చేయకూడదని విన్నవించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో నీరవ్ మోదీ కుంభకోణం నేపథ్యంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ఆయన లేఖ రాశారు. బ్యాంకులోని వివిధ స్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యంగా ఈ కుంభకోణం జరిగిందని అంటున్నారు.. కానీ, అత్యున్నత స్థాయి ఆడిటర్లను ఎవరూ ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఇటీవల సీవీసీ సూచనల మేరకు యాజమాన్యాలు.. ఉద్యోగులనూ, అధికారులను బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ, ఈ నెలలో ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఈ బదిలీలు ప్రతి బ్యాంకుకూ ఒక సమస్యగా మారనున్నాయని తెలిపారు. పైగా ఉద్యోగుల పిల్లలు పరీక్షలు రాసే సమయం కూడా ఇదేనని దీన్నీ దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. మార్చి 15న యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ తరపున తలపెట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెను స్వచ్ఛందంగా విరమించుకున్నట్లు తెలిపారు.

చౌక గృహ రుణాలకూ ఎగవేత ముప్పు!

క్రిఫ్ హైమార్క్ నివేదిక

ముంబయి: ఓ వైపు అందుబాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం మంచి ప్రోత్సాహం ఇస్తుండగా.. మరో వైపు మాత్రం ఆ రుణాలు ఎగవేతకు గురయ్యే అవకాశం ఉందని ఓ నివేదిక అంటోంది. నవంబరు 2017 నాటికి మొత్తం గృహ రుణాల్లో 1.96 శాతం మేర రుణాలు 90 రోజులుగా బకాయిలు చెల్లించడం లేదు. రూ.25 లక్షల్లోపు గృహ రుణాల(అందుబాటు గృహ విభాగం)ల్లోనూ ఇవి 2.33 శాతంగా ఉన్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిఫ్ హైమార్క్ పేర్కొంది. ఇంకా ఆ నివేదిక ఏమందంటే..

* రూ.10 లక్షల్లోపు గృహ రుణాల విషయానికొస్తే 90 రోజులుగా బకాయిలు చెల్లించనివి 4 శాతంగా ఉన్నాయి. పరిశ్రమ సగటుతో పోలిస్తే రెట్టింపు ఇది.

- ✦ మొత్తం గృహ రుణాలు రూ.15.8 లక్షల కోట్లుగా ఉండగా.. అందులో అందుబాటు గృహ రుణాల వాటా 50 శాతం(రూ.7.79 లక్షల కోట్లు)గా ఉంది.
- ✦ బ్యాంకింగ్ వ్యవస్థలో గృహ రుణాల ద్వారా ఏర్పడిన నిరర్థక ఆస్తులు ఏప్రిల్ నుంచి చూస్తే 13.6 శాతం మేర పెరిగాయి.
- ✦ విదేశీ బ్యాంకులు సైతం రూ.10 లక్షల్లోపు గృహ రుణాల విషయంలో 16.2 శాతం మొండి బకాయిలను ఎదుర్కొంటున్నాయి. మొత్తం మొండి బకాయిల్లో వీటి భాగం చాలా తక్కువే అయినప్పటికీ.. వీటికి గృహ రుణాల విషయంలో అధిక ఒత్తిడి ఉంటోంది.
- ✦ మార్చి 2016 నాటికి మొత్తం గృహ రుణాల విభాగంలో 90 రోజుల పాటు చెల్లించకుండా ఉన్నవి 1.36 శాతంగా ఉన్నాయి. ఆ తర్వాత అవి పెరుగుతూ వచ్చాయి. జూన్ 2017కు 1.89 శాతం; సెప్టెంబరు 2017కు 1.96 శాతానికి పెరిగాయి.
- ✦ దిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో గృహ రుణ రంగంలో అధిక ఒత్తిడి ఉంటోంది. అందుబాటు గృహ రుణాల విషయానికొస్తే కోల్‌కతా, చెన్నై, ఘజియాబాద్‌లలో ఎక్కువ ఒత్తిడి కనిపిస్తోంది.
- ✦ మొత్తం రూ.15.78 లక్షల కోట్ల గృహ రుణాల్లో అతిపెద్ద గృహ రుణ మార్కెట్ అయిన మహారాష్ట్ర వాటా 23 శాతంగా ఉంది.
- ✦ గృహ రుణ కంపెనీలు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొత్తం గృహ రుణాల్లో 40 శాతం చొప్పున వాటాలున్నాయి. అయితే గృహ రుణ కంపెనీలు పెద్ద స్థాయి గృహ రుణాలిచ్చే విషయంలో బలంగా ఉండగా.. ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణాల్లో అందుబాటు రుణాలే 59 శాతంగా ఉన్నాయి.

ఈ ఏడాది 7.6% వృద్ధి: మూడీస్

దిల్లీ: ఈ ఏడాది (2018) భారత జీడీపీ వృద్ధి 7.6 శాతం ఉంటుందని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ అంచనా వేసింది. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు తొలిదశలో ఎదురైన ఇబ్బందుల నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకుని, పునరుత్తేజితం అవుతోందని పేర్కొంది. 2018, 2019 సంవత్సరాలకు సంబంధించి అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై అంచనా నివేదికలను సంస్థ విడుదల చేసింది. పెద్దనోట్ల రద్దు వల్ల తీవ్రంగా ఇబ్బంది పడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి ఉపకరించే పథకాలను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2018-19 బడ్జెట్‌లో ప్రవేశపెట్టారని పేర్కొంది. ఇప్పటికే ఆర్థిక పునరుత్తేజం ప్రారంభమైనందున 2018లో 7.6 శాతం, 2019లో 7.5 శాతం వృద్ధిరేటును భారత్ సాధిస్తుందని, అందువల్ల గత అంచనాలను ఏమీ సవరించలేదని తెలిపింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధన పునర్‌వ్యవస్థీకరణ పథకాన్ని ప్రవేశ పెట్టినందున, రుణాలు అధికంగా ఇచ్చేందుకు బ్యాంకులకు వీలవుతుందని, ఇందువల్ల పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వృద్ధికి ఉపకరిస్తుందని వివరించింది.

ద్రవ్యలోటుపై జాగ్రత్త సుమా



● ద్రవ్యలోటుపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి హెచ్చరిక

● ముడి చమురు ధరలు తగ్గేంత వరకూ సవాలే

సింగపూర్: ముడి చమురు ధరలు పెరుగుతూ ఉన్న నేపథ్యంలో ద్రవ్యలోటు విషయంలో భారత్ జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరించారు. కేంద్ర బడ్జెట్ 2018-19లో పెంచిన దిగుమతి టారిఫ్ వల్ల 'భారత్‌లో తయారీ' స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆయన అన్నారు. 1991లో చెల్లింపుల సంక్షోభం; 2013లో సంక్షోభానికి దగ్గరగా వెళ్లడం.. ఈ రెండు పరిణామాలూ ద్రవ్యలోటు ప్రభావాన్ని గుర్తించలేకపోవడం వల్లే జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారమిక్కడ జరిగిన మూడో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఆసియాన్ స్టడీస్(ఐఎస్ఏఎస్) లెక్చర్' సందర్భంగా ఆయన మాట్లాడారు. దువ్వూరి ఇంకా ఏమన్నారంటే..

గత నాలుగేళ్లుగా అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గుతూ ఉండడంతో అటు ద్రవ్య, ఇటు కరెంట్ ఖాతా లోటులు అదుపులో ఉన్నాయి. ఇపుడు ఆ ధరలు పెరుగుతుండడంతో అప్పటిలా పరిస్థితి లేదు. బడ్జెట్లో ద్రవ్య స్థిరీకరణ విషయాన్ని ఆర్థిక మంత్రి విస్మరించడం కూడా ఆందోళన కలిగిస్తోంది. పైగా కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచారు కూడా. అధిక దిగుమతి సుంకాల వల్ల దేశీయ తయారీని దెబ్బకొట్టడమే అవుతుంది.

2001-16 మధ్య చైనాతో భారత వాణిజ్య లోటు 1 బిలియన్ డాలర్ల(ఇప్పటి మారక విలువ ప్రకారం.. దాదాపు రూ.6500 కోట్లు) నుంచి 50 బిలియన్ డాలర్ల(రూ.325000 కోట్లు)కు పెరిగింది. ఇది చైనా తీసుకున్న విధానాల వల్ల జరిగింది. ఆ సమయంలో రూపాయి యువాన్‌తో పోలిస్తే 70 శాతం తగ్గింది. అది భారత్‌కు ప్రయోజనంగా మారి ఉండాలి. అంతర్జాతీయాకరణ అనేది భారీ అవకాశాలనే కాదు.. ఒక్కోసారి కఠిన సవాళ్లనూ ఇస్తుంది. భారత్ కానీ.. ఏ దేశమైనా కానీ ప్రపంచంతో మిళితమైనపుడు ప్రయోజనాలను గరిష్ఠంగా.. వ్యయాలను కనిష్ఠంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీని ఎదుర్కోవడం కూడా సవాలే. అది ప్రతీ దేశానికి.. ప్రపంచానికి మేలు చేసే అంశమే. అంతర్జాతీయ సదస్సుల్లో అంతర్జాతీయ అంశాలపై చర్చించే విషయంలో భారత్ తన నైపుణ్యాలను పెంచుకుంటే.. అంతర్జాతీయాకరణ ద్వారా ప్రయోజనాలను పొందొచ్చు.

కంచి పీఠాధిపతి అస్తమయం

గుండెపోటుతో జయేంద్ర సరస్వతి కన్నుమూత



బుధవారం కంచిలో జయేంద్ర సరస్వతికి నివాళి అర్పిస్తున్న భక్తులు

కాంచీపురం – న్యూస్‌టుడే

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి (83) బుధవారం తమిళనాడులో మరణించారు. కాంచీపురంలోని పీఠానికి 69వ అధిపతిగా వ్యవహరిస్తున్న జయేంద్ర కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కడపటిగా భక్తులకు దర్శనమిచ్చారు. గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్, రాష్ట్ర మంత్రి సెంగోటయ్యన్‌లు కూడా జయేంద్ర సరస్వతిని అదేరోజు దర్శించుకున్నారు. కాగా తన గదిలోకి వెళ్లి నిద్రకు ఉపక్రమించిన స్వామి అర్ధరాత్రి దాటిన తరువాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో భక్తులు హుటాహుటిన సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా.. గుండెపోటు వచ్చి ఉదయం 7 గంటల ప్రాంతంలో స్వామి మహా నిర్యాణం చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తొలుత దీన్ని ఆసుపత్రి వర్గాలు గోప్యంగా ఉంచినప్పటికీ.. తరువాత బయటకు పొక్కడంతో వెంటనే స్వామి పార్థివదేహాన్ని అంబులెన్స్‌లో శంకరమఠానికి తరలించారు. అప్పటికే అక్కడికి భక్తులు భారీగా తరలివచ్చారు. జయేంద్ర సరస్వతి పార్థివదేహానికి మఠం ఉత్తరాధికారి శంకర విజయేంద్ర సరస్వతి పూజలు చేశారు. స్వామి దర్శనమిచ్చే గదిలోనే ఆయన పార్థివదేహాన్ని ఉంచగా.. భక్తులు కన్నీటి పర్యంతం అయ్యారు.

నేడు అంతిమ సంస్కారాలు..

భక్తుల సందర్శనార్థం గురువారం ఉదయం వరకు జయేంద్ర సరస్వతి పార్థివదేహాన్ని ఉంచి, అనంతరం మఠం ప్రాంగణంలోనే బృందావన ప్రవేశ కార్యక్రమం (అంతిమ సంస్కారాలు) నిర్వహించనున్నట్లు మఠం వర్గాలు తెలిపాయి.

పేరు ప్రఖ్యాతులు.. ఆటుపోట్లు..

కంచి కామకోటి పీఠాధిపతిగా ఎంతో ఖ్యాతిని ఆర్జించిన జయేంద్ర సరస్వతి అనేక ఆటుపోట్లు కూడా ఎదుర్కొన్నారు. స్వామి అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవన్. మన్నార్‌గుడి సమీపంలోని ఓ చిన్న గ్రామమైన ఇరుళ్‌నీక్కిలో ఆయన జన్మించారు. వేద విద్యాభ్యాసం చేసిన ఆయన 1954లో అప్పటి పీఠాధిపతి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి నుంచి సన్యాసంతో పాటు.. పీఠం బాల శంకరాచార్యులుగా బాధ్యతలు స్వీకరించారు. 40 సంవత్సరాల తరువాత చంద్రశేఖరేంద్ర సరస్వతి నిర్యాణం అనంతరం (1994లో) జయేంద్ర పీఠాధిపతి బాధ్యతలు స్వీకరించారు. సమాజంలోని వివిధ వర్గాలకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో మఠంలోని కొన్ని సత్సంప్రదాయాలను దూరం చేశారన్న విమర్శలూ ఎదుర్కొన్నారు.

హఠాత్తుగా అదృశ్యం..

1987 ఆగస్టులో జయేంద్ర అకస్మాత్తుగా మఠం నుంచి అదృశ్యం కావటం సంచలనం కలగజేసింది. దీంతో దేశవ్యాప్తంగా భక్తులంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన కోసం వెతుకులాట ప్రారంభమైంది. 3 రోజుల తర్వాత ఆయన తలైకావేరీ (కర్ణాటక)లో ప్రత్యక్షమయ్యారు. ఈ నేపథ్యంలో పీఠానికి పరంపర వారసుడిగా, 70వ అధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతిని నియమించారు. తిరిగి వచ్చిన జయేంద్ర మళ్లీ మఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. తన అదృశ్యంపై జయేంద్ర అనంతరం వివరణ ఇస్తూ - తాను ఆకస్మికంగా వెళ్లిపోలేదని, తిరుపతిలో ధ్యానం పొందుతున్న సమయంలో దేవుడు 2 అంశాలపై సందేశం ఇచ్చినట్లు తెలిపారు. మొదటిది - ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా దేశాన్ని మేల్కొలిపేలా ఉద్యమం చేపట్టడం, రెండోది - సంకల్పం తీసుకోవడం.. వీటిని ఎవరికైనా చెబితే ఆటంకం కలిగిస్తారనే ఎవరికీ చెప్పకుండా వెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఆయన 'జన కల్యాణ్.. జన జాగరన్' (ప్రజలకు సేవ చేయడం, మేల్కొలపడం) ఉద్యమాన్ని ప్రారంభించారు. అయితే ఇది మతపరమైన ఉద్యమం కాదని.. పలువురు క్రైస్తవులు, ముస్లింలు కూడా చేరినట్లు ఆయన చెప్పేవారు. శంకరాచార్యులుగా ఉన్నవారు తమ చేతుల్లోని దండాన్ని విడిచి పెట్టకూడదనేది సంప్రదాయం.. అయితే ఆ దండాన్ని, కమండలాన్ని ఆయన విడిచిపెట్టి అప్పట్లో వెళ్లిపోయారు. అలాగే చాతుర్మాస పూజాకాలంలో పీఠాధిపతులు బయటకు వెళ్లకూడదనే వ్రతాన్ని కూడా అతిక్రమించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు.



బుధవారం కంచిలో జయేంద్ర సరస్వతికి నివాళి అర్పించేందుకు వస్తున్న భక్తులు

రాజకీయ సాన్నిహిత్యం..

జయేంద్ర సరస్వతి క్రమేపీ అత్యంత ప్రభావశీలిగా మారి.. రాజకీయ నాయకులకు, ప్రత్యేకించి భాజపా నేతలు, మాజీ ముఖ్యమంత్రి జయలలిత తదితరులకు చేరువయ్యారు. 1996 సాధారణ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసేముందు ఆమె స్వామి ఆశీస్సులు కూడా తీసుకున్నారు. అలాగే తమిళనాడులోని ఆలయ ఆస్తుల పరిరక్షణకు ఏర్పాటైన రాష్ట్రస్థాయి కమిటీకి ఆయన అధిపతిగా కూడా నియమితులయ్యారు. బలవంతపు మతమార్పిడులను నిరోధిస్తూ.. అత్యవసరాదేశాలను తీసుకురావడంలో జయలలితను ఒప్పించడంలో కూడా ఆయన కీలకంగా వ్యవహరించినట్లు అప్పట్లో అనుకునేవారు. అనంతర పరిణామాల్లో ఆమె హయాంలోనే స్వామిని అరెస్టు చేశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా-అన్నాడీఎంకే కూటమి ఓడిపోగా అహంకారమే దీనికి కారణమని ఓ ఇంటర్వ్యూలో జయేంద్ర సరస్వతి వ్యాఖ్యానించారు. ఇది జయలలితకు ఆగ్రహాన్ని తెప్పించింది. అప్పటివరకు అన్నాడీఎంకేకి దగ్గరగా ఉన్న జయేంద్రను క్రమంగా ఆ పార్టీకి దూరం చేసింది.

హత్యకేసుతో ఉక్కిరిబిక్కిరి..


కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతితో నెలకొన్న విభేదాల నేపథ్యంలో.. కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయ మేనేజర్ శంకరరామన్ 2004 నవంబరులో హత్యకు గురయ్యారు. అదే సమయంలో కాంచీపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి జయలలిత.. ఈ కేసుతో సంబధం ఉందనే అనుమానంతో అప్పటి జిల్లా ఎస్పీ ప్రేమ్ కుమార్‌ను పిలిపించి జయేంద్ర సరస్వతిని వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో అప్పటికి మహబూబ్‌నగర్‌లో ఉన్న జయేంద్ర సరస్వతిని ఎస్పీ అరెస్టుచేసి కాంచీపురం కోర్టులో హాజరుపరిచారు. తరువాత విజయేంద్ర సరస్వతిని కూడా పోలీసులు శంకరరామన్ హత్యకేసులో అరెస్టు చేశారు. 2005 జనవరిలో సుప్రీం కోర్టు బెయిలు మంజూరు చేయడంతో ఇద్దరూ విడుదలయ్యారు. తరువాత ఈ కేసు చెంగల్పట్టు కోర్టులో కొనసాగింది. కేసు కొనసాగుతున్న సమయంలో పీఠాధిపతులు శంకర మఠానికి వెళ్లకుండా బయటి ప్రాంతాల్లోనే ఉండేవారు. తమిళనాడులో ఈ కేసు విచారణ జరిగితే పీఠాధిపతులు ప్రభావితం చేస్తారనే అనుమానంతో కేసు తదుపరి విచారణను పుదుచ్చేరికి బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులిచ్చింది. తరువాత ఈ కేసు విచారణ తొమ్మిదేళ్ల పాటు సాగింది. 2013 నవంబరు 27న శంకర రామన్ హత్యకేసు నుంచి పీఠాధిపతులను విముక్తి చేస్తూ పుదుచ్చేరి కోర్టు తీర్పునిచ్చింది.

విద్యా కుసుమాలు..

శంకర మఠం ఆధ్వర్యంలో కాంచీపురం సమీపంలోని ఏణాత్తూరులో పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర విశ్వ మహా విద్యాలయం, శంకర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలతో పాటు దేశవ్యాప్తంగా అనేక వేద పాఠశాలలు, విద్యా సంస్థలను జయేంద్ర నెలకొల్పారు. వీటిద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు.

ప్రముఖుల సంతాపం..

జయేంద్ర సరస్వతి మహా నిర్యాణం పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశం ఓ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘ సంస్కర్తను కోల్పోయిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. జయేంద్ర సరస్వతి లక్షలాది భక్తుల మనసుల్లో జీవించి ఉంటారని మోదీ సంతాపం తెలిపారు. జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం మానవాళికి తీరని నష్టమని గవర్నర్ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక గురువుగా ఉంటూ, కంచి పీఠాన్ని బలమైన సంస్థగా ఆయన తీర్చిదిద్దారని అన్నారు. పాఠశాలలు, వృద్ధాశ్రమాలు, గోశాలలు, కంటి, పిల్లల ఆసుపత్రులు నడుపుతూ ప్రజాసేవలో తరించారని కొనియాడారు. జయేంద్ర సరస్వతి ఆధ్యాత్మిక సేవలను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. జయేంద్ర సరస్వతి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక బృందాన్ని పంపించాలని కేసీఆర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు దేవాదాయశాఖ అధికారుల బృందం తమిళనాడు బయల్దేరి వెళ్లింది. జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



జననం: 18 జులై 1935
తమిళనాడు తంజావూరు జిల్లా ఇరుళ్‌నీక్కి

చైనా ఆదరించిన తొలి మతగురువు

అపర శంకరాచార్య, హిందూ సనాతన ధర్మ పరిరక్షుడు, కంచి కామకోటి పీఠం 69వ పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి జీవితం... ఆధ్యాత్మికత, సేవాతత్పరతల సమ్మేళనం. శంకర మఠం గౌరవ ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేయడంలో నిర్విరామంగా శ్రమించిన జయేంద్ర సరస్వతి జీవితంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

తల్లిదండ్రులు పెట్టిన పేరు: సుబ్రహ్మణ్యం

విద్యాభ్యాసం: కంచి ఆదిశంకరుల సన్నిధిలోనే వేద విద్యను అభ్యసించారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి సలహా మేరకు మహదేవ అయ్యర్ తన తనయుడు సుబ్రహ్మణ్యంను కంచిలో చేర్పించారు.

తల్లిదండ్రులు

మహదేవ అయ్యర్ (దక్షిణ రైల్వేలో ఉద్యోగి), సరస్వతి (ఈమె అయ్యర్ రెండో భార్య. మొదటి భార్య మృతిచెందడంతో ఈమెను వివాహం చేసుకున్నారు.)

కంచి పీఠానికి వారసుడిగా ఎంపిక

1948లో జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి...సుబ్రహ్మణ్యమే తనకు తగిన వారసుడని నిర్ణయించారు. అతని తండ్రిని పిలిచి నిర్ణయాన్ని చెప్పారు. దానికి అయ్యర్ అంగీకరించారు.

కన్యాకుమారి నుంచి హరిద్వార్ వరకు ఆయన తండ్రితో కలిసి తీర్థ యాత్రలు చేసి వచ్చాక, 1954 మార్చి 22న సన్యాస ఆశ్రమ దీక్ష తీసుకున్నారు. ఆ రోజునే సుబ్రహ్మణ్యం ప్రాపంచిక బంధాలను తెంచుకొన్నారు. పరమాచార్యులు ఆయనకు సన్యాసాశ్రమ చిహ్నమైన కాషాయ వస్త్రధారణ చేయించి తనకు వారసుడిగా, కంచి కామకోటి పీఠానికి 69వ పీఠాధిపతిగా ప్రకటించారు. జయేంద్ర సరస్వతిగా దీక్షానామాన్ని ఇచ్చారు. అప్పటికి అతని వయస్సు 19 సంవత్సరాలు.

పాదయాత్ర..

1970లో జయేంద్ర సరస్వతి భారతదేశ విజయ యాత్ర ప్రారంభించారు. కాంచీపురం నుంచి పాదయాత్ర మొదలుపెట్టి బద్రీనాథ్, కేథారీనాథ్ వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. తరువాత పశుపతినాథ్ దర్శనం కోసం నేపాల్ వెళ్లారు. ఈ యాత్రలు సనాతన ధర్మాన్ని ప్రచారం చేయడానికి ఉద్దేశించినవే. ఈశాన్య రాష్ట్రాలు సహా అనేక ప్రాంతాల్లో దేవాలయాలను ప్రతిష్ఠించారు. జన కళ్యాణ్, జనజాగరణ్ లాంటి కార్యక్రమాలు ప్రారంభించారు. 1999లో నేపాల్ పర్యటించినప్పుడు హిందూ, బౌద్ధ సమైక్యతా సమావేశాన్ని ప్రారంభిస్తూ.. రెండు మతాలలో ఉన్న సామీప్యతను వివరిస్తూ ప్రసంగించారు.

మతగురువుకు కమ్యూనిస్టు దేశం ఆహ్వానం

ఆదిశంకరుల తరువాత 1998లో మానస సరోవరం దర్శించిన మొట్టమొదటి శంకరాచార్యులుగా జయేంద్ర సరస్వతి కీర్తి గడించారు. చైనా ప్రభుత్వం జయేంద్ర రాక సందర్భంగా అన్ని సౌకర్యాలతో పాటు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేసింది. చైనా చరిత్రలోనే మొదటిసారి ఒక మతగురువు కార్యక్రమాలను వారి దేశ ప్రజల కోసం టీవీలో ప్రసారం చేశారు. మళ్లీ రెండోసారి 2001లో అక్టోబరులో చైనా.. జయేంద్ర సరస్వతిని తమ దేశానికి ఆహ్వానించింది. కమ్యూనిస్టు దేశం ఒక మత గురువును ప్రత్యేకంగా ఆహ్వానించడం కూడా అదే మొదటిసారి.

వారసుడి ఎంపిక

1983 మే 29న జయేంద్ర సరస్వతి 13 సంవత్సరాల వయస్సున్న శ్రీ శంకర్‌ను 70వ పీఠాధిపతిగా నిర్ణయించి అతనికి శంకర విజయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. ప్రస్తుతం శంకర విజయేంద్ర సరస్వతి కంచి మఠం ఉత్తరాధికారిగా ఉన్నారు.

భక్తుల కోర్కె మేరకు 1995 జనవరి 19న జయేంద్ర సరస్వతిని పీఠం సింహాసనంపై ఆశీనులు చేయించి శంకర విజయేంద్ర సరస్వతి రత్నఖచిత స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు.

సేవా స్ఫూర్తి

1993లో కాంచీపురంలో శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయాన్ని జయేంద్ర సరస్వతి ఏర్పాటు చేశారు. అక్కడ వర్తమాన సమాజానికి అవసరమైన ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, కంప్యూటరు అప్లికేషన్స్, బిజినెస్ మెనేజ్‌మెంట్ కోర్సులు నేర్పిస్తారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వేద పాఠశాలలు ఏర్పాటుచేసి సనాతన, ఆధ్యాత్మిక అంశాలతో వేదాల పైన శిక్షణ ఇస్తున్నారు. ప్రజారోగ్యానికి జయేంద్ర సరస్వతి పెద్ద పీట వేశారు. అందులో భాగంగా ఆధునిక వసతులతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆస్పత్రులు నెలకొల్పారు. తమిళనాడులోని అంబాసముద్రం, కడలూరు, కృష్ణగిరి, కుంభకోణం ప్రాంతాల్లో 21 హిందూ మిషన్ ఆస్పత్రులు నెలకొల్పారు. కోల్‌కతాలో కంచి శంకర మెడికల్ సెంటర్, కోయంబత్తూరులో కంచి శంకర ఐ ఇన్‌స్టిట్యూట్, గువహాటిలో కంచి శంకర హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ తరపున నేత్ర వైద్యశాలలను ఏర్పాటు చేశారు. నేపాల్ సరిహద్దులో, బిహార్‌లోని మధుబని వద్ద నేత్ర వైద్యశాల, బద్రీనాథ్ వెళ్లే దారిలో ఒక జనరల్ ఆస్పత్రిని నెలకొల్పి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

– కాంచీపురం, న్యూస్‌టుడే

బాసర అభివృద్ధికి త్వరలోనే బృహత్ ప్రణాళిక

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి త్వరలోనే బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)ను తయారు చేయించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. ఆగమశాస్త్ర పండితులతో చర్చించి వారి సూచనలకు అనుగుణంగా ప్రణాళికను రూపొందిస్తామని బుధవారమిక్కడ పేర్కొన్నారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లను ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలను తెలిపారు. కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మహానిర్యాణంపట్ల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సనాతన భారతీయ ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనయాడారు.

గవర్నర్‌తో అమెరికా రాయబారి భేటీ

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో అమెరికా రాయబారి కెన్నత్ జూస్టర్ హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డాతో కలిసి బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే ఈ భేటీ జరిగినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

గవర్నర్ హోలీ శుభాకాంక్షలు: గురువారం హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.

ప్రతిభాపురస్కారాల దరఖాస్తుల గడువు పెంపు

తెలంగాణలోని ఉన్నతాధికారులకు ఇచ్చే ప్రతిభా పురస్కారాల(తెలంగాణ ఎక్స్‌లెన్స్ అవార్డుల)కు దరఖాస్తు చేసుకునే గడువును మార్చి మూడో తేదీ వరకు ప్రభుత్వం పొడగించింది. సాధారణ, ఆవిష్కరణ, ప్రతిష్ఠాత్మక విభాగాల కింద వ్యక్తిగత, సమూహం, సంస్థల కేటగిరిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఆర్థిక సంక్షోభంలో తెలంగాణ రైతులు

- సీఎం కేసీఆర్ కారణంగానే సమస్యలు
- ఆత్మహత్యలకు కారణాలేమిటనే విశ్లేషణా కరవైంది
- ప్రజాచైతన్య యాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, జహీరాబాద్: 'తెరాస ప్రభుత్వ హయాంలో నాలుగు వేల మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారు. బాధిత కుటుంబాలను ముఖ్యమంత్రి, మంత్రులెవ్వరూ పరామర్శించలేదు. కనీసం ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణాలు ఏమిటనే అంశాలనూ విశ్లేషించకుండా అమానవీయంగా వ్యవహరిస్తున్నారు' అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన రూ.5 లక్షల కోట్ల బడ్జెట్లలో రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. సీఎం నిర్లక్ష్య వైఖరి కారణంగా తెలంగాణలో వ్యవసాయం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా బుధవారం ఉదయం సంగారెడ్డి పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం సదాశివపేట మండలం బొబ్బిలిగామలో రెండురోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న రైతు శ్రీశైలం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నేతలు కుంతియా, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డిలతో కలిసి వారికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. ఆ తర్వాత జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఉత్తమ్ ప్రసంగించారు. నాలుగేళ్లుగా రైతుల గురించి పట్టించుకోకుండా.. ఇప్పుడు ఎకరాకు రూ.4 వేలు ఇస్తామని చెబుతుండటం కేవలం ఎన్నికల గిమ్మిక్కుగా అభివర్ణించారు. రైతు సమన్వయ సమితులు తెరాస పార్టీ కమిటీలేనన్నారు. వీటి ద్వారా డబ్బులు పంపిణీ చేసి ప్రయోజనం పొందాలన్నదే సీఎం కేసీఆర్ ఎత్తుగడగా అభివర్ణించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ సమితులను రద్దు చేస్తామని ప్రకటించారు. డిసెంబరులో జరగనున్న ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ అధికారం చేపడుతుందని, లేనిపక్షంలో తాను రాజకీయాల నుంచి వైదొలుగుతానన్నారు. 106 స్థానాలను కైవసం చేసుకుంటామని చెబుతున్న సీఎం కేసీఆర్ అలా జరగకపోతే ఇదే పని చేస్తారా? అంటూ ఆయన ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణలో పండించే 17 ప్రధాన పంటలకు మంచి ధర ఇచ్చి రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు పెట్టిన అంబేద్కర్ పేరును ఎందుకు తొలగించారో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కేవలం ఆరు శాతం కమీషన్ల కోసం కొన్ని పథకాలకే మొత్తం నిధులు కేటాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక వీటన్నింటిపైనా సమీక్షిస్తామన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో జరిగిన సభలో సీఎం నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా రైతుల గురించి మాట్లాడారని ఎద్దేవా చేశారు. కేంద్రం రైతులను చిన్నచూపు చూస్తోందని ఇప్పుడు మాట్లాడుతున్న కేసీఆర్ మరి విభజన హామీల గురించి భాజపాను ఎందుకు నిలదీయడం లేదన్నారు. ఏమాశించి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారో.. ఆ ఆశయాలకు విరుద్ధంగా కేసీఆర్ అన్ని వర్గాలనూ మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి కుంతియా అన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు గీతారెడ్డి, సురేష్ షెట్కార్, భట్టి విక్రమార్క, మల్లు రవి, సురేష్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ, సబితాఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, విజయరామారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు విరామం.. 4 నుంచి పునః ప్రారంభం

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన ప్రజా చైతన్య బస్సుయాత్ర తొలివిడతలో విరామం లభించింది. హోలీ పండుగను పురస్కరించుకుని మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు యాత్రకు విరామం ప్రకటించారు. ఫిబ్రవరి 26న చేవెళ్లలో ప్రారంభమైన తొలి విడత బస్సుయాత్ర ఇప్పటి వరకు చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ వరకు సాగింది. మూడు రోజుల విరామం అనంతరం మార్చి 4న బస్సుయాత్ర తిరిగి ప్రారంభమై 9వ తేదీ వరకు కొనసాగుతుంది. శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత రెండో విడత బస్సుయాత్ర ప్రారంభిస్తామని టీపీసీసీ ఇది వరకు ప్రకటించిన విషయం తెలిసిందే.



బొబ్బిలిగామలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కుంతియా, షబ్బీర్‌అలీ, జగ్గారెడ్డి

ఛాంపియన్స్



నాదల్ వల్లే నేనిలా..

లండన్: ఆటగాడిగా తన ఎదుగుదలలో తన చిరకాల ప్రత్యర్థి రఫెల్ నాదల్ పాత్ర ఉందని అంటున్నాడు స్విస్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్. నాదల్ లాంటి బలమైన ఆటగాడితో ఎక్కువసార్లు తలపడటం వల్ల తన ఆట మెరుగైందని రోజర్ చెప్పాడు. "నా ప్రత్యర్థి రఫాకు ధన్యవాదాలు. మా మధ్య గొప్ప పోరాటాలు జరిగాయి. అలాంటి ఆటగాడు ప్రత్యర్థి కావడం వల్ల నేను మెరుగైన ఆటగాడిగా ఎదిగాను. అతనొక అపురూపమైన ఆటగాడు, స్నేహితుడు, అథ్లెట్" అని ఫెదరర్ అన్నాడు. 2017 సంవత్సరానికి లారెస్ ప్రపంచ క్రీడా అవార్డుల కార్యక్రమంలో భాగంగా 'స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్'.. 'కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు అందుకున్న సందర్భంగా ఫెదరర్ ఈ వ్యాఖ్యలు చేశాడు.

అయ్యో.. అశ్విన్



గాయం కారణంగా దేవధర్ ట్రోఫీ నుంచి ఔట్

దిల్లీ: దేవధర్ ట్రోఫీలో ఆటగాడిగా రాణించి తిరిగి టీమ్‌ఇండియా వన్డే జట్టులో చోటు దక్కించుకోవడంతో పాటు.. ఐపీఎల్ ముంగిట కెప్టెన్‌గానూ రుజువు చేసుకోవాలని ఆశించిన అశ్విన్‌కు నిరాశ తప్పలేదు. ఆదివారం ఆరంభమయ్యే దేవధర్ ట్రోఫీలో పాల్గొనే భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన అశ్విన్ గాయం కారణంగా మొత్తం టోర్నీకే దూరమయ్యాడు. "అశ్విన్ గాయంతో బాధపడుతున్నాడు. బీసీసీఐ వైద్య బృందం అతణ్ని కనీసం వారం రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించింది" అని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి తెలిపాడు. అయితే గాయం వివరాలను మాత్రం వెల్లడించలేదు. అతని స్థానంలో నదీమ్‌ను జట్టులోకి తీసుకోవాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. భారత్-బి జట్టుకు ఎంపికైన అంకిత్ భావ్నె భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అతడి స్థానంలో అక్షదీప్ 'బి' జట్టులో ఆడనున్నాడు.

ఇక నుంచి భూపతికీ వాటా

డేవిస్ కప్ ప్రైజ్ మనీలో మార్పులు



దిల్లీ: డేవిస్ కప్‌లో ఆడిన భారత జట్టుకు ప్రైజ్‌మనీని పంచే విషయంలో మార్పు చోటు చేసుకుంది. ఇంతకుముందు జట్టులోని ఆరుగురు ఆటగాళ్లకు మాత్రమే ప్రైజ్‌మనీని పంచేవాళ్లు. ఇప్పుడు నాన్ ప్లేయింగ్ కెప్టెన్, కోచ్‌లకు కూడా నగదు బహుమతిని పంచేలా అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) నిబంధనలు మార్చింది. గతంలో ప్రైజ్‌మనీని ఆటగాళ్లు పంచుకుంటే.. సహాయ సిబ్బందికి ఏఐటీఏ జీతాలిచ్చేది. అయితే నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ భూపతి ప్రతిపాదన మేరకే ఈ మార్పు చేసినట్లు ఏఐటీఏ ప్రధాన కార్యదర్శి హిరణ్మయ్ ఛటర్జీ తెలిపాడు. మైదానంలోకి దిగి కష్టపడి ఆడే ఆటగాళ్లకు ప్రైజ్‌మనీలో కోత పడేలా చేస్తున్న ఈ మార్పు అన్యాయమన్న అభిప్రాయాలు టెన్నిస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఆటగాడిగా కోట్లల్లో ఆర్జించిన భూపతి ఇలాంటి ప్రతిపాదన చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ఐపీఎల్‌లో డీఆర్‌ఎస్!




దిల్లీ: ఐపీఎల్ కొత్త సీజన్‌లో ఓ కీలక మార్పు చూడబోతున్నాం. అంపైర్ నిర్ణయ సమీక్ష (డీఆర్‌ఎస్) పద్ధతిని తొలిసారిగా లీగ్‌లో అమల్లోకి తేనున్నట్లు సమాచారం. డీఆర్‌ఎస్ పట్ల చాలా ఏళ్ల పాటు తీవ్ర వ్యతిరేకత ప్రదర్శించిన బీసీసీఐ.. ఏడాదిన్నర కిందట పట్టు వీడింది. భారత్ ఆడే సిరీస్‌ల్లో డీఆర్‌ఎస్ అమలుకు అంగీకరించింది. 2016 చివర్లో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి భారత్ ఆడే సిరీస్‌ల్లో సమీక్ష కొనసాగుతోంది. ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా దీన్ని అమలు చేయడానికి బోర్డు అంగీకారం తెలిపినట్లు తెలిసింది.



ఇవే 2020 టోక్యో ఒలింపిక్స్ మస్కట్లు. సూపర్ హీరోలను స్ఫూర్తిగా తీసుకొని రూపొందించారు. 2,042 డిజైన్ల నుంచి ఈ రెండు ఎంపికయ్యాయి. వీటికి ఇంకా పేర్లు పెట్టలేదు. నీలం రంగులో ఉన్నది ఒలింపిక్స్‌కు, గులాబీ రంగు బొమ్మ పారాలింపిక్స్‌కు మస్కట్‌గా ఎంపికైంది.

కామన్‌వెల్త్‌కు ఉసాముద్దీన్

- శివథాపాకు నిరాశ
- బాక్సింగ్ జట్టు ఎంపిక



శివ థాపా

దిల్లీ: కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టులో తెలంగాణ ఆటగాడు మహమ్మద్ ఉసాముద్దీన్‌కు చోటు లభించింది. ఇటీవల బల్గేరియాలో జరిగిన స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో ఉసాముద్దీన్ కాంస్యం గెలిచి సత్తాచాటాడు. దాంతో అర్హత మ్యాచ్ నిర్వహించకుండానే.. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య విజేత గౌరవ్ బిధూరిని కాదని 56కిలోల విభాగంలో ఉసాముద్దీన్‌ను ఎంపిక చేశారు. స్టార్ బాక్సర్లు మేరీకోమ్ (48కిలోలు), వికాస్ (75కిలోలు), అమిత్ (49కిలోలు) జట్టులో చోటు దక్కించుకున్నారు. మరో స్టార్ బాక్సర్ శివ థాపాకు నిరాశ తప్పలేదు. 60 కిలోల విభాగంలో అతడి స్థానంలో జాతీయ ఛాంపియన్ మనీష్ కౌశిక్‌ను ఎంపికచేశారు. వీళ్లిద్దరూ జాతీయ ఛాంపియన్‌షిప్, ఇండియా ఓపెన్ ఫైనల్స్‌లో తలపడగా.. రెండుసార్లు మనీషే విజేతగా నిలిచాడు. పురుషుల 91కిలోలు, 52కిలోలు.. మహిళల 51 కిలోల విభాగంలో క్రీడాకారుల్ని ఎంపిక చేయాల్సి ఉంది. ఏప్రిల్ 4 నుంచి ఆస్ట్రేలియాలో కామన్‌వెల్త్ క్రీడలు జరగనున్న సంగతి తెలిసిందే.

మేం ఓడితేనే సంతోషమేమో!

- మమ్మల్ని చాలామంది నమ్మలేదు
- గెలిస్తే అవతలి జట్టు బాలేదంటారు
- విమర్శకులపై రవిశాస్త్రి ధ్వజం



ముంబయి

దక్షిణాఫ్రికా పర్యటనలో టీమ్‌ఇండియా తొలి రెండు టెస్టులు ఓడాక విమర్శకులు స్పందించిన తీరు దారుణమని టీమ్‌ఇండియా కోచ్ రవిశాస్త్రి తీవ్ర స్థాయిలో అన్నాడు. విమర్శకుల తీరు చూస్తే భారత జట్టు ఓడితేనే వాళ్లకు ఎక్కువ సంతోషమేమో అనిపించిందని చెప్పాడు. దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని టీమ్‌ఇండియాతో పాటు స్వదేశానికి చేరుకున్న రవిశాస్త్రి.. ఈ పర్యటనలో జట్టు ప్రదర్శనపై మాట్లాడాడు. "గెలవమని మాకు ఎప్పుడూ నమ్మకముంది. టెస్టు సిరీస్ తొలి రెండు మ్యాచ్‌లు కూడా మేం గెలవాల్సినవే అని చాలా కొద్ది మంది మాత్రమే గ్రహించారు. భారత జట్టు ఓడితేనే దేశంలో చాలా మంది సంతోషిస్తారేమో అన్న భావన కలిగింది. తొలి రెండు టెస్టుల్లో రెండు సెషన్లలో వెనకబడటం వల్ల మ్యాచ్‌లు చేజారాయి. ఐతే అందులో సానుకూలాంశాలు తీసుకుని తర్వాతి మ్యాచ్‌లోకి వెళ్లాలని, గెలవాలని అనుకున్నాం. మేం డ్రా కోసం ఆడలేదు. గెలవడానికే ఆడాం. జొహానెస్‌బర్గ్ లాంటి చోట మొదట బ్యాటింగ్ చేయడానికి ఏ జట్టూ సాహసించదు. కానీ మన జట్టు అదే చేసింది. గెలిచింది" అని రవిశాస్త్రి అన్నాడు. ప్రత్యర్థి జట్టులో కొందరు ఆటగాళ్లు గాయపడటం వల్లే టీమ్‌ఇండియా వన్డే, టీ20 సిరీస్‌లు గెలవగలిగిందన్న అభిప్రాయాలపైనా రవిశాస్త్రి స్పందించాడు. "మన విమర్శకులతో వచ్చిన సమస్య ఇదే. మనోళ్లు గెలిస్తే అవతలి జట్టు బాగా ఆడలేదంటారు. శ్రీలంకలో నెగ్గితే వాళ్లది అత్యుత్తమ జట్టు కాదంటారు. దక్షిణాఫ్రికాలో నెగ్గితే ఇదే మాట అంటారు. మన ప్రదర్శనను బట్టే ప్రత్యర్థి సత్తా తెలుస్తుంది. ఓడినపుడు భారత జట్టు బాగా లేదన్న మాట ఎవ్వరూ అనరు. మేం దక్షిణాఫ్రికాతో ఆడాం. ఆ జట్టు తరఫున ఎవరు ఆడతారు, ఎవరు ఆడరు అన్నది మా సమస్య కాదు" అని చెప్పాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో సాధించిన విజయం ఎంత గొప్పదో ఇంకా ఆటగాళ్లకు అర్థం కాలేదని, ఒక వారం గడిచాక కానీ వారికి విషయం బోధపడదని రవిశాస్త్రి అన్నాడు. రెండు టెస్టులు ఓడాక భారత ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకుని దక్షిణాఫ్రికాకు నాకౌట్ పంచ్ ఇచ్చారని.. 1974లో ఫ్రేజర్‌పై దిగ్గజ బాక్సర్ మహ్మద్ అలీ సాధించిన విజయం లాంటిదే ఇదని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసిన కెప్టెన్ కోహ్లిపై రవిశాస్త్రి ప్రశంసల జల్లు కురిపించాడు. "కోహ్లి కెప్టెన్ జట్టును ముందుండి నడిపిస్తుంటే.. ఆ ప్రదర్శన ఒక అంటు వ్యాధి లాగా మిగతా ఆటగాళ్లలోకి కూడా ప్రసరిస్తుంది" అని అతనన్నాడు.

'ఎ' గ్రేడ్ క్రికెటర్లకు ఏడాదికి 12 కోట్లా?



ముంబయి: భారత క్రికెటర్ల పంట పండబోతున్నట్లే. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లకు భారీ స్థాయిలో జీతాలు పెంచడానికి బీసీసీఐ రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇంకొన్ని రోజుల్లోనే కొత్త కాంట్రాక్టులు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఎ, బి, సి గ్రేడ్లతో పాటు కొత్తగా ఎ+ గ్రేడ్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ కొత్త గ్రేడ్‌లోని ఆటగాళ్లు ఏడాదికి రూ. 12 కోట్ల చొప్పున జీతం అందుకునే అవకాశాలున్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. మార్చి 6న శ్రీలంకలో ఆరంభమయ్యే ముక్కోణపు సిరీస్‌కు భారత ఆటగాళ్లు వెళ్లడానికి ముందే జీతాల పెంపుపై బోర్డు ప్రకటన చేస్తుందని తెలుస్తోంది. టీమ్‌ఇండియా ఆటగాళ్లతో పాటు మహిళా క్రికెటర్లు, దేశవాళీ ఆటగాళ్లు, భారత అండర్-19 జట్టుకు ఆడే కుర్రాళ్లకు కూడా జీతాలు, మ్యాచ్ ఫీజులు పెరుగుతాయని సమాచారం.



అరుణ

ఈ రోజు కోసమే ఎదురుచూశా

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ కప్‌లో కాంస్య పతకం నెగ్గిన తర్వాతే తన గురించి అందరికీ తెలిసిందని జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణి అరుణా రెడ్డి తెలిపింది. కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించడమే తన లక్ష్యమని చెప్పింది. మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక టోర్నీలో సత్తాచాటిన అరుణ బుధవారం స్వదేశానికి తిరిగొచ్చింది. ఈ సందర్భంగా 'ఈనాడు'తో మాట్లాడుతూ.. "ఇప్పటివరకు కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, ఆసియా ఛాంపియన్‌షిప్ సహా చాలా టోర్నీల్లో బరిలో దిగా. కానీ అరుణారెడ్డి అనే జిమ్నాస్ట్ ఉందన్న సంగతి చాలామందికి తెలియదు. ప్రపంచకప్‌లో పతకంతో నేనెవరో అందరికీ తెలిసింది. దీపా కర్మాకర్ తర్వాత అరుణ పేరుతో మరో అగ్రశ్రేణి జిమ్నాస్ట్ ఉందని అందరూ అంటుంటే ఆనందంగా ఉంది. ఈ రోజు కోసమే ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నా. నన్ను ఈస్థాయికి చేర్చి.. ఇంత పేరు అందించిన ప్రపంచకప్ పతకం నాన్నకే అంకితం. నాన్న చనిపోయాక నాకు అండగా నిలిచిన అమ్మ, అక్క, బావ, కోచ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు. 17 దేశాలు పాల్గొన్న ప్రపంచకప్‌లో గట్టి పోటీ ఎదురైంది. క్వాలిఫయింగ్ నుంచి ఫైనల్ వరకు ఆత్మవిశ్వాసంతో పోటీపడ్డా. కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే దేశాలన్నీ ఈ టోర్నీలో బరిలో దిగాయి. ఒక విధంగా ఇది పనికొచ్చేదే. కామన్వెల్త్ క్రీడల్లో ఆత్మవిశ్వాసంతో బరిలో దిగొచ్చు. కెనడా, బ్రిటన్ నుంచి పోటీ ఉంటుంది. ప్రపంచకప్ కోసం తాష్కెంట్‌లో శిక్షణ తీసుకున్నా. కామన్వెల్త్ క్రీడలకు కూడా విదేశాల్లో శిక్షణ తీసుకోవాలని భావిస్తున్నా. ప్రపంచకప్‌కు ముందు చాముండేశ్వరినాథ్ ఆర్థికంగా సహాయం అందించారు. స్పాన్సర్ల ద్వారా ఆయన నిధులు సమకూర్చడం వల్లే ప్రపంచకప్‌కు వెళ్లగలిగా. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సాయ్, శాట్స్ కూడా నన్ను ప్రోత్సహిస్తున్నాయి" అని అరుణ తెలిపింది.

> దీపా కర్మాకర్ తర్వాత అరుణ పేరుతో మరో అగ్రశ్రేణి జిమ్నాస్ట్ ఉందని అందరూ అంటుంటే ఆనందంగా ఉంది. ఈ రోజు కోసమే ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నా



భారత్‌కు సులువైన డ్రానే

పురుషుల హాకీ ప్రపంచకప్

దిల్లీ: సొంతగడ్డపై జరగనున్న పురుషుల హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు సులువైన డ్రా పడింది. బుధవారం అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య విడుదల చేసిన డ్రాలో భారత్‌కు గ్రూప్-సిలో చోటు దక్కింది. ఈ గ్రూపులో ఒలింపిక్ రజత పతక విజేత బెల్జియం ఒక్కటే భారత్ కంటే మెరుగైన ర్యాంకింగ్ ఉన్న జట్టు. ఈ గ్రూప్‌లో కెనడా, దక్షిణాఫ్రికా కూడా ఉన్నాయి. చివరగా బెల్జియంతో ఆడిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలైంది. నాలుగు గ్రూపుల్లో మొదటి స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు మిగతా నాలుగు క్వార్టర్స్ బెర్తుల కోసం తలపడతాయి. భారత్ నవంబర్ 28న తన తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది. భారత జట్టు మరీ చెత్తగా ఆడితే తప్ప.. క్వార్టర్స్ చేరడం ఖాయం. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు భువనేశ్వర్‌లో ఈ టోర్నీ జరగనుంది.

గ్రూప్-ఎ: అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్
గ్రూప్-బి: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఐర్లాండ్, చైనా
గ్రూప్-సి: బెల్జియం, భారత్, కెనడా, దక్షిణాఫ్రికా
గ్రూప్-డి: నెదర్లాండ్స్, జర్మనీ, మలేషియా, పాకిస్థాన్

బుమ్రా.. ముఖ్యమైన సిరీస్‌లకే



దిల్లీ: టెస్టుల్లోనూ సత్తాచాటుతున్న టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారం లేకుండా చూసుకోవాలని సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. "దక్షిణాఫ్రికా పర్యటనలో బుమ్రా ప్రదర్శన ఆనందాన్నిచ్చింది. అతని సత్తాపై మాకు పూర్తి నమ్మకముంది. ఐతే రానున్న రోజుల్లో ఆడాల్సిన అంతర్జాతీయ మ్యాచ్‌ల నేపథ్యంలో బుమ్రాపై పని ఒత్తిడి ఉండకూడదు. అతను అతిగా ఆడకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. బుమ్రా బౌలింగ్ యాక్షన్ భిన్నంగా ఉంటుంది. గాయాలయ్యే అవకాశం ఎక్కువ. అందుకే బుమ్రాను ముఖ్యమైన సిరీస్‌ల్లోనే ఆడించాలి" అని ఎమ్మెస్కే తెలిపాడు.

సఫారీలకు సవాల్

ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ నేటి నుంచే

డర్బన్: సొంతగడ్డపై భారత్ చేతిలో వన్డే, టీ20 సిరీస్‌లు ఓడి ఆత్మవిశ్వాసం కోల్పోయిన దక్షిణాఫ్రికా.. మరో పెద్ద సవాలుకు సిద్ధమైంది. బలమైన ఆస్ట్రేలియాతో ఆ జట్టు నాలుగు టెస్టుల సిరీస్‌లో తలపడబోతోంది. గురువారమే డర్బన్‌లో తొలి టెస్టు ఆరంభం. అసలే స్వదేశంలో ఆస్ట్రేలియాతో సిరీస్‌ల్లో దక్షిణాఫ్రికా రికార్డు పేలవం. సొంతగడ్డపై కంగారూలతో 14 సిరీస్‌ల్లో తలపడితే రెండుసార్లు మాత్రమే గెలిచింది. భారత బౌలర్లనే కాచుకోలేకపోయిన ఆ జట్టు బ్యాట్స్‌మెన్.. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్, లైయన్‌లతో భీకరంగా కనిపిస్తున్న ఆస్ట్రేలియా బౌలింగ్ దళాన్ని ఎలా ఎదుర్కొంటారో చూడాలి.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' స్టోక్స్

మెరిసిన స్టోక్స్

రెండో వన్డేలో ఇంగ్లాండ్ ఘనవిజయం

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లాండ్ పుంజుకుంది. తొలి వన్డేలో త్రుటిలో ఓడిన ఆ జట్టు.. రెండో వన్డేలో 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. దాడి కేసు కారణంగా ఐదు నెలల పాటు ఇంగ్లాండ్ జట్టుకు దూరమై, ఈ సిరీస్‌తోనే పునరాగమనం చేసిన బెన్ స్టోక్స్.. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదట స్టోక్స్ (2/42)తో పాటు మొయిన్ అలీ (2/33), వోక్స్ (2/42) కూడా సత్తా చాటడంతో కివీస్ 49.4 ఓవర్లలో 223 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ గప్తిల్ (50; 87 బంతుల్లో 7×4) మినహా ప్రధాన బ్యాట్స్‌మెన్ అంతా విఫలమవడంతో ఒక దశలో కివీస్ 108 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. అయితే ఆల్‌రౌండర్లు శాంట్నర్ (63; 52 బంతుల్లో 6×4, 1×6), గ్రాండ్‌హోమ్ (38; 40 బంతుల్లో 4×4, 1×6) ఆదుకోవడంతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోరు చేసింది. కివీస్ ఇన్నింగ్స్‌లో నలుగురు రనౌటవడం విశేషం. అనంతరం బౌల్ట్ (2/46) ధాటికి ఇంగ్లాండ్ 87 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడ్డప్పటికీ.. మోర్గాన్ (62; 63 బంతుల్లో 6×4, 3×6), స్టోక్స్ (63 నాటౌట్; 74 బంతుల్లో 7×4, 3×6) నిలకడగా ఆడి జట్టుకు విజయాన్నందించారు.

రష్యా.. ఇక ఒలింపిక్స్‌లో!



ప్యాంగ్‌చాంగ్: డోపింగ్ వివాదం వల్ల ఒలింపిక్ నిషేధాన్ని ఎదుర్కొంటున్న రష్యాకు ఉపశమనం. ఆ దేశంపై విధించిన నిషేధాన్ని ఎత్తేస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) ప్రకటించింది. ఇటీవల దక్షిణకొరియాలో ముగిసిన వింటర్ ఒలింపిక్స్‌లో రష్యాపై నిషేధం ఉండడంతో ఆ దేశ అథ్లెట్లు స్వతంత్రంగా బరిలోకి దిగారు. "పరీక్షల్లో రష్యా అథ్లెట్లు ఎలాంటి డ్రగ్స్ వాడలేదని తెలియడంతో ఆ దేశంపై ఉన్న నిషేధం తొలగిపోయింది" అని ఐఓసీ ఓ ప్రకటనలో తెలిపింది. రష్యా ఒలింపిక్ కమిటీ (ఆర్‌ఓసీ) అధ్యక్షుడు అలెగ్జాండర్ ఈ ప్రకటనను స్వాగతించాడు. 'ఆర్‌ఓసీ తిరిగి తన హక్కులు పొందినందుకు ఆనందంగా ఉంది" అని అలెగ్జాండర్ తెలిపాడు.



డోపింగ్‌లో దొరికిన దవిందర్

దిల్లీ: భారత జావెలిన్ త్రోయర్ దవిందర్ సింగ్ నాలుగేళ్ల నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడ్డాడు. అతను డోపింగ్‌లో దొరికిపోవడమే ఇందుకు కారణం. గత ఏడాది నవంబరులో పటియాలాలో నిర్వహించిన డోప్ టెస్టుల్లో అతను నిషేధిత ఉత్ప్రేరకం వాడినట్లు తేలింది. అతడిపై ప్రాథమికంగా సస్పెన్షన్ పడింది. దవిందర్ తప్పు చేసినట్లు రూఢి అయితే అతడిపై నాలుగేళ్ల వరకు నిషేధం పడుతుంది. అదే జరిగితే దేవిందర్ కెరీర్ దాదాపుగా ముగిసినట్లే. ఎందుకంటే అతడి వయసు ఇప్పటికే 29 ఏళ్లు.

మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు

ఒడిశాలో కాంగ్రెస్ సీటును దక్కించుకున్న బిజూ జనతాదళ్

భోపాల్, భువనేశ్వర్: మధ్యప్రదేశ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. కోలారస్, ముంగావలి అసెంబ్లీ స్థానాలను నిలబెట్టుకుంది. ఒడిశాలోని బిజేపుర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీకి భంగపాటు తప్పలేదు. ఆ సీటును బిజూ జనతాదళ్(బీజేడీ)కు కోల్పోయింది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరణించడంతో కోలారస్, ముంగావలి నియోజకవర్గాలకు గత నెల 24న జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ముంగావలిలో కాంగ్రెస్ అభ్యర్థి బ్రజేంద్ర సింగ్ యాదవ్ 2,124 ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి బైసాహబ్ యాదవ్(భాజపా)పై గెలుపొందారు. బ్రజేంద్రకు మొత్తం 70,808 ఓట్లు వచ్చాయి. కోలారస్‌లో మహేంద్ర సింగ్ యాదవ్(కాంగ్రెస్) 8,083 ఓట్ల ఆధిక్యంతో భాజపా అభ్యర్థి దేవేంద్ర జైన్‌పై విజయం సాధించారు. మహేంద్రకు మొత్తం 82,515 ఓట్లు వచ్చాయి. మరోవైపు, కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబల్ సాహు మరణంతో ఒడిశాలోని బిజేపుర్ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో అధికార బీజేడీ అభ్యర్థి రితా సాహు సమీప ప్రత్యర్థి అశోక్ పాణిగ్రహి(భాజపా)పై 41,933 ఓట్ల తేడాతో విజయ దుందుభి మోగించారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన ప్రణయ సాహు కేవలం 10,274 ఓట్లు సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. రితా సాహు దివంగత సుబల్ సాహు సతీమణి కావడం గమనార్హం.

న్యూటన్ కన్నా ముందే మంత్రాల రూపంలో చలనసూత్రాలు

కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ వ్యాఖ్య

దిల్లీ: కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ న్యూటన్ నియమాలపై కూడా వివాదాస్పద వ్యాఖ్య చేశారు. న్యూటన్ చలన సూత్రాలు కనుగొనడానికి కంటే ముందే అవి మంత్రాల రూపంలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ అధ్యక్షతన జనవరిలో జరిగిన కేంద్ర విద్యా సలహా బోర్డు (సీఏబీఈ) సమావేశంలో సత్యపాల్ మాట్లాడుతూ న్యూటన్ చలనసూత్రాల గురించి వ్యాఖ్యానించారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా భారత జాతీయ సైన్సు అకాడమీ(దిల్లీ), ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(బెంగళూరు) నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులనుద్దేశించి మంత్రి బుధవారం మాట్లాడుతూ గతంలో డార్విన్ సిద్ధాంతంపై చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. న్యూటన్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల స్పందించడానికి నిరాకరించారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పని, దాన్ని పాఠశాలలు, కళాశాలల్లో బోధించరాదని గతంలో ఆయన వ్యాఖ్యానించారు. కోతి మనిషిగా పరిణామం చెందిందని మన పూర్వికులు సహా ఎవరూ లిఖితపూర్వకంగా కానీ, మౌఖికంగాకానీ చెప్పలేదని అప్పట్లో ఆయన అన్నారు. ప్రారంభం నుంచే ఈ భూమిపై మనిషి.. మనిషిగానే జన్మించాడని అన్నారు.

శాస్త్రవేత్తలకు ప్రధాని శుభాకాంక్షలు

దిల్లీ: జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శాస్త్రవేత్తలకు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. సైన్సు ప్రేమికులకు అభివందనాలు తెలిపారు. వారి శాస్త్రీయ జిజ్ఞాస మరింతగా వికసించాలని ఆకాంక్షించారు. మన శాస్త్రవేత్తలను చూసి భారత్ చాలా గర్వపడుతోందని తన సందేశంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు.

నాలుగేళ్ల బాలికను బలిగొన్న మృగాడికి మరణ శిక్ష

శాదోల్: నాలుగేళ్ల బాలికపై అత్యాచారంచేసి దారుణంగా హతమార్చిన ఓ మృగాడికి బుధవారం మరణ శిక్ష పడింది. గత మే నెలలో బాలికపై మధ్యప్రదేశ్‌లోని శాదోల్‌కు చెందిన 22ఏళ్ల వినోద్ చౌడా ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఎదురింటిలో ఉండే చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని పొదల చాటున పడేశాడు. ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం అతడికి జిల్లా సెషన్సు న్యాయమూర్తి ఆర్‌కేసింగ్ మరణ శిక్ష విధించారు.

అమెరికా సైనిక స్థావరంలో అనుమానాస్పద లేఖ కలకలం

లేఖలోని గుర్తుతెలియని పదార్థంతో 11 మందికి అస్వస్థత

వాషింగ్టన్: గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఓ అనుమానాస్పద లేఖ అమెరికా రక్షణ శాఖ వర్గాలను, నిఘా వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. లేఖ లోపల ఉన్న గుర్తు తెలియని పదార్థం కారణంగా 11 మంది నేవీ సిబ్బంది అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన ఎఫ్‌బీఐ ఆ ఉత్తరం, అందులోని పదార్థంపై దర్యాప్తును చేపట్టింది. వర్జీనియాలోని అర్లింగ్టన్‌లో ఉన్న ఫోర్ట్ మయర్-హెండర్సన్ హాల్ సంయుక్త సైనిక స్థావరంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వ్యక్తులకు కాకుండా సైనిక స్థావరం పేరుతో వచ్చిన ఆ ఉత్తరాన్ని అక్కడి నేవీ సిబ్బంది తెరచి చదివే ప్రయత్నం చేయగా...ఆ పదార్థం ప్రభావానికి 11 మంది నేవీసిబ్బంది గురయ్యారు. బాధితుల చేతులు, ముఖాలకు దురద కలగటం, ముక్కుల వెంట రక్తం కారటంతో క్షణాల్లో అక్కడ అలజడి రేగింది. ఆస్పత్రికి తరలించి చికిత్సలందించారు.

ట్రంప్ అల్లుడు కుష్నర్ హోదాకు కత్తెర!: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అల్లుడు జె.కుష్నర్‌కు ప్రభుత్వ పరంగా ఉన్న అధికారిక హోదాను శ్వేత సౌధం కుదించింది. ఇప్పటి వరకూ ఆయనకున్న అత్యంత రహస్యమైన పత్రాలనూ పరిశీలించే అధికారాన్ని సాధారణ రహస్య పత్రాల వరకే పరిమితం చేస్తూ శ్వేతసౌధ సిబ్బంది ప్రధానాధికారి జాన్ కెల్లీ ఉత్తర్వులిచ్చారని సమాచారం.

ఇద్దరు మహిళా అథ్లెట్లపై ఆమ్లదాడి

మేరఠ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇద్దరు మహిళా అథ్లెట్లపై ఓ మహిళ బుధవారం ఆమ్లదాడికి పాల్పడింది. మేరఠ్‌లోని లాల్‌కృతి ప్రాంతంలో ఉదయం సాధన చేసుకుంటున్న సమయంలో బాక్సర్ గరిమా సింగ్, రెజ్లర్ షాలూలపై ఈ దాడి జరిగింది. మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై వచ్చిన నిందితురాలు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు సీనియర్ ఎస్పీ మంజిల్ సైనీ తెలిపారు. ఆమెను అరెస్టు చేసి, మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. గరిమా మోచేతులు, షాలూ వీపు భాగంలో కాలిపోవడంతో వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్లీనరీకి కమిటీలు

పళ్లంరాజు, పొన్నంలకు చోటు

దిల్లీ: కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల నిర్వహణకు పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం వివిధ కమిటీలను నియమించారు. మార్చి 16 నుంచి మూడు రోజులపాటు ప్లీనరీ జరగనున్న విషయం తెలిసిందే. తదుపరి సార్వత్రిక ఎన్నికల దిశగా పార్టీని సన్నద్ధం చేయడానికి అనుసరించాల్సిన వ్యూహంపై ప్లీనరీలో చర్చిస్తారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న విషయంపైనా చర్చ చేపడతారు. తల్లి సోనియా గాంధీ నుంచి రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టాక జరుగుతున్న తొలి ప్లీనరీ సమావేశాలు ఇవే.

ముసాయిదాల కమిటీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఛైర్మన్‌గా, ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. దీనిలో 44 మంది ఇతర సీనియర్ నేతలు సభ్యులు. రాజకీయాలు (ఛైర్మన్: ఎ.కె.ఆంటోనీ), ఆర్థిక వ్యవహారాలు (ఛైర్మన్: పి.చిదంబరం), అంతర్జాతీయ వ్యవహారాలు (ఛైర్మన్: ఆనంద్‌శర్మ), వ్యవసాయం-ఉపాధి (ఛైర్మన్: భూపిందర్ సింగ్ హుడా) విషయాలపై నాలుగు ఉప బృందాలు ముసాయిదా కమిటీలో భాగంగా ఉంటాయి.

నిర్వహణ కమిటీ: పార్టీ కోశాధికారి మోతీలాల్ వోరా ఛైర్మన్‌గా, ప్రధాన కార్యదర్శి ఆస్కార్ ఫెర్నాండెజ్ ప్రధాన కార్యదర్శిగా ఉంటారు.

నియమావళి సవరణల కమిటీ: సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ ఛైర్మన్‌గా, జనార్దన్ ద్వివేది ప్రధాన కార్యదర్శిగా ఉంటారు. అహ్మద్ పటేల్, పి.చిదంబరం, మల్లికార్జున్ ఖర్గే, కపిల్ సిబల్ వంటి మరో 10 మంది సీనియర్ నేతలు సభ్యులుగా వ్యవహరిస్తారు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఏర్పాటుచేసిన కమిటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు, కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లకు చోటు దక్కింది. మన్మోహన్ నేతృత్వంలోని కమిటీలో... రాజకీయ ఉప సంఘంలో ప్రభాకర్‌కు, ఆర్థిక వ్యవహారాల ఉప సంఘంలో పళ్లంరాజుకు చోటుదక్కింది.

అక్రమ రవాణాకు జీవితఖైదు

- బాధితులకు తక్షణం పునరావాసం
- పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ
- ఎన్‌ఐఏకి దర్యాప్తు బాధ్యతలు
- ఎంపీల నియోజకవర్గ భత్యం ఇక రూ.60,000
- 12 సేవా రంగాలకు ప్రోత్సాహం... రూ.5000 కోట్లతో కార్యాచరణ
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

ఈనాడు – దిల్లీ

మహిళలు, పిల్లల అక్రమ రవాణా నిరోధానికి కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురాబోతోంది. దీనికి ఉద్దేశించిన 'మానవ అక్రమ రవాణా (నివారణ, పరిరక్షణ, పునరావాసం) బిల్లు-2018'కు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో దీంతో సహా పలు ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. మానవ అక్రమ రవాణా కేసుల్ని ఇకపై 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్‌ఐఏ) విచారిస్తుంది. దీనికి వీలుగా ఎన్‌ఐఏ చట్టాన్ని సవరించడంతో పాటు ఆ సంస్థలో ఒక విభాగాన్ని ప్రత్యేకంగా నెలకొల్పడానికి నిర్భయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. ఇలాంటి నేరాలను పదేపదే చేసేవారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. దీనికి వీలుగా నేరాలను 'రవాణా', 'తీవ్రమైన రవాణా' అనే విభాగాలుగా వర్గీకరించారు. మొదటిదానికి 7 నుంచి 10 ఏళ్లు, రెండో దానికి కనీసం పదేళ్ల నుంచి యావజ్జీవం వరకు శిక్ష విధించవచ్చు. బలవంతంగా పనుల్లోకి దించడం, దానికోసం మాదక ద్రవ్యాలు వాడడం, వెట్టిచాకిరీ, బలవంతపు అద్దెగర్భం, వ్యభిచార వృత్తిలోకి దించడానికి అనువుగా పిల్లలు త్వరగా పెద్దవాళ్లుగా కనిపించేలా హార్మోన్లు ఎక్కించడం, రసాయనాలు ఉపయోగించడం, బాల్య వివాహాలు, పెళ్లి ముసుగులో అక్రమ రవాణా, ఆ పేరుతో గర్భవతిని చేయడం, లేదా తీవ్ర అనారోగాల పాల్జేయడం వంటివి తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు.

జాతీయ స్థాయిలో పునరావాస కమిటీ

అక్రమ రవాణాకు సహకరించేవారికి మూడేళ్ల జైలుశిక్ష పడుతుంది. పునరావాస నిధిని, మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి నేతృత్వంలో జాతీయ స్థాయిలో పునరావాస కమిటీని ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదిత చట్టంలో ఒక సిఫార్సు. బాధితులు, వారికి సహాయపడే సాక్షుల వివరాలను గోప్యంగా ఉంచుతారు. వారు ప్రతిసారీ పోలీసు ఠాణాలకు, కోర్టులకు తిరగాల్సిన అవసరం ఉండదు.

- కేసుల విచారణకు నిర్దిష్టగడువు విధిస్తారు. బాధితుల అక్రమ రవాణా గురించి తెలిసిన ఏడాదిలోగా వారిని తిరిగి రప్పించడానికి చర్యలు తీసుకుంటారు.
- కేసు విచారణ పూర్తయ్యేంతవరకూ వేచిచూడకుండా బాధితులకు తక్షణం సహాయ, పునరావాసం కల్పిస్తారు. నెలలోగా మధ్యంతర సాయం, అభియోగపత్రం దాఖలుచేసిన 60 రోజుల్లోగా పూర్తిస్థాయిలో సహాయం అందిస్తారు.
- నిందితులకు శిక్షపడినా, పడకపోయినా బాధితులకు సాయం చేస్తారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తారు.

ఎంపీల భత్యాల పెంపు

పార్లమెంటు సభ్యులకు ఇస్తున్న పలురకాల భత్యాలను పెంచడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నియోజకవర్గ భత్యం రూ.45,000 నుంచి రూ.60,000కి, ఫర్నీచర్ భత్యం కింద ఒకేసారి ఇచ్చే మొత్తాన్ని రూ.75,000 నుంచి రూ.లక్షకు పెరుగుతుంది. రూ.50,000 మూల వేతనంతో కలిపి ఒక్కో ఎంపీకి ప్రస్తుతం నెలకు రూ.2.75 లక్షలు లభిస్తోంది.

ఇతర నిర్ణయాలు

- నాఫెడ్‌కు బ్యాంకులు అందించే క్రెడిట్ గ్యారెంటీ రూ.9,500 కోట్ల నుంచి రూ.19వేల కోట్లకు పెంపు.
- ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాన్ని రూ.5500 కోట్లతో 12వ పంచవర్ష ప్రణాళిక తర్వాత మరో మూడేళ్లు కొనసాగించడానికి సమ్మతి.
- 12 కీలకసేవారంగాలు తమ శక్తిమేరకు విస్తరించేందుకు వీలుగా చేయూత. ఇందులో ఐటీ, ఐటీఆధారిత సేవలు, పర్యాటకం, ఆతిథ్యం, వైద్య పర్యాటకం తదితర సేవలున్నాయి. వీటిఅభ్యున్నతికోసం చేపట్టే కార్యాచరణకోసం రూ.5వేలకోట్లతో ప్రత్యేకనిధి ఏర్పాటు. దేశంలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థను లక్ష కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రులు వెల్లడించారు.



భాజపా ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులతో ప్రధాని మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా

ఒకేసారి ఎన్నికలపై సత్వర ఏకాభిప్రాయం

- 2022లోగా ఆ విధానం రావడం మేలు
- భాజపా సీఎంల సదస్సు పిలుపు
- పథకాలను సమీక్షించిన ప్రధాని మోదీ

ఈనాడు, దిల్లీ: పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు అన్ని రకాల ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై సత్వరం ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని భాజపా ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం పిలుపునిచ్చింది. కనీసం 2022లోగా అన్ని రకాల వ్యవస్థలకూ ఒకేసారి ఎన్నికలు జరిగేలా చూడాలని అభిప్రాయపడింది. బుధవారం దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా సమావేశమయ్యారు. 13 మంది ముఖ్యమంత్రులు, ఆరుగురు ఉప ముఖ్యమంత్రులు దీనికి హాజరయ్యారు. అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజల్లో చైతన్యం కలిగించాలని మోదీ, అమిత్‌షా సూచించారు. 'పార్లమెంటు, శాసన సభలు, గ్రామ పంచాయతీలు సహా అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించాలనేది ఒక రోజులో సాధించగలిగేది కాదు. దీని కోసం ముందుగా దేశవ్యాప్తంగా ప్రజల్ని జాగృతం చేయాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఏకీభావానికి రావాలి. 2018-19లో కాకపోతే కనీసం 2022లోగా దీనిని సాధించాలి' అని సమావేశం అభిప్రాయపడినట్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ తెలిపారు. సమావేశానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలపై అందరి అభిప్రాయాలను అమిత్‌షా ఆలకించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఆయా రాష్ట్రాల్లో ఏ రీతిన అమలవుతున్నాయో ప్రధాని సమీక్షించారని తెలిపారు. పంటల బీమా, యువతకు రుణాలు, డిజిటల్ లావాదేవీలు, అందుబాటు ధరలో గృహాలు తదితర అంశాలను ప్రధాని సమీక్షించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీటి అమల్లో ఉన్న అవరోధాల గురించీ ఆయన ప్రశ్నించారు. కేంద్ర-రాష్ట్ర పథకాలను ప్రజలకు వివరించడానికి మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మోదీ సూచించారు. ఈ ఏడాది రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో జరగనున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని సమావేశంలో చర్చించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల దృష్టితోనూ కొన్ని అంశాలపై సమాలోచనలు చేశారు.

రూ.515 కోట్ల మేర బ్యాంకులకు టోకరా

దిల్లీ: బ్యాంకుల సహవ్యవస్థ (కన్సార్టియం)ను రూ.515.15 కోట్ల మేర మోసగించినట్లుగా ఆరోపిస్తూ ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్స్ సంస్థ, దాని డైరెక్టర్లపై సీబీఐ తాజాగా కేసు నమోదు చేసింది. కోల్‌కతాలో నిందితుల నివాసాలు, సంస్థ కార్యాలయంలో బుధవారం సోదాలు నిర్వహించింది. 2015లోనే ఐడీబీఐ బ్యాంకును రూ.180 కోట్ల మోసగించినందుకు ఆర్‌పీ ఇన్ఫో సిస్టమ్స్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. నకిలీ పత్రాలతో మోసపూరితంగా రుణాలు పొందినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. తాజాగా ఫిబ్రవరి 16న కెనరా బ్యాంకు ఈ సంస్థపై ఫిర్యాదు చేసింది. 2012 నుంచి తప్పుడు ఆర్థిక లావాదేవీలను చూపుతూ సంస్థ రుణాలు పొందుతూ వచ్చిందని.. ఇవి నిరర్థక ఆస్తులుగా మిగిలాయని బ్యాంకు పేర్కొంది. సహవ్యవస్థకు నేతృత్వం వహించిన ఐడీబీఐ బ్యాంకు.. తమ బ్యాంకుకు సంబంధించిన రుణాల అక్రమాలపైనే గతంలో సీబీఐకి ఫిర్యాదు చేసిందని కెనరా బ్యాంకు పేర్కొంది.

కొన్ని సెక్షన్లు మరీ దారుణం

- మేము కొట్టేయక ముందే వాటిపై ఆలోచించండి
- 'యూనక్1329ఎఫ్' చట్టంపై తెలంగాణ సర్కారుకు హైకోర్టు స్పష్టీకరణ
- ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హిజ్రాలకు సంబంధించి 1919లో అమల్లోకి వచ్చిన 'యూనక్ చట్టం 1329ఎఫ్'లోని 3, 4 తదితర సెక్షన్లు అత్యంత దారుణంగా ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. వాటిని తాము కొట్టేయక ముందే తీసివేయడమో, సవరించడమో చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఆలోచన చేయాలని స్పష్టంచేసింది. హిజ్రాలు నాట్యం చేసినా, సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నా అరెస్టు చేయడం సరికాదని అభిప్రాయ పడింది. 15, 16 ఏళ్ల బాలుడ్ని హిజ్రాల సమక్షంలో ఉంచుకుంటే నేరం ఎలా అవుతుందని పేర్కొంది. హిజ్రాలు సమాజంలో వివక్షకు గురవుతున్నారని వ్యాఖ్యానించింది. పిల్లలపై అఘాయిత్యాల సమాజంలో జరుగుతున్నాయనీ, ఆ ఘటలను హిజ్రాలకే పరిమితం చేయలేమంది. భారత రాజ్యాంగం అమల్లోకి రాకముందు ఏర్పడిన ఈ చట్టంపై పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయాలని తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ యూనక్ చట్టబద్ధతను సవాలు చేస్తూ హిజ్రాల సామాజిక హక్కుల కోసం పోరాడే ఉద్యమకారులు, హిజ్రాలైన వి.వసంత మోగ్లి మరో ఇద్దరు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సాయి సందీప్ పరీక్షిత్ వాదనలు వినిపిస్తూ.. 'తెలంగాణ రాష్ట్ర యూనక్ చట్టానికి' రాజ్యాంగ చట్టబద్ధత లేదన్నారు. ఈ చట్టంలోని ప్రతి సెక్షన్ హిజ్రాల హక్కులను హరించేదిగా ఉందన్నారు. 'యూనక్' (నపుంసకులు) అనే పదం వాడటమే హిజ్రాలను అవమానించడం అన్నారు. హిజ్రాలను అనుమానితులుగా చూడటం వారి హక్కులను ఉల్లంఘించటమేనన్నారు. బాలల అపహరణ, అసహజ లైంగిక నేరాలు, నపుంసకులుగా మార్చడం తదితర ఆరోపణలతో పోలీసు యంత్రాంగం అనవసరంగా హిజ్రాలపై నేరాలు మోపుతోందన్నారు. 15, 16 ఏళ్ల బాలుడ్ని హిజ్రాల వద్ద ఉండటం చూస్తే పోలీసులు నేరుగా అరెస్టులు చేస్తున్నారన్నారు. చాలా సందర్భాంలో ఎలాంటి కారణం లేకుండా హిజ్రాలను పోలీసులు అరెస్టు చేసి, కేసులు నమోదు చేస్తున్నారన్నారు. న్యాయ పోరాటం చేయడంతో కర్ణాటక ప్రభుత్వం 'యూనక్' అనే పదాన్ని తొలగించిందన్నారు. సదరు చట్టం అమలును నిలుపుదల చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) సంజీవ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ. . ఈ చట్టం 99 ఏళ్లకంటే ముందుదనీ, తెలంగాణ రాష్ట్రంలో ఈ చట్ట ప్రకారం ఎన్ని కేసులు నమోదయ్యాయో పరిశీలించాల్సి ఉందన్నారు. పూర్తి వివరాలతో ప్రమాణపత్రం దాఖలు చేయడానికి గడువు కావాలన్నారు.



బుధవారం రాత్రి శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు ఎరీనాలో జరిగిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి కుమార్తె వివాహ విందుకు హాజరైన మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు, రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీనటుడు బాలకృష్ణ తదితరులు. ఈ కార్యక్రమానికి గవర్నర్ నరసింహన్ సహా వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

గ్రూప్-2 నియామకాల్లో కీలక మలుపు

- 5 వేల మంది ప్రతిభావంతుల ఓఎంఆర్ షీట్ల పరిశీలన
- ఇందుకు ఐదుగురు న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు
- టీఎస్‌పీఎస్సీ నుంచి నివేదిక కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చేపట్టిన గ్రూప్-2 ఉద్యోగ నియామక ప్రక్రియలో కీలక మలుపు! బబ్లింగ్, వైట్‌నర్ వాడకంపై ఆరోపణలొచ్చిన నేపథ్యంలో- రాత పరీక్షలో ప్రతిభచూపిన 5 వేలమంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించాల్సి ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఓఎంఆర్ షీట్లతోపాటు సంబంధిత దస్త్రాలను ఈ కమిటీకి అందుబాటులో ఉంచాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించింది. జస్టిస్ పి.నవీన్‌రావు బుధవారం ఈ ఉత్తర్వులిస్తూ, తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేశారు. గ్రూప్-2 పోస్టుల భర్తీ నిమిత్తం టీఎస్‌పీఎస్సీ 2015 డిసెంబరు 30న; 2016 సెప్టెంబరు 1న ప్రకటనలిచ్చి, పరీక్షలు నిర్వహించింది. అయితే- "ఓఎంఆర్ షీట్లలో బబ్లింగ్ చేసినవారినీ, వైట్‌నర్ వాడినవారినీ, వ్యక్తిగత వివరాలను తప్పుగా నమోదు చేసినవారిని, గోప్యత పాటించకుండా ఓఎంఆర్ షీట్లలో కిందివైపున పేర్లను రాసినవారిని అర్హులుగా ప్రకటించారు. దీంతో చాలామంది అవకాశాలు దెబ్బతిన్నాయి. టీఎస్‌పీఎస్సీ చేపట్టిన నియామకాలను నిలిపివేయాలి" అంటూ హైదరాబాద్‌కు చెందిన వి.రామచంద్రారెడ్డి సహా 15 మంది; పి.చరణ్‌దాస్ గోస్వామి మరో 20 మంది; ఇంకొందరు హైకోర్టును ఆశ్రయించారు. వైట్‌నర్ వాడినవారిని ఎంపిక చేశారన్న కారణంగా గ్రూప్-2 నియామకాలను నిలిపివేయవద్దనీ... ఇలాచేస్తే ఎక్కువ మంది అభ్యర్థులకు నష్టం జరుగుతుందని మరికొందరు పిటిషన్లు వేశారు. వీటిపై జస్టిస్ పి.నవీన్‌రావు బుధవారం మరోసారి విచారణ చేపట్టారు.

స్వీయ నిబంధనలను ఉల్లంఘించింది: పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ- ఓఎంఆర్ షీట్‌లో జవాబులను గుర్తించడానికి టీఎస్‌పీఎస్సీ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. వీటి ప్రకారం రెండోసారి దిద్దడం, వైట్‌నర్ వాడటం చేయకూడదన్నారు. వైట్‌నర్‌ను వాడితే మూల్యాంకనంలో కంప్యూటర్ పరిగణనలోకి తీసుకోదదన్నారు. తీరా.. అలాంటి చర్యలకు పాల్పడిన అభ్యర్థులనే టీఎస్‌పీఎస్సీ ఎంపిక చేసిందన్నారు. కమిషన్ తన స్వీయ మార్గదర్శకాలను ఉల్లంఘించిందన్నారు. ఇలాంటివారిని ఎంపిక చేయరాదని, వారిని అనర్హులుగా ప్రకటించాలంటూ గత ఏప్రిల్‌లో ఇదే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పరీక్షల నిర్వహణలో గోప్యత పాటించాల్సి ఉండగా... కొంతమంది అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో పేరును రాశారన్నారు.

కమిటీ ఏర్పాటుకు అభ్యంతరం లేదు: ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే చూస్తున్నామన్నారు. ఓఎంఆర్ షీట్ల పరిశీలనకు కమిటీ ఏర్పాటుపై తమకు అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం 1,032 పోస్టుల భర్తీ నిమిత్తం 1:3 పద్ధతిన 3,096 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతోందన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి... సీనియర్ న్యాయవాదులు పి.శ్రీరఘురాం, ఆర్.రఘునందన్‌రావు, ఎస్.నిరంజన్‌రెడ్డిలతో కూడిన త్రిసభ్య పరిశీలన సంఘాన్ని ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులిచ్చారు. 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను, రికార్డులను పరిశీలించాలని వారికి సూచించారు. శని, ఆదివారాల్లో ఈ కమిటీకి ఓఎంఆర్ షీట్లతోపాటు సంబంధిత దస్త్రాలను అందుబాటులో ఉంచాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించారు. వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని కోరారు. నివేదికను పరిశీలించిన తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

విదేశాల్లో వ్యాపారాలున్నాయి.. భారత్‌కు రాలేను

- సీబీఐకి నీరవ్ మోదీ సమాధానం

దిల్లీ: వేల కోట్ల రూపాయల కుంభకోణంలో నిందితుడైన వజ్రాలవ్యాపారి నీరవ్ మోదీ...విచారణకు సహకరించేందుకు మొండికేస్తున్నారు. భారత్‌కు రావాలన్న తమ లేఖను తోసిపుచ్చటంతో సీబీఐ బుధవారం గట్టి హెచ్చరికను పంపించింది. వచ్చే వారం తమ ముందు హాజరుకావాల్సిందేనని స్పష్టం చేస్తూ ఓ సంక్షిప్త లేఖను పంపింది. ప్రస్తుతం తాను నివసిస్తున్న దేశంలోని భారత దౌత్య కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని నీరవ్ మోదీకి సూచించింది. దీనివల్ల అతను భారత్‌కు వచ్చేందుకు వీలుగా తక్షణ ఏర్పాట్లు జరుగుతాయని తెలిపింది. నిందితులుగా ఉన్న వ్యక్తులు తాము కోరిన సమయంలో విచారణకు తప్పక హాజరవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రూ.12వేల కోట్లకు పైబడిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణానికి సంబంధించి జరిగే విచారణలో భాగస్వామికావాలని కోరుతూ నీరవ్ మోదీకి సీబీఐ ఈమెయిల్ పంపించింది. అయితే, తనకు విదేశాల్లో వ్యాపారాలున్నాయని, భారత్‌కు రావటం సాధ్యం కాదంటూ నీరవ్ బదులిచ్చారు. దీంతో సీబీఐ బుధవారం మరోసారి లేఖ పంపింది. మరోవైపు పీఎన్‌బీ అంతర్గత ముఖ్య ఆడిటర్ ఎం.కె.శర్మను బుధవారం సీబీఐ అరెస్టు చేసింది. ఆ బ్యాంకుకు చెందిన ఆడిటర్‌ను అరెస్టు చేయటం ఇదే తొలిసారి. చీఫ్ మేనేజర్ హోదాలో ఉన్న శర్మ... పీఎన్‌బీ బ్రాడీ హౌస్ శాఖలోని ఆడిటింగ్ వ్యవస్థలకు బాధ్యుడు. బ్యాంకు లావాదేవీల్లోని లొసుగులను ఎప్పటికప్పుడు జోనల్ ఆడిట్ కార్యాలయానికి తెలియజేయాల్సిన బాధ్యత ఆయనదే.

సుభిక్ష రిటైల్ సంస్థ వ్యవస్థాపకుడి అరెస్టు: బ్యాంక్ ఆఫ్ బరోడా చెన్నై శాఖలో తీసుకున్న రూ.77 కోట్ల రుణ మొత్తాన్ని దారి మళ్లించిన కేసులో సుభిక్ష రిటైల్ గొలుసు దుకాణాల వ్యవస్థాపకుడు ఆర్.సుబ్రమణియన్‌ను ఏడు రోజుల పాటు న్యాయ నిర్బంధానికి చెన్నై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశించారు. సుబ్రమణియన్‌ను మంగళవారం ఈడీ అరెస్టు చేసింది. సుబ్రమణియన్...సుభిక్ష దుకాణాల పేరుతో బ్యాంకుల సహవ్యవస్థ నుంచి మొత్తం రూ790 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

తెలంగాణకు ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీ

ఈనాడు, హైదరాబాద్: టీఎస్ కాప్ మొబైల్ యాప్ ద్వారా సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుల్లో సాధికారత పెంపొందించినందుకు జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2017 సంవత్సరానికి గాను తెలంగాణ పోలీసులకు ట్రోఫీ అందజేసింది. బుధవారం చెన్నైలో జరిగిన అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి నుంచి తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి తరఫున అదనపు డీజీ (శాంతిభద్రతలు) అంజనీకుమార్ దీన్ని అందుకున్నారు.

డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులకు పతకాలు

చెన్నైలో జరుగుతున్న అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు రెండు వెండి, ఏడు కాంస్య పతకాలు గెలుచుకున్నారు.



తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి నుంచి ట్రోఫీ స్వీకరిస్తున్న అంజనీకుమార్

పేరు	హోదా	పనిచేసే ప్రాంతం	విభాగం	పతకం
కె.శ్రీనివాస్	కానిస్టేబుల్	కరీంనగర్,క్లూస్	ఫొటోగ్రఫీ	వెండి
టి.మురళీమోహన్	కానిస్టేబుల్	హైదరాబాద్, సీసీఎస్	వీడియోగ్రఫీ	వెండి
ఎస్.అనిల్‌కుమార్	ఎస్సై	రాచకొండ	ఫొటోగ్రఫీ	కాంస్య
బి.లక్ష్మినారాయణరెడ్డి	సీఐ	హైదరాబాద్	హ్యాండ్లింగ్, లిఫ్టింగ్	కాంస్య
ఎండీ జావెద్ పాష	కానిస్టేబుల్	హైదరాబాద్	పరిశీలన పరీక్ష	కాంస్య
జి.గణేష్	ఎస్సై	కమ్యూనికేషన్స్	కంప్యూటర్ అవగాహన	కాంస్య
పి.సంజీవరావు	హెడ్‌కానిస్టేబుల్	సీఐడీ	కంప్యూటర్ అవగాహన	కాంస్య
అంజయ్య	కానిస్టేబుల్	మహబూబాబాద్	బాంబునిర్వీర్య తనిఖీ	కాంస్య
బి.లక్ష్మినారాయణరెడ్డి	సీఐ	హైదరాబాద్	ఫోరెన్సిక్ సైన్స్ రాతపరీక్ష	కాంస్య

కేంద్ర మంత్రి హర్షవర్ధన్ పేరిట ప్రత్యేక యాప్

దిల్లీ: సమస్యలు, అభిప్రాయాలను ప్రజలు తనకు నేరుగా చేరవేసేలా కేంద్ర వ్యవసాయమంత్రి హర్షవర్ధన్ ఓ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. 'డాక్టర్ హర్షవర్ధన్ యాప్' పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు సమాచారాన్ని సందేశాలు, చిత్రాలు, వీడియోల రూపంలో పంపేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. హర్షవర్ధన్ గురించిన వివరాలు, పుస్తకాలు, వార్తలు, నియోజకవర్గ విశేషాలనూ కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ మేరకు వివరాలను హర్షవర్ధన్ బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు.

సహకారం లేనిదే ప్రగతి లేదు: మోహన్ భగవత్

గురుగ్రామ్: 'సహకారం లేదనిదే ఎలాంటి ప్రగతీ లేదు...నైతిక విలువల్లేనిదే సహకారమనేదే లేదు' అని ఆరెస్సెస్ సారథి మోహన్ భగవత్ అన్నారు. 'జాతీయ సహకారాభివృద్ధి సంస్థ'(ఎన్‌సీడీసీ) శిక్షణ కేంద్రాన్ని ఆయన బుధవారం నాడిక్కడ ప్రారంభించారు. ప్రధాని మోదీని తీర్చిదిద్దిన వ్యక్తిగా...ఆరెస్సెస్ నేతగా పేరుగాంచిన లక్ష్మణ్‌రావ్ ఇనాందార్ పేరిట ఈ భవనానికి నామకరణం చేశారు. దేశంలోని సహకార సంస్థల ప్రగతి కోసం ఈ ఎన్‌సీడీసీ పనిచేస్తుంది. తక్కువ వడ్డీరేటుతో సహకార సంస్థలకు రుణాలను అందచేస్తుంది.

ముఖ్యమంత్రి హోలీ శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాష్ట్ర ప్రజలకు బుధవారం హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00